www.prajasakti.com
PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 39 Vol సంచిక : 02 No | విజయవాడ, బుధవారం 02 జనవరి 2019 | 12 +12 పేజీలు వెల : 4.00


తిరువనంతపురంలో జరిగిన బహిరంగ సభలో అశేష మహిళాలోకాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, వేదికపై ముఖ్యమంత్రి పినరయి విజయన్, సిపిఎం సీనియర్ నాయకులు అచ్యుతానందన్



సమానత్వ హక్కుల కోసం కేరళ మహిళాలోకం సమరోత్సాహంతో నినదించారు. కాసర్‌గోడ్ నుంచి తిరువనంతపురం వరకు వనితా మహా కుడ్యాన్ని నిర్మించి కొత్త చరిత్ర సృష్టించారు. ప్రధానఘట్టానికి వేదికగా నిలిచిన తిరువనంతపురంలో మహా కుడ్యంగా ఏర్పడిన మహిళలు - వార్త 8లో

మేఘాలయ గని కార్మికుల రక్షణలో సాంకేతిక సమస్య
8

అణగదొక్కుతున్న మోడీ



- ఎన్‌డిఎలో వృద్ధి ఎక్కడ పెరిగింది
- త్వరలో ప్రతి ఇంటికీ స్మార్ట్ ఫోన్
- ఆర్థిక రంగంపై శ్వేత పత్రం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రాలకు సాయం చేయాల్సిన ప్రధాని నరేంద్రమోడీ అణగదొక్కేందుకు ప్రయత్నిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. ఆర్థికశాఖపై మంగళవారం శ్వేతపత్రాన్ని విడుదల చేసిన సందర్భంగా ఆయన మాటాడుతూ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయంపై ధ్వజమెత్తారు. సాయం కోసం అడిగితే తొక్కేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇక రాష్ట్రంపై మోడీ, కెసిఆర్, జగన్ ముగ్గురు మోడీలుగా మారి కుట్ర చేస్తున్నారని అన్నారు.

గత నాలుగేళ్లుగా కేంద్రం నుంచి ఎటువంటి సహకారం లభించడం లేదని, విభజన హామీలను కూడా అమలు చేయడం లేదని గుర్తు చేశారు. ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటుచేస్తామని చెప్పి తప్పుకున్నారని, భూమి ఉచితంగా ఇస్తున్నప్పటికీ, ఎందుకు సహకరించడం లేదో అర్థం కావడం లేదన్నారు. విభజన కష్టాల నుంచి గట్టెక్కేందుకు సమర్థుడైన నాయకుడు కావాలని తనను గెలిపించారని, అయితే కేంద్రం ఇగోను కాపాడేందుకే తాను కొంతవరకు తగ్గి వారితో ముందుకెళ్లానని మిగతా 9లో

ఆదాయం ఏమవుతోంది?

- ఐదేళ్లలో సొంత పన్నులు 90వేల కోట్లు పెరుగుదల
- అయినా పెట్టుబడి వ్యయానికి మొండిచెయ్యే!
- శ్వేతపత్రంలో స్పష్టతనివ్వని ప్రభుత్వం

2


హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌తో ప్రమాణం చేయిస్తున్న గవర్నర్ నరసింహన్

జస్టిస్ ప్రవీణ్‌కుమార్ అనే నేను..

ఎపి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతల స్వీకారం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తిగా చాగరి ప్రవీణ్ కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడ ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియంలో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ హైకోర్టు ప్రధాన న్యాయమూరితో పాటు మరో 13 మంది హైకోర్టు న్యాయమూర్తులతో కూడా ప్రమాణ స్వీకారం చేయించారు. న్యాయమూర్తులు జస్టిస్ వెంకట నారాయణ భట్టు, జస్టిస్ ఎ వెంకట శేష సాయి, జస్టిస్ ఎమ్ సీతారామ మూర్తి, జస్టిస్ యు దుర్గాప్రసాదరావు, జస్టిస్ టి సునీల్ చౌదరి, జస్టిస్ ఎమ్ సత్యనారాయణ మూర్తి, జస్టిస్ జి శ్యామ్‌ప్రసాద్, జస్టిస్ జె ఉమాదేవి, జస్టిస్ ఎన్ బాలయోగి, జస్టిస్ టి రజని, జస్టిస్ డివిఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ కె విజయలక్ష్మి, జస్టిస్ ఎం గంగారావు ఎపి హైకోర్టు మిగతా 9లో

నేటి నుండి 'జన్మభూమి- మా ఊరు'

2



ప్రారంభోత్సవ సభలో ప్రసంగిస్తున్న సిసోడియా

పుస్తకాల విలువ తెలుసుకోవాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆర్‌పి. సిసోడియా

విజయవాడ పుస్తక మహోత్సవం ప్రారంభం

2

ఆ తర్వాతే అయోధ్య!



న్యూఢిల్లీ : అయోధ్యపై న్యాయ ప్రక్రియ పూర్తి అయిన అనంతరమే ఆర్డినెన్స్ గురించి పరిశీలిస్తామని ప్రధాని మోడీ మంగళవారం స్పష్టం చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా మీడియాకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో అయోధ్య అంశంపై దేశవ్యాప్తంగా జరుగుతున్న చర్చ, కోర్టు తీర్పులో జరుగుతున్న జాప్యం, ఆర్డినెన్స్ వంటి అంశాలపై ప్రధాని మొదటిసారిగా మాట్లాడారు. న్యాయప్రక్రియ పూర్తయిన అనంతరం తమ ప్రభుత్వం చేయాల్సి ప్రక్రియలన్నీ పూర్తి చేస్తామని ప్రధాని పేర్కొన్నారు. అయోధ్య కేసు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. కాగా, ఈ వారంలో ఈ కేసుపై విచారణ జరుగుతుందేమోనన్న అభిప్రాయాన్ని మోడీ వ్యక్తం చేశారు. అయితే రామాలయ నిర్మాణానికి ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురావాలని శివసేనతో సహా హిందూత్వ సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి. రాజ్యాంగ పరిధిలోనే ఈ వివాదాన్ని పరిష్కరిస్తామని తమ మ్యానిఫెస్టోలో పేర్కొన్నామని మోడీ ఈ సందర్భంగా గుర్తు చేశారు. కోర్టులో కాంగ్రెస్ న్యాయవాదులు అవరోధాలను సృష్టిస్తున్నారని, అందువల్ల న్యాయ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోందని ఆరోపించారు. అయోధ్యలోని ఆలయ నిర్మాణం బిజెపి అజెండా మాత్రమే, ఎన్‌డిఎ అజెండా కాదని బీహార్‌లోని బిజెపి మిత్రపక్షాలు వ్యాఖ్యానించడం గమనార్హం.

మహాకూటమి విఫలం

రానున్న ఎన్నికలలో మహాకూటమికి, ప్రజలకు మధ్యే పోటీ ఉంటుందని, అసలు మహాకూటమి అన్న మాటకు అర్థం మిగతా 9లో

కుంభమేళాతో అభివృద్ధి జరగదు

యోగి ఆధిత్యనాథ్‌పై బిజెపి మాజీ నేత సావిత్రి బాయి పూలే విమర్శ

8

ఎన్నికల ప్రచారానికి జనసేన శ్రీకారం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడ కేంద్రంగా 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి ఇవాళ్టి నుంచే శ్రీకారం చుడుతున్నామని జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మంగళవారం తెలిపారు. విజయవాడలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నూతన సంవత్సరం వేడుకలు మంగళవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సమరానికి శంఖం పూరించామని ఆయన తెలిపారు. భవిష్యత్ నిర్మాణంలో జనసేన పార్టీ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. జన సైనికులు ప్రజల్లోకి వెళ్లి పార్టీ సిద్ధాంతాలు ప్రచారం చేయాలనీ, అవినీతి రహిత పాలన కోసం అందరూ కషి చేయాలని కోరారు. నూతన సంవత్సరంలో రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు ఉండాలని, తెలుగు రాష్ట్రాల్లో ప్రతి ఇంటా సుఖ సంతోషాలు వెల్లివిరియాలని పవన్ కళ్యాణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి రావెల కిశోర్ బాబు, ఇతర నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయలసీమలో హైకోర్టు

న్యాయవాదుల జెఎసి డిమాండ్ - అనంత, కడపలో నిరసనలు

ప్రజాశక్తి- కడప/అనంతపురం కలెక్టరేట్

శ్రీబాగ్ ఒడంబడిక ఒప్పందాన్ని ప్రకారం హైకోర్టు రాయలసీమలోనే ఏర్పాటు చేయాలని న్యాయవాదుల జెఎసి ఆధ్వర్యంలో అనంతపురం, కడపల్లో మంగళవారం ఆందోళనలు జరిగాయి. అమరావతిలో తాత్కాలిక హైకోర్టు ఏర్పాటు సందర్భంగా చీఫ్ జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌తో గవర్నర్ నరసింహన్ ప్రమాణ స్వీకారాన్ని చేయించడాన్ని నిరసిస్తూ కడప జిల్లా కోర్టు ఎదుట రోడ్డుపై బైఠాయించి నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ మస్తాన్‌వలి మాట్లాడుతూ హైకోర్టు విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాయలసీమ ప్రజలకు, ప్రాంతానికి తీరని అన్యాయం చేశారని విమర్శించారు. పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతపురంలోనూ నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కోర్టు ఎదుట, టవర్‌క్లాక్ సర్కిల్, ప్రజా ప్రతినిధుల ఇళ్ల వద్ద ఈ కార్యక్రమం జరిగింది. జేఏసీ నాయకులు రామ్ కుమార్ మాట్లాడుతూ రాయలసీమకు జరుగుతున్న అన్యాయంపై రాయలసీమ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి అధికార వికేంద్రీకరణ చేయాలని నాటి మిగతా 9లో


అనంతపురంలో న్యాయవాదుల నిరసన

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ : ప్రకాష్‌రాజ్

న్యూఢిల్లీ : ప్రముఖ సినీనటుడు ప్రకాష్ రాజ్ ప్రత్యక్ష రాజకీయాలలోకి రానున్నారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు సోమవారం రాత్రి ప్రకటించారు. అయితే ఏ నియోజక వర్గం నుండి పోటీ చేయాలన్న విషయమై నిర్ణయం తీసుకోవలసి ఉందని చెప్పారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు.

ఇటీవల కాలంలో రాజకీయ రంగంలోకి అడుగుపెట్టిన సినీ రంగ ప్రముఖులలో ప్రకాష్ రాజ్ మూడో వ్యక్తి. నటులు కమల్‌హసన్, రజనీకాంత్‌లు కూడా రాజకీయ రంగ ప్రవేశం చేసిన వారిలో ఉన్నారు. తన స్నేహితురాలైన జర్నలిస్టు గౌరీ లంకేష్ హత్య విషయంలో న్యాయం కోరుతూ ప్రకాష్ రాజ్ తన గళాన్ని వినిపించారు. ఆయన తొలి నుండి వివిధ విషయాలపై మోడీ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న సంగతి తెలిసిందే. కేంద్రంలో అధికారంలో కొనసాగుతున్న మోడీ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నందునే తనకు బాలీవుడ్‌లో అవకాశాలు రావడం లేదని ప్రకాష్ రాజ్ అంతకుముందు విమర్శించారు.

ఓటర్లకు ఎస్‌విఇఇపి ద్వారా అవగాహన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా నూతన ఓటర్లను ఎన్నికల్లో భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశంతో పుస్తక మహోత్సవంలో ఓటర్ల కోసం స్టాల్‌ను ఏర్పాటు చేశామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ఆర్‌పి సిసోడియా అన్నారు. మంగళవారం పిడబ్ల్యూడి గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన 30వ పుస్తక మహోత్సవం ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

అక్కడ ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించారు. ఆ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ ఓటర్లకు సిస్టమాటిక్ ఎన్‌రోల్ అండ్ ఎడ్యుకేషన్ పార్టిసిపేషన్ (ఎస్‌విఇఇపి) యాక్టివిటీ ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. కృష్ణాజిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం మాట్లాడుతూ కొత్తగా ఓటర్లను నమోదు చేయటంతో పాటు, పేర్లు తప్పు ఉన్న వాటిని కూడా సరిదిద్దుతారని తెలిపారు. శాసనమండలి ఎన్నికలకు ఓటు నమోదు చేసుకోని వారికి ఫారం నెంబరు-18ను స్టాల్లో అందుబాటులో ఉంచామని, గ్రాడ్యుయేట్లకు ఇది సదావకాశమని అన్నారు. అనంతరం రెవెన్యూశాఖ 'ఓటర్ల అవగాహన' పై ఏర్పాటు చేసిన సైకత శిల్పాన్ని సందర్శించారు.



ఎన్నికలపై అవగాహన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సిసోడియా

ఐదేళ్లకు గ్రామ ప్రణాళికలు

- నేటి నుండి 'జన్మభూమి- మా ఊరు'
- తొలిరోజు కుప్పంలో పాల్గొననున్న సిఎం

ప్రజాశక్తి -అమరావతి బ్యూరో

నేటి నుండి ఆరో విడత జన్మభూమి ప్రారంభం కానుంది. ఈనెల 11 వరకు జరిగే ఈ కార్యక్రమంలో పది అంశాలపై చర్చించనున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రాలపైనా చర్చిస్తారు. బుధవారం ఉదయం కుప్పంలో జరిగే జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొంటారు. కార్యక్రమ నిర్వహణకు రెవెన్యూ డివిజన్ల వారీగా నోడల్ అధికారులను నియమించారు. రియల్‌టైమ్ గవర్నెన్స్ వీరందరినీ సమన్వయం చేయనుంది. ఈ కార్యక్రమం మొత్తాన్ని ప్రణాళికాశాఖ పర్యవేక్షిస్తుంది. పది రోజుల కార్యక్రమంలో భాగంగా వయాడక్ట్, 2014 నుండి సాధించిన విజయాలు, 2019-24కు గ్రామాభివృద్ధి ప్రణాళికలను ప్రకటిస్తారు. చివరి రోజు అన్ని గ్రామసభల్లోనూ ఒకేసారి ప్రణాళికను ప్రకటించనున్నారు. ఆ రోజునే గ్రామ దార్శనిక పత్రాన్ని కూడా ప్రకటిస్తారు. జన్మభూమి జరుగుతున్నన్ని రోజులూ విజ్ఞాన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతిరోజూ సభ ప్రారంభానికి ముందు సిఎం సందేశాన్ని చదివి వినిపిస్తారు. ప్రజల నుండి వచ్చే వినతులను అప్పటికప్పుడే అప్‌లోడ్ చేయాలని నిర్ణయించారు. ఉచితవైద్య శిబిరాలు, చంద్రన్న సంచార చికిత్స బృందాలు, ఆయుష్ వైద్య బృందాల సేవలనూ వినియోగించుకోనున్నారు. జిల్లాల వారీగా టాప్ టెన్ అభివృద్ధి కార్యక్రమాలను గ్రామసభల్లోనే ప్రకటిస్తారు. ఈ సభల్లోనే స్ప్లిట్ రేషన్‌కార్డులు అందజేయనున్నారు. ప్రతి మండల కేంద్రంలోనూ, మున్సిపల్ కేంద్రంలోనూ ఉదయం 6.30 గంటల నుండి 7.30 గంటల వరకూ 5కె రన్ నిర్వహించనున్నారు. గ్రామాల్లో వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖనం, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు చివరిరోజున బహుమతులు అందజేస్తారు.

ఒడా ఏర్పాటుకు జీఓ జారీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఒడా) ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 39 మండలాలు, 344 గ్రామాలు, గుంటూరు జిల్లాలోనీ 2 మండలాలు, 15 గ్రామాలు, ఒంగోలు కార్పొరేషన్ చీరల, మర్కాపురం కందుకూరు మున్సిపాలిటీలు ఒడా పరిధిలోకి రానున్నాయి.

గన్నవరం రైతులకు ప్లాట్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గన్నవరం విమానాశ్రయం కోసం భూములిచ్చిన రైతులకు అమరావతిలో ప్లాట్లు కేటాయించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు మంగళవారం జీఓ విడుదల చేసింది. ప్లాట్లకు స్టాంప్ డ్యూటీ మొత్తం 18.88 కోట్లు మినహాయింపునిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

ప్రజ్ఞ

1 మహిళా క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ 2018 ఎవరు?
2. కేంద్ర ప్రధాన సమాచార కమిషనర్‌గా ఎవరు ఎన్నికయ్యారు?
3. ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ఎవరు?
4. భారత రైల్వే బోర్డు చైర్మన్‌గా ఎవరిని నియమించారు?
5. ఇటీవల మరణించిన లోక్‌నాథ్ ఏ భాష నటుడు?

సమాధానాలు 7లో

ఆదాయం ఏమవుతోంది?

- ఐదేళ్లలో సొంత పన్నులు 90వేల కోట్లు పెరుగుదల
- అయినా పెట్టుబడి వ్యయానికి మొండిచెయ్యే!
- శ్వేతపత్రంలో స్పష్టతనివ్వని ప్రభుత్వం



ఆర్థిక రంగంపై శ్వేతపత్రాన్ని విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉన్నతాధికారులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రానికి వస్తున్న ఆదాయం ఏమవుతోంది? పన్నులు, అప్పుల రూపంలో ఖజానాకు వస్తున్న లక్షల కోట్ల రూపాయలు ఏమవుతున్నాయి? ఖర్చు చేసినట్టుగా చెబుతున్న మొత్తానికి వస్తున్న ప్రతిఫలం ఏమిటి? ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తాజాగా విడుదల చేసిన శ్వేతపత్రంలోనూ ఈ ప్రశ్నలకు జవాబులు లభించలేదు. కేవలం గత ప్రభుత్వ హయానికి, ఇప్పటికి ఉన్న తేడాను, కేంద్రం చేస్తున్న సహాయ నిరాకరణను మాత్రమే ఎక్కువగా ప్రస్తావించింది. దీంతో ఆదాయ, వ్యయాలకు సంబంధించి వాస్తవాలు ప్రజలకు తెలియని పరిస్థితి నెలకొంది. సరిగ్గా నాలుగున్నర సంవత్సరాల క్రితం 2014 జూలై తొమ్మిదన చంద్రబాబు విడుదలచేసిన శ్వేతపత్రాన్ని, తాజాగా మంగళవారం విడుదల చేసిన శ్వేతపత్రాన్ని పరిశీలిస్తే వాస్తవంగా చెప్పాల్సింది చెప్పడం లేదని అర్థమవుతుంది.

అధికారవర్గాల్లోనూ ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. సాధారణ సొంత పన్నుల ఆదాయాన్ని 2004-05లో సమైక్య రాష్ట్రానికి 31,307 కోట్లతో ప్రతిపాదించగా, అది విభజనకు ముందు సంవత్స రానికి 1.10 లక్షల కోట్లకు చేరుకుంది. రాష్ట్ర విభజన జరిగిన తరువాత చంద్రబాబు పాలనా పగ్గాలు చేపట్టిన నాటికి ఆంధ్రప్రదేశ్‌లో సొంత పన్నుల ఆదాయం 15,555 కోట్ల రూపాయలు. అక్కడి నుంచి వరుసగా 38,038 కోట్లు, 44,841 కోట్లు, 49,374 కోట్లు, 56,704 కోట్లుగా పెరిగి తాజా బడ్జెట్‌లో 70,8881 కోట్లకు చేరింది. అంటే ఐదేళ్లలో దాదాపు 55 వేల కోట్లు సొంత పన్నుల ఆదాయం పెరిగింది. ఇంతలా ఆదాయం పెరిగినా అందుకు అను గుణంగా అభివృద్ధి కనిపించడం లేదన్న విమ ర్శలు వస్తు న్నాయి. దీనికి కారణం అభివృద్ధికి కీలకమైన పెట్టుబడి వ్యయానికి ఖర్చు చేయకపోవడమే! 2004-05లో 11.8 శాతంతో 5414 కోట్లు పెట్టుబడి వ్యయంగా ఖర్చు చేశారు. ఆ తరువాత రాష్ట్ర విభజనకు ముందు ఏడాదికి పెట్టుబడి వ్యయం 15,280 కోట్లకు చేరుకుంది. తరువాత చంద్రబాబు ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన 2014-15 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో 4,885 కోట్లుగా ఉన్న పెట్టుబడి వ్యయం 2015-16, 2016-17 నాటికి 15 వేల కోట్లకు చేరుకుంది. ఇది మొత్తం ఖర్చులో కేవలం పది శాతంగానే కనిపిస్తోంది. ఇక 2017-18లో 1.47 లక్షల కోట్ల రూపాయలను మొత్తం వ్యయంగా చూపించగా, అందులో పెట్టుబడి వ్యయానికి ఖర్చు చేసింది కేవలం 9.5 శాతమే! అధికార వర్గాలు ఈ విషయాన్ని ధృవీకరిస్తున్నాయి.

అంకెల్లో అంతరాలు

ఇటీవల రాష్ట్రాన్ని సందర్శించిన 15వ ఆర్థిక సంఘానికి ఇచ్చిన నివేదికలోని అంకెలకు, శ్వేతపత్రంలో చూపిస్తున్న అంకెలకు మధ్య భారీ అంతరాలు కనిపిస్తున్నాయి. మొత్తం వ్యయంలో ఈ తేడాలు గోచరిస్తున్నాయి. 2017-18లో మొత్తం వ్యయం 1.37 లక్షల కోట్లుగా శ్వేతపత్రంలో చూపించగా, ఆర్థిక సంఘానికి ఇచ్చిన నివేదికలో రెవెన్యూ వ్యయం 1.27 లక్షల కోట్లుగా చూపించారు. దానిని 13వేల కోట్ల పెట్టుబడి వ్యయాన్ని కలిపినా మొత్తం వ్యయం 1.40 లక్షల కోట్లకు చేరుతుంది. శ్వేతపత్రంలో వ్యయాన్ని తక్కువగా చూపించినట్లుగా అధికారులు విశ్లేషిస్తున్నారు.

అప్పుల వినియోగంపైనా అయోమయమే

ఇక ఇబ్బడిముబ్బడిగా చేస్తున్న అప్పులను వినియోగిస్తున్న తీరుపైనా ఆయోమయం నెలకొంది. 2014-15లో పబ్లిక్‌డెట్ 1.09 లక్షల కోట్లుగా ఉండగా, మొత్తం రుణం 1.48 లక్షల కోట్లుగా రికార్డయింది. ఆ తరువాత కాలంలో ఆ రుణాలు ప్రతియేటా పెరుగుతూ 2017-18 నాటికి పబ్లిక్ డెట్ 1.68 లక్షల కోట్లకు, మొత్తం రుణం 2.16 లక్షల కోట్లకు చేరుకుంది. ఈ రుణాలు జిఎస్‌డిపిలో 28 శాతం వరకు ఉంటున్నాయి. ఇది ఎఫ్ఆర్‌బిఎం నియమావళికి విరుద్ధమని అధికారులు చెబుతున్నారు. ఇంత భారీ అప్పులు చేస్తున్నప్పటికీ, వాటిని ఉత్పాదకత దిశగా వ్యయం చేయడం లేదన్న విమర్శలూ ఉన్నాయి. వీటిని కూడా శ్వేతపత్రంలో పొందుపరిచి విశ్లేషించకపోవడం గమనార్హం.

పాక్ జైళ్లలో 537 మంది భారతీయులు

ఇస్లామాబాద్ / ప్రజాశక్తి అమరావతి బ్యూరో : పాకిస్తాన్ జైళ్లల్లో ఖైదీలుగా 537 మంది భారతీయులు ఉన్నట్లు దాయాది దేశం ఒక జాబితాను మంగళవారం సమర్పించింది. ద్వైపాక్షిక ఒప్పందాల నిబంధనల నిమిత్తం జాబితాను వెల్లడించింది. ఇందులో 54 మంది పౌరులుండగా, 483 మంది మత్స్యకారులున్నారని విదేశీ కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది. పాకిస్తాన్‌లోని ఇస్లామాబాద్‌లో ఉన్న భారత రాయబార కార్యాలయానికి ఈ జాబితాను ప్రభుత్వం అప్పగించినట్లు పేర్కొంది. 2008 మే 21లో చేసుకున్న ఒప్పందాల ప్రకారం ఈ చర్య తీసుకున్నట్టు తెలిపింది. ఒప్పందం ప్రకారం, ప్రతి ఏడాది జనవరి 1, జూలై 1న రెండుసార్లు ఆయా దేశ జైళ్లలో మగ్గుతున్న ఖైదీల జాబితాను వెల్లడించాల్సి ఉంటుంది.

మత్స్యకారుల విడుదల కోసం కేంద్రానికి చంద్రబాబు లేఖ

గతేడాది నవంబర్ 29న గుజరాత్ దగ్గరలో వేటకు వెళ్లి పాకిస్తాన్‌కు బందీలైన 22 మంది మత్స్యకారులను విడిపించాలని కోరుతూ కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం లేఖ రాశారు. మత్స్యకారులంతా శ్రీకాకుళానికి చెందినవారని, పొట్టకూటి కోసం గుజరాత్‌కు వెళ్లి పాకిస్తాన్ చెరలో చిక్కుకున్నారని, దీంతో వారి కుటుంబీకులు అనాథలయ్యారని లేఖలో పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున 11 కుటుంబాలకు రూ.22 లక్షలు సాయం అందించిందన్నారు.

9న ఇచ్ఛాపురంలో జగన్ పాదయాత్ర ముగింపు

- మద్దతుగా సంఘీభావ సభలు
- వైసిపి ప్రధాన కార్యదర్శి సజ్జల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర ఈనెల 9న ఇచ్ఛాపురంలో ముగుస్తుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. పాదయాత్రలో వైఎస్ జగన్ ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయదగినవేనని, ఎన్నికల మేనిఫెస్టోలో కూడా చేరుస్తామని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన...పాదయాత్ర ముగింపు సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో సంఘీభావ సభలు, యాత్రలు చేపట్టనున్నట్లు తెలిపారు. వారం రోజుల పాటు సంఘీభావ సభల్ని నిర్వహిస్తారన్నారు. రాష్ట్ర చరిత్రలో ప్రజాసంకల్ప యాత్ర చారిత్రాత్మకమైనదని, ఏడాదికిపైగా సాగిన యాత్ర ద్వారా పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపారన్నారు. ఇప్పటి వరకు 134 నియోజకవర్గాల్లో 120 బహిరంగ సభలు, రెండు వేలకు పైగా గ్రామాలు, 3,500 కిలోమీటర్లకు పైగా పాదయాత్ర సాగిందని వివరించారు. చంద్రబాబు నాయుడు అసమర్థత కారణంగా విభజన కష్టాలతో పాటు కొత్త కష్టాలు వచ్చిపడ్డాయన్నారు. ఉద్యోగాల భర్తీలోనూ నిరుద్యోగుల్ని మోసం చేశారన్నారు. రాష్ట్రంలో 2 లక్షల ఉద్యోగ ఖాళీలు ఉంటే, కేవలం 1500 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్లు ఇచ్చారన్నారు. ఎన్నికల దగ్గరపడుతుండటంతో చంద్రబాబు తిరిగి డ్రామాలు మొదలు పెట్టారన్నారు. జగన్ చేపట్టిన పాదయాత్ర మహోద్యమంగా మారిందని, రాబోయే రోజుల్లో రాష్ట్ర భవిష్యత్‌నే మార్చబోతుందని వైసిపి అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ అన్నారు.

పుస్తకాల విలువ తెలుసుకోవాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆర్‌పి. సిసోడియా
- విజయవాడ పుస్తక ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

పుస్తకాల విలువను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరముందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, కవి, రచయిత ఆర్‌పి సిసోడియా అన్నారు. స్వరాజ్య మైదాన్‌లో 30వ విజయవాడ పుస్తక మహోత్సవాన్ని మంగళవారం ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ప్రారంభోపన్యాసంలో సిసోడియా మాట్లాడుతూ నేడు పుస్తకాలపై ఆసక్తి తగ్గిందని, డిజిటల్ పుస్తకాలు ఇటీవల కాలంలో పెరిగాయని అన్నారు. ప్రతి ఒక్కరికీ విజ్ఞానం అవసరమని, అది డిజిటల్ ద్వారా సాధ్యం కాదని, మంచి పుస్తకాలు చదివితేనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. విజయవాడలో ఎంతో మంది ప్రముఖ రచయితలు ఉన్నారని, పబ్లికేషన్ రంగం కూడా పెరిగిందన్నారు. విజయవాడలో 30 ఏళ్లగా నిరంతరం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. ప్రముఖ చరిత్రకారులు ఆచార్య రాజమోహన్ గాంధీ మాట్లాడుతూ పుస్తకాలు మంచి విజ్ఞానాన్ని, నడవడికను నేర్పుతాయన్నారు. మహాత్మాగాంధీ పుస్తకాలు ఎన్నో చదివానని, ఆయనే తనకు ఆదర్శమని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన రాష్ట్ర శాసన సభ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ప్రసిద్ధమైన ప్రచురణ సంస్థలకు విజయవాడ పేరుగాంచిందన్నారు. విజయవాడ నగర ప్రతిష్టను ఇనుమడింప చేయడంలో పుస్తక మహోత్సవానికి విశిష్టస్థానం ఉందన్నారు. పుస్తక పఠనం పట్ల అభిరుచి కలిగించేందుకు పుస్తక మహోత్స వాలు తోడ్పడతాయని తెలిపారు. ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ పుస్తక ప్రచురణల వల్లే రచయితలు తయారవుతున్నా రన్నారు. ప్రచురణ రంగంలో కూడా ఇటీవల కాలంలో పెద్ద ఎత్తున మార్పులు వచ్చాయని, వాటి గురించి యువ రచయితలు తెలుసుకోవాల్సిన అవసరముందని సూచించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు అధ్యక్ష కార్యదర్శులుగా పనిచేసిన వారికి ఘన సత్కారం చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ కోనేరు శ్రీధర్, జిల్లా కలెక్టర్ కె.లక్ష్మీకాంతం, ప్రముఖ తత్వవేత్త ఆచార్య ఎ.రఘురామరాజు, హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ అధ్యక్షులు జూలూరి గౌరీశంకర్, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి కె.లక్ష్మయ్య, గౌరవాధ్యక్షులు బెల్లపు బాబ్జి, అధ్యక్షులు వెంకట నారాయణ, సమన్వయ కర్త ఎమెస్కో విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేసి పుస్తక మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న ప్రఖ్యాత రచయిత కొలకలూరి ఇనాక్

డిఎస్‌సికి 79.69 శాతం హాజరు

నేడు పిఇటి పోస్టులకు పరీక్ష

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డిఎస్‌సి టిజిటి పోస్టుల భర్తీ కోసం మంగళవారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం జరిగిన సోషల్ పరీక్షకు 13,532 మందికి గాను 10,906(80.59శాతం)మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన ఇంగ్లీష్ పరీక్షకు 13,533 మందికిగాను 10,661 (78.78శాతం) మంది హాజరయ్యారు. మొత్తం 27,065 మందికిగాను 21,567 (79.69శాతం) మంది హాజరయ్యారు. స్కూల్ అసిస్టెంట్ పిఇటి పోస్టులకు బుధవారం పరీక్ష జరుగనుంది. 476 పోస్టులకు రెండు పూటలా పాఠశాల విద్యాశాఖ పరీక్ష నిర్వహించనుంది. ఈ నెల 4 నుంచి పిఇటి అభ్యర్థులకు ఫిజికల్ టెస్ట్ పరీక్షలు జరుగుతాయి. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అభ్యర్థులకు రెండు సెషన్‌లలో ఫిజికల్ టెస్ట్‌ను నిర్వహిస్తారు. ఈ నెల 13 వరకు ఫిజికల్ టెస్ట్‌లు జరుగుతాయి. పురుషులకు 100, 800 మీటర్ల విభాగాల్లో పరుగు పోటీ, హై జంప్, లాంగ్ జంప్ పోటీలు ఉంటాయి. స్కూల్ అసిస్టెంట్ (భాష, భాషేతర) పరీక్షల ప్రాథమిక 'కీ'పై అభ్యంతరాలను బుధవారం సాయంత్రం 5 గంటల లోగా పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి.

మోడీ దుష్ట పాలన : తులసిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రధాని నరేంద్రమోడీ ఆధ్వర్యంలో దుష్టపరిపాలన సాగుతోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్ తులసిరెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో తులసిరెడ్డి మాట్లాడారు. స్థూల జాతీయ ఉత్పత్తి వృద్ధిరేటు తగ్గి, వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వకపోవడం, విభజన చట్టంలోని అంశాలు అమలు చేయకపోవడంతో రాష్ట్రప్రజలకు అచ్ఛేదిన్‌కు బదులు చచ్చేదిన్ దాపురించిందని వ్యాఖ్యానించారు. ఈ ఏడాది జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని, రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని అన్నారు.

ఆర్టీసి క్రమశిక్షణా చర్యలలో మార్పులు

- నెల రోజుల్లోగా అప్పీళ్ల పరిష్కారం
- ఆర్టీసి ఎండి ఉత్తర్వులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్టీసి సిబ్బంది తప్పులకు వేసే శిక్షల్లో మార్పులు చేశారు. క్రమశిక్షణా చర్యల్ని సవరిస్తూ ఆర్టీసి ఎండి ఎన్‌వి సురేంద్రబాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. క్షేత్ర స్థాయిలో పరిశీలనల్లో తమ దృష్టికొచ్చిన విషయాలు, కార్మిక సంఘాల నుంచి వచ్చిన అభ్యంతరాల ఆధారంగా పలు మార్పులు చేసినట్లు తెలిపారు. ఉద్యోగి తప్పు లేకుండా శిక్షల్లో భాగమైన పాయింట్లను కేటాయిస్తున్నారని వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సవరణలు చేశామని పేర్కొన్నారు. ఆరు పాయింట్లకు చార్జ్‌షీట్ ఇచ్చిన తరువాత, దానికి సంబంధించిన శిక్షను ఉద్యోగి అమలు చేశాక గతంలోలాగా పాయింట్ల కొనసాగింపు కాకుండా రెండో సెట్‌గా పాయింట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. టిటిఐలు బస్సులను తనిఖీ చేసే సమయాల్లో వేసే శిక్షల జాబితా నుంచి 21 తప్పుల్ని తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. చిన్న తప్పులకు సంబంధించిన కేసుల్ని నెల రోజుల్లో పరిష్కరిస్తామని, సిబ్బంది గడువులోగా వివరణను సమర్పించాల్సి ఉంటుందని, పెద్ద తప్పులకు సంబంధించిన కేసుల్లో సిబ్బంది వివరణను ఇవ్వకపోతే శిక్షను అమలు చేస్తామని తెలిపారు. శిక్షలపై అప్పీల్‌ను ఉద్యోగి తప్పుల చరిత్ర, పనితీరు, అవార్డులను ఆధారం చేసుకుని పరిశీలిస్తామని, అప్పీళ్లను కూడా నెల లోగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ సిబ్బందికి సంబంధించి యూనిట్ అధికారులు విచారణ చేసి క్రమశిక్షణా చర్యలు తీసుకుంటారని, రెగ్యులర్ ఉద్యోగులకు ఉత్తర్వుల్లో ఉన్న శిక్షలను అమలు చేస్తామని తెలిపారు. టైర్, స్ప్రింగ్, షటర్ వంటి చిన్న నష్టాలకు ఉద్యోగిని బాధ్యులుగా చేయకూడదని, ఉద్యోగి తప్పు ఉన్నా బస్, సంస్థ ఆస్తి వంటి పెద్ద నష్టాలకు మాత్రమే చార్జ్‌షీట్ ఇవ్వాలని పేర్కొన్నారు. చిన్న తప్పులకు సస్పెన్షన్‌ను ఎత్తేస్తున్నట్లు, ఒకేసారి రెండు పాయింట్లు కేటాయించకుండా ఒక పాయింట్ కేటాయించి హెచ్చరించనున్నట్లు తెలిపారు. మైనర్-4 తప్పులకు ఒక ఏడాది ఇంక్రిమెంట్, మైనర్-5 తప్పులకు చార్జ్‌షీట్ ప్రకారం రెండేళ్ల ఇంక్రిమెంట్ కోత విధించనున్నట్లు పేర్కొన్నారు. పెద్ద తప్పుల్లో మేజర్-1 తప్పుకు విచారణ చేపట్టి ఒక ఏడాది ఇంక్రిమెంట్ కోత విధిస్తామని, మేజర్-4 తప్పుకు తప్పనిసరిగా సస్పెండ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. మైనర్-1, మైనర్-2 తప్పులు పునరావృతమైనా అదే స్థాయి తప్పులుగా పరిగణిస్తామని పేర్కొన్నారు.

మౌలిక అంశాల్ని విస్మరించారు : ఎస్‌డబ్ల్యూఎఫ్

శిక్షల్లో కొన్ని సానుకూల మార్పులు ఉన్నా ఉద్యోగ భద్రతకు సంబంధించిన మౌలిక అంశాలను యాజమాన్యం విస్మరించిందని ఆర్టీసి ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కె జిలానీ బాషా, ప్రధాన కార్యదర్శి సిహెచ్ సుందరయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షలపై ఎస్‌డబ్ల్యూఎఫ్ మాత్రమే నిర్దిష్ట ప్రతిపాదనలు ఇచ్చిందని, వాటిలో అనేక అంశాలను పరిగణలోకి తీసుకున్నారని తెలిపారు. శిక్షల్లో మార్పులు రావడం పోరాట ఫలితమేనని పేర్కొన్నారు.

ప్రత్యేకం

మంచి నీరూ కరువే

- పట్టణాల్లో కావాల్సింది 2566 ఎంఎల్‌డి
- అందుబాటులో ఉంది 1718 ఎంఎల్‌డి
- నాలుగేళ్లలో పెరిగింది 185 ఎంఎల్‌డి మాత్రమే
- ప్రభుత్వం చెబుతున్న లెక్కలు తప్పులతడక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పట్టణ ప్రాంతాల్లో మంచినీటి సదుపాయం విషయంలో ప్రభుత్వం కొంత నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తోంది. రాష్ట్రంలో 110 పట్టణ ప్రాంతాల్లో అవసరమైన నీటి వనరుల కల్పనలో ప్రభుత్వం వెనుకబడింది. పట్టణ ప్రాంతాల్లో రూ.1.05,975 కోట్లతో పనులు చేస్తున్నామని ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రంలో వెల్లడించింది. అందులో మంచినీటి సదుపాయాలకు మాత్రం నామమాత్రంగానే నిధులు కేటాయించింది. గతేడాదిలో దాదాపు 40 పట్టణ ప్రాంతాల్లో నాలుగు రోజులకోసారి మంచినీటిని సరఫరా చేసినట్లు నివేదికల్ని బట్టి తెలుస్తోంది. అన్నిట్లోనూ అభివృద్ధి చెందామని చెబుతున్నా మంచినీటి సరఫరా విషయంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. పట్టణ ప్రాంతాల్లో ప్రతిరోజూ మనిషికి కనీసం 180 లీటర్ల నీరు కావాలి. ప్రస్తుతం 135 లీటర్ల నీటిని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఈ లెక్కన చూసినా 110 పట్టణ స్థానిక సంస్థల్లో 2566 ఎంఎల్‌డి(మిలియన్ లీటర్స్ పర్ డే) అవసరం ఉంది. 2014 నాటికి 534 ఎంఎల్‌డి మాత్రమే సరఫరా ఉందని ప్రభుత్వం లెక్కల్లో చూపించింది. ఈ నాలుగేళ్లలో 180 ఎంఎల్‌డి సామర్థ్యం కల్పించామని పేర్కొంది. ఇక్కడే లెక్కల్లో మతలబు చేశారు. అంతకు ముందున్న సామర్థ్యం, తరువాత కలిపిన సామర్థ్యం రెండూ కలిపినా 718 ఎంఎల్‌డిలే ఉంది. అయినా ప్రభుత్వం మాత్రం 1718 ఎంఎల్‌డిలకు చేరుకున్నామని ప్రకటిం చింది. ఏ లెక్కన ఇది సాధ్యమయ్యిందో అర్థం కాని విధంగా ఉంది. అమృత్, ఆసియాన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు నిధులతో మరో 668 ఎంఎల్‌డి సామర్థ్యాన్ని కల్పించాలని నిర్ణయించారు. ఈఐఐటి కింద 180 ఎంఎల్‌డి సామర్థ్యాన్ని జోడించారు.

అయినప్పటికీ ప్రభుత్వం చెబుతున్న లెక్కలకు పోలిక కుదరడం లేదు. పైగా అన్ని పట్టణ ప్రాంతాల్లోనూ నీటిని సరఫరా చేస్తున్నామని చెబుతున్నా వాస్తవానికి, లెక్కలకు ఏ మాత్రమూ పొంతన కుదరడంలేదు. వనరులు లేవని చెబుతూనే సామర్థ్యానికి దగ్గరగా నీటిని సరఫరా చేస్తున్నామని చెబుతోంది. బోర్‌వెల్స్ నుండి నీటిని తీసుకున్నా ఆ నీరు కూడా సరఫరా సామర్థ్యంలోనే కలిపి ఉంటుంది. ఈ లెక్కన చూసినా ప్రభుత్వం వెల్లడించిన సామర్థ్యానికి, వాస్తవ పరిస్థితులకు ఎక్కడా పోలిక ఉండటం లేదు. మరోవైపు 2016 నాటికి 66 పురపాలక సంఘాల్లో రోజువారీ నీటిని సరఫరా చేశామని, ప్రస్తుతం 98 పురపాలక సంఘాల్లో రోజువారీ నీటిని సరఫరా చేస్తున్నామని ప్రకటించారు. సిఎం డ్యాష్‌బోర్డులో పేర్కొన్న లెక్కల ప్రకారం 21 మున్సిపాలిటీల్లో రెండు రోజులకోసారి నీటిని సరఫరా చేస్తున్నారు.

పైపులైన్లూ అంతంత మాత్రమే...

పట్టణ ప్రాంతాల్లో మంచినీటి సరఫరాకు 23,102 కిలోమీటర్ల మేర పైపులైన్లు కావాల్సి ఉండగా టిడిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చేనాటికి 6442 కిలోమీటర్లు ఉంది. అయితే నాలుగేళ్లలో 8858 కిలోమీటర్ల మేర పైపులైను సదుపాయం కల్పించామని ప్రభుత్వం తెలిపింది. అమృత్, సిఐఐపి, ఎఐఐబి నుండి మరో 7802 కిలోమీటర్ల మేర పైపులైన్లు ఏర్పాటు చేయాల్సి ఉందని స్పష్టం చేసింది. ఇప్పటి వరకూ అందుబాటులో ఉన్న నీటి వనరుల లెక్కల ప్రకారం చూస్తే ఇంకా పెద్దఎత్తున కల్పించాల్సిన అవసరం ఉంది. పైపులైను నెట్‌వర్కు మూడొంతులు పైగా వేశామని ప్రభుత్వం ప్రకటిం చింది. పైపులైన్ నెట్‌వర్కు అభివృద్ధి చెందిందని చెబుతూనే ప్రతిరోజూ 500 ట్యాంకులను నీటి సరఫరాకు వినియోగిస్తున్నారు. వీటి ద్వారా సుమారు 3510 ట్రిప్పులు వేస్తున్నారు.

సంక్షిప్తం

4 లోగా అభ్యంతరాలు తెలియజేయండి : ఎపివివిపి కమిషనర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డెంటల్ అసిస్టెంట్ సర్జన్ల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 4లోగా తమ అభ్యంతరాల్ని తెలియజేయాలని ఎపివివిపి కమిషనర్ దుర్గాప్రసాదరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. 35 మంది డెంటల్ అసిస్టెంట్ సర్జన్ల పోస్టులకు వచ్చిన దరఖాస్తుల్ని పరిశీలించి 3464 మందితో జాబితా రూపొందించామని తెలిపారు. మార్పు, చేర్పులకు m2section_apvvp@yahoo.comకు మెయిల్‌కు అభ్యర్థులు మెయిల్ చేయవచ్చునని సూచించారు.

గురుకులాల క్యాలెండర్ ఆవిష్కరణ

సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల సొసైటీ 2019వ సంవత్సరం క్యాలెండర్‌ను మంత్రి నక్కా ఆనంద్ బాబు మంగళవారం సచివాలయంలో ఆవిష్కరించారు. క్యాలెండర్‌లో పొందుపరచిన ఛాయా చిత్రాలను మంత్రి పరిశీలించారు. విద్యార్థులు వేసిన చిత్రాలతో క్యాలెండర్‌ను రూపొందించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలకితీసేందుకు ఇవి దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సొసైటీ కార్యదర్శి కల్నల్ రాములు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సిఎస్‌కు పలువురు శుభాకాంక్షలు

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠాకు సచివాలయంలో కార్మిక శాఖ మంత్రి పితాని సత్యనారాయణ, పలువురు ఉన్నతాధికారులు మంగళవారం శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు మన్మోహన్ సింగ్, అనంతరాము, పూనం మాలకొండయ్య, ముఖ్య కార్యదర్శులు ఎస్ఎస్. రావత్ , గోపాలకృష్ణ ద్వివేది, ముద్దాడ రవిచంద్ర, విజయానంద్, కరికల వలవన్, సిఎం ముఖ్యకార్యదర్శి సాయిప్రసాద్, కార్యదర్శి రాజశేఖర్, విజిలెన్స్ కమిషనర్ గౌతమ్ సవాంగ్ తదితర ఉన్నతాధికారులు, ఎపిఎన్జీఓ అధ్యక్షుడు అశోక్‌బాబు, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మురళీకృష్ణ సిఎస్‌కు శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో ఉన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఎన్వీ రమణ



కోర్టు హాల్ లోపలి భాగం

నవ్యాంధ్రలో చారిత్రాత్మకం

హైకోర్టు ప్రారంభోత్సవ సభలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎన్వీ రమణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

హైకోర్టు ఏర్పాటు కంటే దాని విలువను కాపాడటం ముఖ్యమని, నవ్యాంధ్రలో ఇది చారిత్రాత్మక దినంగా నిలుస్తుందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. సిఎం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక హైకోర్టును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో కలిసి ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రవీణ్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో గురజాడ అప్పారావు రచించిన 'దేశ మంటే మట్టి కాదోయ్... దేశ మంటే మనుషులోయ్' అంటూ జస్టిస్ ఎన్వీ రమణ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఈ ప్రాంత వాసిగా హైకోర్టు ప్రారంభాన్ని స్వాగతిస్తున్నానని, అన్ని విధాలుగా సహకరిస్తానని అన్నారు. 62 ఏళ్ల తరువాత ఇక్కడ హైకోర్టును ఏర్పాటు చేశారన్నారు. హైకోర్టు ఇక్కడకు రావడంతో కక్షిదారులకు ఇబ్బందులు తగ్గుతాయన్నారు. హైకోర్టు భవన ప్రారంభోత్సవం జనవరి 25న జరుగనుందని, ఆ కార్యక్రమానికి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ రంజన్ గోగయి రానున్నారని తెలిపారు.

పూర్తి స్థాయిలో విభజన జరిగినట్టే: సిఎం చంద్రబాబు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ హైకోర్టు తరలిరావడంతో పూర్తి స్థాయిలో విభజన జరిగినట్లు తాను భావిస్తున్నానన్నారు. నిధులు, ఆస్తుల విభజన లాంటివి కొన్ని ఉన్నప్పటికీ తరలివచ్చేవి ఏమీ లేవన్నారు. హైకోర్టును దేశంలోకెల్లా ఉత్తమ కోర్టుగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుంద న్నారు. హైకోర్టు ఉద్యోగులు విధులు నిర్వహించేందుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. చిన్న చిన్న ఇబ్బందులు కలిగినా పెద్ద మనసు చేసుకోవాలని చీఫ్ జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌ను కోరామన్నారు. రాజధాని అమరావతికి రైతులు ల్యాండ్ పూలింగ్‌లో 33వేల ఎకరాల భూమిని ఇచ్చారన్నారు. అందరి సహకారంతో ప్రపంచ స్థాయి రాజధానిని నిర్మిస్తామన్నారు. రాష్ట్ర విభజన తరువాత మొదటి ముఖ్యమంత్రిగా తాను, గవర్నర్‌గా ఇఎస్ఎల్ నరసింహన్, మొదటి హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా ప్రవీణ్‌కుమార్ పేర్లు చరిత్రలో నిలిచిపోతాయన్నారు.

హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ హైకోర్టు ఏర్పడటమనేది ఇదొక చరిత్రాత్మక ఘటన అని, నేటి నుంచి కొత్త చరిత్ర మొదలయ్యిందని అన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికీ కృషి చేస్తానన్నారు. రాష్ట్ర న్యాయశాఖ మంత్రి కొల్లు రవీంద్ర, జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్రకుమార్, కంభంపాటి రామ్మోహన్, నన్నపనేని రాజకుమారి, హైకోర్టు జడ్జీలు, అడ్వకేట్ జనరల్, రిజిస్ట్రార్ జనరల్, సీనియర్ అడ్వకేట్లు, పలు జిల్లాల నుంచి అడ్వకేట్లు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

పూర్ణకుంభంతో స్వాగతం

హైకోర్టు ప్రారంభోత్సవానికి హాజరైన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌ల బృందానికి వేద పండితులు మంత్రోచ్చారణల తో స్వాగతం పలికారు.

గడువు కావాలని సుప్రీంను కోరితే బాగుండేది: హైకోర్టు అడ్వకేటు ప్రసాద్

హైకోర్టు తాత్కాలిక భవనం పూర్తి కాలేదని, రాష్ట్ర ప్రభుత్వం మరో నాలుగు నెలల సమయం కావాలని సుప్రీంకోర్టులో అఫిడవిట్ వేసి ఉంటే బాగుండేదని హైదరాబాద్‌కు చెందిన అడ్వకేట్ పి. ప్రసాద్ ప్రజాశక్తికి తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తులకు ప్రభుత్వం సౌకర్యాలు కల్పించవచ్చేమో కానీ, అడ్వకేట్లకు ఇబ్బందులు తప్పవన్నారు.

హైకోర్టు రావడం ఆనందంగా ఉంది: ఏపీ అడ్వకేట్లు

హైకోర్టు ఏపీకి తరలిరావడం ఆనందంగా ఉందని రాష్ట్రానికి చెందిన పలువురు అడ్వకేట్లు తెలిపారు. దశాబ్దాలుగా విజయవాడలో హైకోర్టు ఏర్పాటు చేయాలని పోరాడుతూనే ఉన్నామన్నారు. నేటికి కార్యరూపం దాల్చడంతో కక్షిదారులకు మేలు జరుగుతుందన్నారు.

నేటి నుంచి కార్యకలాపాలు

హైకోర్టు లాంఛనంగా మంగళవారం ప్రారంభమైనప్పటికీ బుధవారం నుంచి రెగ్యులర్ కార్యక్రమాలు జరుగనున్నాయి. సహజంగా తరువాత రోజు ఏయే కేసులు విచారణకొస్తాయనే జాబితాను ముందు రోజు సాయంత్రం వెల్లడిస్తారు. తాము పనుల్లో నిమగ్నమయ్యేందుకు నాలుగైదు రోజులు పడతుందని హైకోర్టు ఉద్యోగులు తెలిపారు.

నేడు 'తెలుగునాట గాంధీ బాట' పుస్తకావిష్కరణ

హాజరు కానున్న రాజమోహన్ గాంధీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తెలుగునాట గాంధీ బాట పుస్తకాన్ని మహాత్మగాంధీ మనుమడు, మాజీ ఎంపి ప్రొఫెసర్ రాజమోహన్ గాంధీ బుధవారం సాయంత్రం స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే సభలో ఆవిష్కరిస్తారని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వర ప్రసాద్ తెలిపారు. గుంటూరులోని తన నివాసంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అమరావతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో 'గాంధీ సిద్ధాంతాలు–నేటి ఆవశ్యకత' అనే అంశంపై ఈ సభలో చర్చా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. గాంధీ సిద్ధాంతాలపై విస్తృత ప్రచారం చేయడం ద్వారా సమాజంలో సామాజిక రుగ్మతలు, హింసను తగ్గించవచ్చునని పేర్కొన్నారు. పుష్కకావిష్కరణ తరువాత రాజమోహన్ గాంధీ మహ్మాత్మాగాంధీ సిద్ధాంతాలపై కీలక ఉపన్యాసం చేస్తారని, రాష్ట్ర సాంస్కృతిక శాఖ సహకారంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా గాంధీ సిద్ధాంతాలపై అధ్యయనం, ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో ఆయన చేసిన పర్యటనలు, గాంధీ నడిచిన ప్రాంతాల అభివృద్ధి తదితర అంశాలపై ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్నట్లు ఆయన వెల్లడించారు. సభలో పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, తిరుపతి ఐఐటి ప్రొఫెసర్ అల్లూరి రఘురామరాజు, రాష్ట్ర సాంస్కృతిక శాఖ డైరక్టర్ డి.విజయభాస్కర్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.



అమరావతి బాలోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహకులు

నేటి నుంచి 'అమరావతి బాలోత్సవం'

ప్రారంభించనున్న మంత్రి నక్కా ఆనంద బాబు

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

అమరావతి బాలోత్సవం బుధవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర సాంఘిక సంక్షేమం, సినిమాటోగ్రఫీ మంత్రి నక్కా ఆనందబాబు ప్రారంభిస్తారని ఉత్సవం గౌరవాధ్యక్షులు చలవాది మల్లికార్జునరావు, అధ్యక్షులు ఎస్.పి.రామరాజు, ప్రధాన కార్యదర్శి ఆర్ కొండలరావు తెలిపారు. విజయవాడ ఎన్‌టిఆర్ సర్కిల్ సమీపంలోని చిగురుపాటి శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూలులో ఈనెల నాల్గో తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. స్కూల్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఎపి రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఎమ్‌డి సిహెచ్.వి.చౌదరి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్ర సృజనాత్మకత సాంస్కృతిక సమితి సీఈవో డాక్టర్ డి.విజయ్‌భాస్కర్, కొత్తగూడెం బాలోత్సవం కన్వీనర్ వాసిరెడ్డి రమేష్‌బాబు, కాకినాడ క్రియ పిల్లల పండుగ కార్యదర్శి ఎస్.ఎస్ ఆర్.జగన్నాథరావు విశిష్ఠ అతిథులుగా పాల్గొంటారని వారు తెలిపారు. చిన్నారుల్లో సృజనాత్మకత, ప్రతిభా పాటవాలను వెలికితీసి సమాజం పట్ల సానుకూలత, సేవా తత్పరత కలిగించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. బాలలను చైతన్యం చేసేందుకు నగరంలో భావసారుప్యత కలిగిన వారు ఒక కమిటీగా ఏర్పడి ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మీడియా పాయింట్‌ను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగాధిపతి ప్రొఫెసర్ జి.అనిత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవం కార్యదర్శులు పి.మురళీకృష్ణ, జి.జ్యోత్స్న, విద్యావేత్త ఎన్.విద్యాఖన్నా, ప్రొఫెసర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తెలంగాణలో మోగిన 'పంచాయతీ' నగారా

21నుంచి మూడు విడతల్లో ఎన్నికలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో పంచాయతీ ఎన్నికల నగారా మోగింది. ఈనెల 21 నుంచి మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈనెల 21న తొలి విడత, 25న రెండో విడత, 30న మూడో విడత పోలింగ్ జరుగనుంది. తొలి విడత ఎన్నికల ప్రక్రియ ఈనెల 7న ప్రారంభమై 21తో ముగుస్తుంది. రెండో విడత 11న ప్రారంభమై 25తో, మూడో విడత 16న ప్రారంభమై 30తో ముగుస్తుంది. రాష్టంలో మొత్తం 12,732 గ్రామ పంచాయతీలు, 1,13,170 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1,13,190 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరుగుతుంది. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు పూర్తిచేసి ఫలితాలు వెల్లడిస్తామని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు బ్యాలెట్ పత్రాలు వినియోగిస్తున్నామని, నోటా గుర్తు ఉంటుందని ఆయన వెల్లడించారు. సర్పంచ్‌లుగా పోటీ చేసే జనరల్ కేటగిరీ అభ్యర్థులు రూ.2000, రిజర్వుడు కేటగిరీ అయితే రూ.1000, జనరల్ కేటగిరీ వార్డు మెంబరు రూ.500, రిజర్వుడు అభ్యర్థి అయితే రూ.250 చొప్పున ధరావతు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఖర్చుపై కూడా ఎన్నికల సంఘం పరిమితి విధించింది. 5వేల జనాభా దాటిన పంచాయతీలైతే అభ్యర్థులు రూ.2,50,000 మించి ఖర్చు చేయరాదు.

ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.53.64కోట్లు విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి సహాయనిధి (సిఎంఆర్ఎఫ్) రీయింబర్స్‌మెంట్, ఎల్‌ఒసిలకు కలిపి రూ.53,64,00,438 ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేశారు. ఈ మేరకు నూతన సంవత్సరం తొలిరోజు సిఎంఆర్ఎఫ్ ఫైలుపై చంద్రబాబు తొలి సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీయింబర్స్‌మెంట్ కోసం ఇప్పటి వరకు 7,386 దరఖాస్తులు వచ్చాయనీ, 6,207 కేసులకు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుం దనీ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రీయింబర్స్‌మెంట్‌కు రూ.34,50,59,383 విడుదల చేశామన్నారు. ఎల్‌ఒసిలకు వచ్చిన 1,179 దరఖా స్తులకు రూ.19,13,41,055 విడుదల చేశామన్నారు. 2014 నుండి నేటి వరకు సిఎంఆర్ఎఫ్ నుండి రూ.1,249.56 కోట్లు మంజూరు చేశామని సిఎం తెలిపారు.

అంధత్వ ఉద్యోగులకు బయోమెట్రిక్ మినహాయింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంధత్వ ఉద్యోగులకు బయోమెట్రిక్ నుంచి మినహాయింపు ఇస్తూ ప్రభుత్వ కార్యదర్శి హెచ్ అరుణ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బ్లయిండ్ అండ్ విజువల్లీ చాలెంజ్‌డ్ ఎంప్లాయీస్ నేషనల్ ఫెడరేషన్ అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. పాత పద్ధతిలోనే హాజరు విధానాన్ని పరిగణించాలని సూచించారు.

స్నేహ పూర్వకంగా మెలగాలి : వర్ల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

యాజమాన్యంతో స్నేహ పూర్వకంగా మెలగడం వల్లే కార్మికుల శ్రేయస్సు సాధ్యపడుతుందని ఆర్టీసి చైర్మన్ వర్ల రామయ్య అన్నారు. విజయవాడలోని ఆర్టీసి హౌస్‌లో మంగళవారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక నేతలు, కార్మికులు సమన్వయంతో పనిచేయడం వల్ల సంస్థ గణనీయమైన అభివృద్ధిని సాధించిందన్నారు. కార్మికుల సంక్షేమం కోసం అనేక సంస్కరణలు ప్రవేశపెట్టామని, భవిష్యత్తులో కార్మికులకు పూర్తి అండదండలు అందిస్తామని అన్నారు. ఎమ్‌డి ఎన్‌వి సురేంద్రబాబు మాట్లాడుతూ సిబ్బంది కష్టపడి పనిచేయడం వల్ల నష్టాల్ని తగ్గించగలిగామన్నారు. కార్మికులకు అన్ని ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామన్నారు. అనంతరం కేక్ కట్ చేసి కార్మికులకు నూతన సంవత్సరం శు భాకాంక్షలు తెలిపారు.

కార్యకర్తలతో జగన్ నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు, మందస (శ్రీకాకుళం)



కేక్‌ను కట్ చేస్తున్న జగన్

వైసిపి అధినేత జగన్ 2019 నూతన సంవత్సర వేడుకలను పార్టీ అభిమానులు, కార్యకర్తల మధ్య మంగళవారం జరుపుకున్నారు. శ్రీకాకుళం జిల్లా దెప్పూరులోని బస శిబిరం వద్ద భారీ కేక్‌ను ఆయన కట్ చేశారు. అనంతరం పలుచోట్ల పార్టీ పతాకాన్ని ఆవిష్కరిం చారు. అంతకు ముందు జగన్ చేపట్టిన పాదయాత్ర వజ్రపు కొత్తూరు మండలంలోని దెప్పూరు శివారు నుంచి ప్రారంభమై మందస మండలంలోని నారాయణపురం వరకూ కొనసాగింది. ఈ సందర్భంగా ఉద్దానం ప్రాంతాన్ని పట్టిపీడిస్తోన్న కిడ్నీ వ్యాధులకు శాశ్వత పరిష్కారం కనుగొనేలా ఇక్కడే కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేయాలని జగన్‌ను ఉద్దానం అభివృద్ధి వేదిక నాయకులు కోరారు. రోజంతా నిలబడి పని చేయాల్సి రావడంతో దీర్ఘకాలంలో అనారోగ్యం పాలవుతు న్నామని, రోజుకు రూ.200 కూడా కూలి గిట్టుబాటు కావ డం లేదని జీడి కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, ఉద్యోగాల్లో తమకు రిజర్వే షన్లు అమలు చేయాలని ఒరియా బ్రాహ్మణులు కోరారు. తమను బిసి-డి నుంచి బిసి-ఎలోకి మార్చాలని, తెలంగాణలో యాదవులకు అమలు చేస్తున్న పథకాలను ఆంధ్రప్రదేశ్‌లోనూ అమలు చేయాలని యాదవ సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందించారు. వైసిపి అధికారంలోకి వస్తే సమస్యలను పరిష్కరిస్తామని, 45 ఏళ్లు దాటిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ మహిళలకు వైసిపి చేయూత పథకంలో భాగంగా నాలుగేళ్లలో రూ.75 వేల సహాయం చేస్తామని జగన్ హామీ ఇచ్చారు.

మెట్ట భూములతో గిరిజనులకు దగా

- రంపచోడవరం నియోజకవర్గంలో సాగు భూములు లాక్కున్నారు
- పదేళ్లుగా నిరుపయోగం
- ఇంకా ఇవ్వని భూమికి భూమి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

సాగునీటి ప్రాజెక్టుల వల్ల సారవంతమైన భూములు కోల్పోయిన గిరిజనులకు వ్యవసాయానికి పనికిరాని భూములను ప్రభుత్వం అందించడంతో వ్యవసాయం ఎలా చేయాలని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన భూములు సేద్యానికి పనికిరావని, తామెలా బతకాలని తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం మండలం భూపతిపాలెం, దేవీపట్నం మండలం ఏనుగులగూడెం, డి.రావిలంక, పి.గొందూరు, గండికోట గ్రామాల ఆదివాసీలు ప్రశ్నిస్తున్నారు. నీటి వసతి ఉన్న సాగుభూమి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

దేవీపట్నం మండలం నేలకోట పంచాయతీ గండికోటకు చెందిన ఆదివాసీలకు 12 ఏళ్ల తర్వాత ప్రభుత్వం భూమికి భూమి ఇచ్చింది. సారవంతమైన భూమిని తీసుకుని పెద్దపెద్ద రాళ్లు, పొదలతో ఉన్న భూమిని ఇచ్చింది. పుష్కర ఎత్తిపోతల పథకం కోసం 75 ఎకరాల సారవంతమైన భూమిని అప్పట్లో గండికోటకు చెందిన 52 మంది ఆదివాసీల నుంచి ప్రభుత్వం తీసుకుంది. 2005లో పట్టాదార్ పాస్‌పుస్తకాలిచ్చినప్పటికీ భూమిని 2016 అక్టోబర్‌లో నిర్వాసితులకు అందించింది. ఆ భూమి వ్యవసాయానికి అనుకూలంగా లేకపోవడంతో నిరుపయోగంగా ఉంది. గండికోటకు చెందిన వాడపల్లి ముత్యాలుదొర భార్య దుర్గమ్మ పేరుమీద 2005 మే 5న సర్వే నంబర్ 195/3లో ఎకరం భూమిని కేటాయిస్తూ 228 నెంబరు గల పట్టాదార్ పాస్ పుస్తకాన్ని అధికారులు అందించారు. రాళ్లు తుప్పలతో ఉన్న నీటి వసతి లేని భూముల్లో పంటలెలా పండించాలని ఆమెతోపాటు సేద్యానికి పనికిరాని భూములు పొందిన గుమ్మడి సూరన్నదొర, కొండపల్లి రామకృష్ణదొర ప్రశ్నిస్తున్నారు.

దేవీపట్నం మండలం ఏనుగులగూడెంలో 106 కుటుంబాలకు చెందిన 432 మంది గిరిజనులు జీవిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపునకు గురవుతున్న తమకు భూమికి భూమి కింద సేద్యానికి పనికిరాని భూమి ఇచ్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని ఇక్కడి ఆదివాసీలు చెబుతున్నారు. పోలవరం ప్రాజెక్టు వల్ల రెండున్నర ఎకరాల సారవంతమైన భూమిని కోల్పోతున్నానని ఏనుగులగూడేనికి చెందిన కుంజం భద్రందొర ఆవేదన



చెందుతున్నాడు. భూమికి భూమి కింద 40 కిలోమీటర్ల దూరంలోని తంటికొండలో ఎందుకూ పనికిరాని భూమి ఇచ్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని, అయితే తాను ఒప్పుకోలేదని చెప్పాడు.

రంపచోడవరం మండలం భూపతిపాలెం వద్ద నిర్మించిన భూపతిపాలెం ప్రాజెక్టు నిర్వాసితులకు ఫోక్సుపేట పంచాయతీ సుద్దగొమ్మి వద్ద పునరావాస కాలనీని నిర్మించారు. దానికి సమీపంలోనే భూములు నష్టపోయిన 15 కుటుంబాలకూ రెండేసి ఎకరాల చొప్పున వ్యవసాయానికి యోగ్యంకాని, తుప్పలతో, పొదలతో నిండిన భూమినిచ్చారు. గిరిజనులు తుప్పలు నరికి వ్యవసాయానికి ప్రయత్నించినప్పటికీ నీటి వసతి లేక పదేళ్లుగా ఆ భూమి నిరుపయోగంగా ఉంది. జీడిమామిడి మొక్కలు వేసినా అవీ పెరగలేదని బాధితుడు అందాల లచ్చిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు.

దేవీపట్నం మండలం గండికోటకు చెందిన కొట్టెం అప్పారావుదొరకు ఉన్న ఎకరం భూమి పుష్కర ఎత్తిపోతల పథకంలో కలిసింది. 2005లో పట్టాదార్ పాస్ పుస్తకాన్నిచ్చిన రెవెన్యూ అధికారులు 2016 అక్టోబర్‌లో భూమికి భూమి చూపించారు. పెద్దపెద్ద రాళ్లు, తుప్పలు, పొదలతో ఉన్న మెట్ట భూమి ఎలా సాగు చేయాలని కన్నీరుపెట్టుకుంటున్నాడు. లక్షలు ఖర్చు చేసి, పెద్దపెద్ద రాళ్లను తొలగించినా సేద్యానికి పనికిరాదని ఆవేదన చెందుతున్నాడు. దేవీపట్నం మండలం డి.రావిలంకకు చెందిన తుర్రం సావిత్రికి మూడున్నర ఎకరాల సాగుభూమి పోలవరం ముంపు ప్రాంతంలో ఉంది. 225 పట్టా నెంబరుతో పట్టాదార్ పాస్‌పుస్తకాన్నిచ్చి, చినభీంపల్లిలో రాళ్లు, రప్పలతో ఉన్న మూడున్నర ఎకరాల భూమిని ప్రభుత్వం అందజేసింది. ఆ భూమిలో రెండున్నర ఎకరాల భూమి ముసురుమిల్లి ప్రాజెక్టులో కలిసిపోయింది. తనకు సారవంతమైన భూమి ఇవ్వాలని ఆమె కోరుతోంది. రంపచోడవరం మండలం భూపతిపాలెం, దేవీపట్నం మండలం డి.రావిలంక, పి.గొందూరు, ఏనుగులగూడెం, గండికోట గ్రామాల ప్రజలు తమకు ప్రభుత్వం వ్యవసాయానికి పనికిరాని భూమిని ఇచ్చిందని ఆవేదన చెందుతున్నారు. డి.రావిలంక, పి.గొందూరు గ్రామాల గిరిజనులకు చినభీంపల్లిలో 2008లో కాలనీ నిర్మించారు. ఆ గ్రామంలోనే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో భాగంగా కొందరికి భూమికి భూమి ఇచ్చారు. సాగుభూమికి బదులు సేద్యానికి పనికిరాని రాతి భూమిని ఇచ్చారని ఆదివాసీలు చెబుతున్నారు. 2008 నుంచి ఇప్పటివరకూ అనేకమంది లబ్ధిదారులకు భూమిని అప్పగించలేదు.

సాగుకు ఉపయోగపడే భూమి ఇవ్వాలి



చినభీంపల్లిలో ఇచ్చిన మూడున్నర ఎకరాల భూమిలో రెండున్నర ఎకరాలు ముసురుమిల్లి కాలువ నిర్మాణంలో కలిసిపోయింది. ప్రభుత్వం ఇచ్చిన ఎకరం భూమి కూడా రాళ్లూ రప్పలతో ఉంది. సాగుకు ఉపయోగపడే భూమి ఇవ్వాలి.

– తుర్రం సావిత్రి, డి.రావిలంక, దేవీపట్నం మండలం

సాగునీటి వసతి కల్పించాలి....



పుష్కర ఎత్తిపోతల పథకం కోసం ఎకరం భూమిని ప్రభుత్వం తీసుకుంది. దానికి బదులుగా రాళ్ల తుప్పలతో ఉన్న నీటివసతి లేని భూమిని ఇచ్చింది. నా భూమికి సాగునీటి వసతి కల్పించాలి.

– గుమ్మడి సూరన్నదొర, గండికోట, దేవీపట్నం మండలం.

భూమికి భూమి అమలు చేయాలి

సాగునీటి ప్రాజెక్టుల పేరుతో ప్రభుత్వం ఆదివాసీల సారవంతమైన భూములను లాక్కొంటోంది. వారికి సారవంతమైన భూములు ఇవ్వకుండా రాళ్లు, తుప్పలతో కూడిన మెట్ట భూమిని ఇస్తోంది. వ్యవసాయానికి పనికిరాని భూమిని ఆదివాసీలు ఎలా సాగులోకి తీసుకొస్తారు. ప్రభుత్వమే సారవంతమైన భూమిని ఆదివాసీలకు ఇవ్వాలి. ఇంకా అనేకమందికి భూమికి భూమి అమలు చేయలేదు. తక్షణం భూమికి భూమి అమలు చేయాలి.

– సున్నం రాజయ్య, భద్రాచలం మాజీ ఎంఎల్ఎ

తల్లిదండ్రుల చెంతకు చిన్నారి

బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం

పెంచుకోవాలన్న ఉద్దేశ్యంతో అపహరణ : నిందితుడు

ప్రజాశక్తి-తిరుపతి సిటి



తిరుమలలో ఈ నెల 28న కిడ్నాప్‌కు గురైన 18 నెలల బాలుడి (వీరేశ్) కథ సుఖాంతమైంది. వీరేశ్ ఆచూకీని గుర్తించిన అర్బన్ పోలీసులు మంగళవారం తల్లిదండ్రులకు అప్పగించారు. మా బిడ్డను క్షేమంగా అప్పగించినందుకు పోలీసులకు రుణపడి ఉంటామని భావోద్వేగంతో కన్నీరు మున్నీరయ్యారు. తిరుపతి అర్బన్ పోలీసు కార్యాలయంలో ఎస్‌పి అన్బురాజన్ విలేకరులతో మాట్లాడుతూ 27న రాత్రి 8 గంటలకు మహారాష్ట్ర లాతూర్ జిల్లాకు చెందిన ప్రశాంత్‌జీ యాదవ్ (46), అతని భార్య స్నేహ ఇద్దరు కలిసి శ్రీవారి దర్శనానికి తిరుమలకు చేరుకున్నారు. మరుసటిరోజు ఉదయం 7.45 గంటలకు లేచి చూడగా కుమారుడు కనబడలేదు. దీంతో పరిసర ప్రాంతాల్లో గాలించి.. తిరుమల టుటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిఆర్ నంబరు 137/2018 యు/సెక్షన్ 363 ఐ.పి.సి కింద కేసు నమోదు చేశారు. బాబు ఆచూకీ కోసం తిరుమల తిరుపతిలోని 33 సిసి కెమెరాలను పరిశీలించారు. ఓ అనుమానాస్పద వ్యక్తి బాలుడిని అపహరించినట్లు గుర్తించారు. ఆచూకీ కోసం ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. తమిళనాడు, కర్నాటక, తెలంగాణ, మహారాష్ట మొదలగు ప్రదేశాలకు వెళ్లి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. కిడ్నాపర్ ఊహాచిత్రాన్ని సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా మాహుర్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని రేణుకాదేవి ఆలయం వద్ద అనుమానాస్పద రీతిలో సంచరిస్తుండగా.. అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితుడు తెలంగాణా రాష్ట్రం నిజామాబాద్ రాంనగర్‌కు చెందిన విశ్వంభర్‌గా గుర్తించారు. అవివాహితుడైన విశ్వంభర్ (43) ఎవరైనా బిడ్డను పెంచుకుంటే వృద్ధాప్యంలో సహాయంగా ఉంటాడని భావించి వీరేశ్‌ను కిడ్నాప్ చేసినట్లు అంగీకరించాడు. అరెస్టు చేసి అక్కడి కోర్టులో హాజరుపరచి తిరుపతికి తీసుకొచ్చినట్లు చెప్పారు. మూడు రోజుల్లో కేసును ఛేదించి కిడ్నాప్‌కు గురైన బాలుడిని సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించామని చెప్పారు.

సంపాదకీయం

హసీనా హ్యాట్రిక్

ఆదివారం జరిగిన బంగ్లాదేశ్ పార్లమెంటు ఎన్నికల్లో షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ కూటమి 96 శాతం సీట్లను చేజిక్కించుకుని చరిత్ర సృష్టించింది. నూతన సంవత్సరం ప్రారంభంలో పొరుగుదేశంలో లౌకిక శక్తులు ముచ్చటగా మూడోసారి అసాధారణమైన విజయం సాధించడం హర్షణీయం. ఈ ట్రెండ్ భారత్‌లో త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలకు ఒక సంకేతంగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. ఇటీవల జరిగిన అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో ఇప్పటికే ఆ క్రమం ప్రారంభమైంది. హసీనాకు ఇది హ్యాట్రిక్ విజయం. మొత్తంగా చూసినప్పుడు నాల్గవ విజయం. 1996లో మొదటిసారి ఆమె అధికారంలోకి వచ్చారు. తరువాత 2009లో, 2014లో వరుసగా గెలుస్తూ వస్తున్నారు.. గత పదేళ్ల ప్రజా రంజక పాలనకు మెచ్చి ప్రజలు ఈ తీర్పునిచ్చారని అవామీలీగ్ నేత హసీనా చెప్పినా, హసీనా నిరంకుశ పోకడలు, ఎన్నికల్లో రిగ్గింగ్, ప్రతిపక్షాలపై దాడులు, దౌర్జన్యాలే తమ దారుణ పరాజయానికి కారణమని బిఎన్‌పి నిందించినా ఆ రెండూ పాక్షిక సత్యాలే. అవుతుంది. హింస, అక్రమాలు లేకుండా స్వేచ్ఛగా ఎన్నికలు జరిగాయని అనుకోవడానికి వీల్లేదు. పోలింగ్ రోజున చెలరేగిన హింసలో 17 మంది చనిపోవడమే అందుకు నిదర్శనం. 2006లో జరిగిన ఎన్నికల్లో బిఎన్‌పి,- జమాతే ఇస్లామీ కూటమి హింస, అక్రమాలకు తెగబడింది. అయినా ఆ ఎన్నికల్లో అది ఓడిపోయింది. కాబట్టి హింస వల్లే ఓడిపోయామంటూ ప్రతిపక్ష కూటమి ముందుకు తెస్తున్న వాదన ప్రశ్నార్థకమే. అక్రమాలు ఒక మోతాదుకు మించి లేవని ఎన్నికలు మొత్తం మీద చూసినప్పుడు స్వేచ్ఛగా, న్యాయంగానే జరిగాయని సార్క్,ఒఐసి, భారత పరిశీలకులతో కూడిన పరిశీలకుల బృందం వెల్లడించిన అభిప్రాయాన్ని కొట్టి పారేయడానికి వీల్లేదు. అయినా, ఈ ఎన్నికల తీర్పును తాము అంగీకరించడం లేదని, తటస్థ తాత్కాలిక ప్రభుత్వ ఆధ్వర్యంలో తిరిగి ఎన్నికలు జరపాలని బిఎన్‌పి నేతృత్వంలోని రెయిన్‌బో కూటమి నేత, 82 ఏళ్ల ప్రముఖ న్యాయవాది కమల్ హుస్సేన్ డిమాండ్ చేశారు. పోలింగ్ ముగియడానికి ముందు ప్రతిపక్ష కూటమికి చెందిన 40 మంది అభ్యర్థులు పోటీ నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు. బిఎన్‌పి ఓటమికి అధికార పార్టీ అక్రమాలే కారణమని నిందించడం, 2014 ఎన్నికలను బహిష్కరించాలన్న తమ నిర్ణయం సరైనదేనని ఈ ఎన్నికలు నిరూపించాయని చెప్పడంలో ఔచిత్యమేమిటో బోధపడడం లేదు. మత ఛాందసవాద శక్తులకు కొమ్ముకాస్తూ, యుద్ధ నేరస్తులకు బాహాటంగా మద్దతు పలకడం, అగ్ర నాయకులే అవినీతిలో పీకల్లోతున కూరుకుపోవడం, నయా ఉదారవాద విధానాలను జోరుగా అమలు చేయడం, మైనార్టీలను అభద్రతకు గురిచేయడం వంటి విధానాలే ఖలీదా జియా పార్టీ పతనానికి కారణం. వాటిపై ఆత్మవిమర్శ చేసుకోకుండా అక్రమాల వల్లే ఓడిపోయామనడం ఆత్మవంచనే అవుతుంది.

బంగ్లా నేషనలిస్టు పార్టీతో పోల్చితే అవామీ లీగ్ పార్టీ చాలా మెరుగు. మత తత్వ శక్తులతో పోరాడడంలో కానీ, పొరుగు దేశాలతో ముఖ్యంగా భారత్, చైనాలతో సత్సంబంధాలను కొనసాగించడంలో కానీ మంచి కృషే చేశారు. ఆర్థిక విధానాల్లో పెద్దగా మార్పేమీ లేదు. జిడిపి పెరిగినా, సామాన్యుల జీవన ప్రమాణాల్లో అది ప్రతిబింబించడం లేదు. నిరుద్యోగం పెరుగుతోంది. వీటిపై ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని తొక్కిపట్టేందుకు గత అయిదేళ్లలో నిరంకుశ పోకడలకు పోతున్నది. ఈ కాలంలో అనేక కార్మికవర్గం ఉద్యమాలు సాగాయి. హసీనా విధానాలతో విడగొట్టుకునే ప్రయత్నంలో కమ్యూనిస్టు పార్టీ, మరి కొన్ని వామపక్ష పార్టీలు ఈ ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీ చేశాయి. అయితే వాటి బలం చాలా పరిమితం.

ప్రధాన ప్రతిపక్ష పార్టీ బిఎన్‌పి గత సారి ఎన్నికలను బహిష్కరించడంతో ఆ పార్టీ పతనం మొదలైంది. ప్రజల్లో ఆ పార్టీ పునాది పూర్తిగా చెదిరిపోవడంతో ఆ స్పేస్‌లోకి అవామీలీగ్ చొచ్చుకుపోయింది. దీనికి తోడు బిఎన్‌పి నేత బేగమ్ ఖలీదా జియా అవినీతి కేసులో 17 ఏళ్ల జైలు శిక్ష పడి ఎన్నికల్లో పోటీకి అనర్హురాలు కావడం, మరో నాయకుడు బేగం ఖలీదా జియా కుమారుడు తారిఖ్ జియా మనీ లాండరింగ్, అవామీలీగ్ నేతల హత్యకు కుట్ర పన్నారన్న కేసులో దోషిగా తేలాక లండన్‌కు పారిపోవడం బిఎన్‌పిని కోలుకోలేని దెబ్బ. ఎన్నికల ప్రచారంలోను, పోలింగ్ రోజున ఇది స్పష్టంగా కనిపించింది. బంగ్లా నేషనలిస్టు పార్టీ (బిఎన్‌పి) బహిష్కరించిన 2014 ఎన్నికలో అవామీ లీగ్‌కు 234 సీట్లు రాగా, ఈ ఎన్నికల్లో 268 సీట్లు సాధించగలిగిందంటే దానికి కారణమిదే. 2008 ఎన్నికల్లో 33 సీట్లు సాధించిన బిఎన్‌పి కూటమి ఈ సారి కేవలం 7 సీట్లకే పరిమితమైంది.

ప్రజలు ఇచ్చిన ఈ తీర్పు హసీనాపై బాధ్యతను మరింత పెంచింది. బంగ్లాదేశ్ ఎదుర్కొంటున్న సవాళ్లను ఎదుర్కోవడానికి, పౌరుల హక్కులను, ప్రజాతంత్ర, లౌకిక విలువలను కాపాడేందుకు, పొరుగు దేశాలతో సత్సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఆమె కృషి చేస్తారని ఆశిద్దాం. హసీనా విజయాన్ని స్వాగతించిన భారత ప్రభుత్వం తన లుక్ ఈస్ట్ పాలసీలో భాగంగా బంగ్లాతో మైత్రీ బంధాన్ని మరింత బలోపేతం గావించేందుకు దృఢ సంకల్పంతో ముందుకు సాగాలి.

ఇది విషయం



తల్లీ...!
నీవెప్పుడు నాకొక పట్టెడు మెతుకులు పెడతావో
ఒక్క నిజమైన కథ చెపుతావో
ఎదలో చోటిచ్చి నిదుర పొమ్మంటావో
అప్పుడు నీ పాటలు
పక్షులై విహరిస్తాయి ఆకాశంలో
నీ నవ్వులు పువ్వులై వికసిస్తాయి
భూమండలంలో
నీ యెండలు
జెండాలై ఎగురుతాయి దిగంతాల్లో
- గుంటూరు శేషేంద్రశర్మ

విశ్లేషణ

వామపక్షాల కీలకపాత్ర

ఎంవిఎస్ శర్మ



కొత్త సంవత్సరం వచ్చేసింది. అంతకు మూడు నెలల మునుపే ఎన్నికల వాతావరణం కూడా వచ్చేసింది. రాష్ట్రంలో అధికారంలో వున్న తెలుగుదేశం పార్టీ ధర్మ పోరాట దీక్షలు, జిల్లాల వారీ, నియోజక వర్గాల వారీ సమీక్షలు, పార్టీ సభ్యత్వ నమోదు వంటి సన్నాహక కార్యక్రమాలను ఒకవైపు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, భారీ అడ్వర్‌టైజ్‌మెంట్లు, శ్వేత పత్రాలనబడే ప్రచార పత్రాలు ఇంకోవైపు చేపట్టింది. అన్నింటా తానై అన్నట్టు చంద్రబాబు క్షణం తీరిక లేకుండా ఈ షో నిర్వహిస్తున్నారు. తానే తిరిగి ముఖ్యమంత్రి కాకపోతే 'ఈ రాష్ట్ర భవిష్యత్తు ఏమైపోతుందో చూసుకోండి' అంటూ ఒక విధంగా ప్రజల్ని హిప్నటైజ్ చేద్దామని ఆయన ప్రయత్నిస్తున్నట్టు అనిపిస్తోంది.

సంక్షేమ పథకాల వల్లనే తెలంగాణలో కెసిఆర్ ఘన విజయం సాధించారన్న పత్రికా విశ్లేషణలు వచ్చాక ఈ హడావుడి ఆంధ్రప్రదేశ్‌లో మరీ వేగంగా జరుగుతోంది. ఇంకోపక్క రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చూస్తే చాలా అన్యాయంగా వుంది. తలకు మించిన అప్పులు చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు రేపో, మాపో పూర్తయిపోతుందన్నట్టు ప్రజలకు సినిమా చూపిస్తున్నారు. 5 శాతం పునరావాసం కూడా జరగలేదు. కాని ప్రాజెక్టు నిర్మాణంలో 67 శాతం పూర్తయిపోయిందని, ఏకంగా 70 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేస్తామని ప్రచారం చేసుకుంటున్నది రాష్ట్ర ప్రభుత్వం. వందల కోట్ల రూపాయల బడ్జెట్ ప్రత్యేకంగా కేటాయించి అమరావతి సందర్శన, పోలవరం సందర్శన ఒక జాతరను తలపించే మాదిరిగా నిర్వహిస్తున్నారు.

బిజెపితో స్నేహం చెడిపోయాక రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేస్తోందని, నిధులు, ప్రత్యేక హోదా నిరాకరిస్తోందని విమర్శలు రోజూ గుప్పిస్తున్నారు. మరోవైపు కేంద్రం తిరస్కరించినా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి తీరుతామని బింకంగా ప్రకటిస్తున్నారు. కడప స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన చేసేశారు. రామాయపట్నం పోర్టుకు, ప్రకాశం జిల్లాలో భారీ కాగిత పరిశ్రమకు శంకుస్థాపనలు చేయబోతున్నారు. ఇంతటితో ఆగకుండా కేంద్రంలో ప్రత్యామ్నాయ ప్రభుత్వ ఏర్పాటుకు వ్యూహ రచన చేసే చాణక్య పాత్ర తనదేనని చెప్పుకుంటున్నారు మన ముఖ్యమంత్రి. చంద్రబాబు శ్రీకృష్ణుడైతే రాహుల్ గాంధీ అర్జునుడుగా 2019 జనరల్ ఎన్నికలనబడే మహాభారత యుద్ధం జరగబోతోందన్న సినిమా చూపిస్తున్నారు. చంద్రబాబు చూపిస్తున్న సినిమాకి బోనస్‌గా బాలయ్య బాబు ఎన్టీయార్ బయోపిక్‌లను ప్రజల మీదికి వదుల్తున్నారు.

మొత్తం మీద 2019 ఎన్నికలలో ప్రజలు ఏ నిర్ణయానికి రావాలో, చంద్రబాబే నిర్ణయించేసినట్టు కనపడుతోంది. 'అన్యధా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ' అని భక్తులు దైవాన్ని శరణుజొచ్చిన చందాన ఆంధ్ర రాష్ట్ర ఓటర్లు 'చంద్రబాబు తప్ప మాకు వేరే దిక్కు లేదు' అని అనుకోవాలని తెలుగుదేశం అధినేత భావిస్తున్నట్టుంది. ఈ వన్‌సైడ్ లవ్ రోజురోజుకీ పెరిగిపోతోంది.

ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్షంగా వున్న వైఎస్సార్ సీపీ తమ అధినేత జగన్ దాదాపు సంవత్సరం నుంచి సాగిస్తున్న పాదయాత్ర మీదే ఆశలు పెట్టుకున్నట్టు కనపడుతోంది. అసెంబ్లీని వేదికగా చేసుకుని ప్రజా సమస్యలను, రాష్ట్ర సమస్యలను లేవనెత్తి ప్రభుత్వ వైఫల్యాలను, లోపాలను ఎత్తిచూపి బోనులో నిలబెట్టే ప్రయత్నం చేయడం ప్రతిపక్షం కనీస బాధ్యత. కాని అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించి వైఎస్సార్ సీపీ ఆ పాత్రను పోషించడంలో వైఫల్యం చెందింది. తమ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని సమస్యలనూ పరిష్కరిస్తుందని నమ్మబలకడం మినహా జగన్ గాని, ఆ పార్టీ గాని చేస్తున్నదేమీ కనిపించడం లేదు. గత సంవత్సర కాలంగా ముఖ్యంగా రాష్ట్రపతి ఎన్నికల కాలం నుంచి బిజెపి వ్యవహరిస్తున్న తీరు, ఆ పార్టీని పల్లెత్తు మాట అనకుండానే రాష్ట్రానికి హోదా విషయంలో చేస్తున్న ప్రకటనలు చూస్తే ఏదో ఒక విధంగా ఈ పార్టీ బిజెపితో అవగాహనకొచ్చి వ్యవహరించే దిశగానే అడుగులు వేస్తున్నదని భావించాల్సి వుంటుంది.

2018లో ముందుకొచ్చినది జనసేన పార్టీ. రాష్ట్రంలోని యువత గణనీయంగా జనసేన పట్ల ఉత్సాహంగా స్పందిస్తున్నారనేది దాదాపు అందరూ అంగీకరిస్తున్నారు. ఈ పార్టీ కేవలం చంద్రబాబు వ్యతిరేకతను చీల్చి పరోక్షంగా టిడిపికి మేలు చేయడం కోసమే వచ్చిందని వైఎస్సార్ సీపీ నేతలు, 2014లో తమకు ఓట్లేసిన ప్రజలను చీల్చి పరోక్షంగా జగన్‌కు మేలు చేస్తుందని టిడిపి నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. దీనిని బట్టి ఇటు టిడిపి, అటు వైఎస్సార్ సీపీ రెండిట్లోనూ జనసేన చూపబోయే ప్రభావం తమకు నష్టం కలిగిస్తుందన్న ఆందోళన పెరుగుతోందని స్పష్టం అవుతోంది. ప్రజా సమస్యలపై వివిధ ప్రాంతాలలో పర్యటించి బాధితులకు అండగా నిలవడం, వామపక్షాలు నడుపుతున్న ఉద్యమాలకు సంఘీభావం తెలపడం, ప్రత్యేక హోదా, రాయలసీమ కరువు వంటి అంశాలను లేవనెత్తి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రశ్నించడం, వివిధ జిల్లాల్లో సంస్థాగత నిర్మాణం దిశగా జనసేన వేస్తున్న అడుగులు - ఇవన్నీ ఆ పార్టీ 2019 ఎన్నికలలో రాష్ట్రంలో నిర్వహించబోయే పాత్రను సూచిస్తున్నాయి. ద్విముఖ పోటీ వుండే రాజకీయ చిత్రం కాస్తా బహుముఖ పోటీ వైపు మారుతోంది. కనుకనే టిడిపి, వైఎస్సార్ సీపీ, జనసేన పట్ల తమ అక్కసును వెళ్లగక్కుతున్నారు.

రాయలసీమ కరువు, ఉత్తరాంధ్ర రాయలసీమ, ప్రకాశం జిల్లాల వెనుకబాటుతనం, రాష్ట్రంలో దళితుల భూములపై, వారి హక్కులపై జరుగుతున్న దాడులు, బలవంతపు భూసేకరణ, రాజధాని ప్రాంతంలో భూములిచ్చిన వారు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి విషయంలో చంద్రబాబు చేసిన, చేస్తున్న వాగ్ధాన భంగాలు, రైతులకు దక్కని గిట్టుబాటు, బ్యాంకు రుణాలు, నిరుద్యోగం-ఇలా ప్రజలెదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వ నిర్వాకాన్ని ప్రశ్నించినదీ, ఉద్యమించినదీ వామపక్షాలే.

కాంగ్రెస్ 2014లో రాష్ట్రంలో పూర్తిగా మట్టిగరిచింది. ఈ మారు టిడిపి కూటమిలో భాగస్వామి అయింది. ఇది ఇరు పార్టీల కింది స్థాయి శ్రేణులకు ఎంతవరకూ మింగుడు పడుతుందో చూడాలి. ఇక 2014లో టిడిపితో మిత్రత్వం నెరపి, నాలుగేళ్ల పాటు ప్రభుత్వంలోనూ భాగస్వామిగా వున్న బిజెపి ఈ మారు రాష్ట్రంలో దిక్కుతోచని స్థితిలో పడింది. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు విషయాల్లో రాష్ట్రానికి బిజెపి ద్రోహం చేసిందనే భావం ప్రజల్లో బలంగా నాటుకుంది.

2019 లోకి అడుగుపెట్టిన ఈ రోజు రాష్ట్ర రాజకీయ చిత్రపటం ఈ తీరున కనపడుతోంది. అయితే ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే. ప్రధాన స్రవంతి మీడియాగాని, ప్రధాన రాజకీయ పార్టీలుగాని ప్రజల ముందు రెండో వైపు ఏముందో చూపించడానికి, చర్చించడానికి సాహసం చేయలేకపోతున్నాయి.

2018 జనవరి ఒకటవ తేదీ నాటికి బలంగా కొనసాగుతున్న టిడిపి-బిజెపి మైత్రీబంధం మార్చి 2018 నాటికల్లా తెగిపోయి ఎందుకు ఆ పార్టీలు బద్ధ శత్రువులుగా వ్యవహరిస్తున్నాయి? వైఎస్సార్ సీపీ లోక్‌సభ ఎంపీలు రాజీనామా ఎందుకు చెయ్యాల్సి వచ్చింది? 'ప్రత్యేక హోదా కన్నా ప్రత్యేక ప్యాకేజీ యే మిన్న' అని అసెంబ్లీ సాక్షిగా వాదించిన చంద్రబాబు నేడు 'ప్రత్యేక హోదా మన హక్కు' అని ఎందుకు గర్జిస్తున్నారు? 'అధికారంలోకి రాగానే ప్రత్యేక హోదా ఫైలుపై మొదటి సంతకం చేస్తాం' అని రాహుల్ గాంధీ ఎందుకు ప్రకటించారు? రాష్ట్రంలో 2019లో ఏర్పడబోయే ప్రభుత్వంలో బిజెపి కీలక పాత్ర పోషిస్తుందని ప్రగల్భాలు పలికిన బిజెపి నేతలు నేడు ఈ రాష్ట్రంలో ఒక మూలకు ఎలా నెట్టబడ్డారు?

ఇటువంటి ప్రశ్నలకు సమాధానం కావాలంటే నాణేనికి రెండోవైపు చూడాల్సిందే. ఆ రెండోవైపున వున్నది రాష్ట్రంలోని సామాన్య ప్రజలూ, వారినే అంటిపెట్టుకున్న ఉద్యమాలే ఊపిరిగా ముందుకు సాగుతున్న వామపక్ష పార్టీలూ, ప్రజా సంఘాలూ, శాసన మండలిలో ప్రత్యేక హోదాపై చర్చ జరుగుతున్నప్పుడు ముఖ్యమంత్రి ప్రజల దృష్టిలో ప్రత్యేక హోదాకు పెద్ద ప్రాధాన్యత లేదని ప్రకటించారు. పిడిఎఫ్ కు చెందిన శాసనమండలి సభ్యులు ప్రత్యేక హోదా రాష్ట్ర ప్రజల హక్కు అని, రాష్ట్ర ప్రజల సెంటిమెంటు అని చెప్పినా ముఖ్యమంత్రి వినిపించుకోనట్టే వ్యవహరించారు. 2018 ఫిబ్రవరి 8న వామపక్షాలు ప్రత్యేక హోదా, విభజన హామీల అమలులో కేంద్రం ప్రదర్శించిన నిర్లక్ష్యానికి నిరసనగా రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి. ప్రజల నుంచి ఆ పిలుపుకు అనూహ్యంగా సానుకూల స్పందన వచ్చింది. దాంతో టిడిపి వైఎస్సార్ సీపీతో సహా ఉలిక్కిపడ్డాయి. ఇక బిజెపితో అంటకాగితే తనకు పుట్టగతులుండవని టిడిపి గ్రహించింది. అందుకే వెంటనే బిజెపితో తెగతెంపులకు సిద్ధం అయ్యింది. ప్రజలలో ఏర్పడిన బిజెపి వ్యతిరేకతకు తానే ప్రతినిధిని అన్నట్టు ఇప్పుడు వ్యవహరిస్తోంది.

ప్రజలలో బిజెపి పట్ల ఏర్పడిన అసంతృప్తి, వ్యతిరేకత ఒక్క రోజులో వచ్చిన మార్పు కాదు. వామపక్షాలు ఎప్పటికప్పుడు ప్రజల్ని చైతన్యపరుస్తూ చేపట్టిన ఉద్యమాల ఫలితం అది. ప్రత్యేక హోదా, రైల్వే జోన్, కడప ఉక్కు, నిర్వాసితుల పునరావాసం వంటి అంశాలపై వామపక్ష పార్టీలుగాని ప్రజాసంఘాలుగాని ఉద్యమాలు చేపడితే అతి దుర్మార్గంగా వాటిని అణచివేయజూసింది చంద్రబాబు ప్రభుత్వం. లెక్కలేనన్ని కేసుల్ని బనాయించింది. 2014 నుంచి 2017 వరకు ఒక్కసారి కూడా అఖిల పక్షాన్ని సమావేశపరచలేదు. ఢిల్లీ మీద ఒత్తిడి కోసం అందరం కలుద్దాం అన్న ప్రతిపాదనను ఏనాడూ అంగీకరించలేదు. 2018 ఫిబ్రవరి బంద్ తర్వాత ఫిరాయించి 'అఖిలపక్షం' పల్లవి ఎత్తుకుంది. ఈ రోజు టిడిపి ప్రత్యేక హోదా విషయంలో ప్రదర్శిస్తున్నది అవకాశవాదమే తప్ప అందులో నిజాయితీ మచ్చుకైనా లేదు. కడప ఉక్కు విషయంలోనూ అంతే. వామపక్షాలు కడప ఉక్కుపై ఆందోళన చేపడితే వారిపై నిర్బంధాన్ని ప్రయోగించింది. తీరా ప్రజలు ఆగ్రహంతో వున్నారన్నది అర్థమయ్యాక సి.ఎం రమేష్ చేత నిరాహార దీక్ష డ్రామా ఆడించింది. ఈరోజు కడప ఉక్కుకు శంకుస్థాపన చేసినా, అదీ రాజకీయ జిమ్మిక్కు మాత్రమేనని, కేంద్రం అమలు చేయాల్సిన విభజన హామీని వనరులు లేకపోయినా తానే చేపడతానని ప్రకటించడం రాయలసీమ ప్రజల్ని మోసగించడానికేనని వస్తున్న విమర్శలలో వాస్తవం వుంది.

ఒకవైపు కేంద్రం, ఇంకొకవైపు రాష్ట్ర ప్రభుత్వం తమ విషయంలో చేస్తున్న అన్యాయాలను రాష్ట్ర ప్రజలు ఈ ఉద్యమాల ఫలితంగానే గ్రహిస్తున్నారు. ఇంకోపక్క ఇంత జరుగుతున్నా ప్రకటనలకు, పాదయాత్రకే పరిమితమైన వైఎస్సార్ సీపీ నిష్క్రియాపర్వత్వాన్ని వారు అర్థం చేసుకుంటున్నారు. 'మాకు వేరే ప్రత్యామ్నాయం లేదా?' అని ప్రశ్నిస్తున్న ప్రజల ముందు జూన్ 2018లో వామపక్ష పార్టీలు ఒక స్పష్టమైన ప్రత్యామ్నాయ కార్యక్రమాన్ని ఉంచాయి. నేతలను, పార్టీలను మారిస్తే చాలదు, విధానాలను కూడా మార్చాలని స్పష్టం చేశాయి.

రాయలసీమ కరువు, ఉత్తరాంధ్ర రాయలసీమ, ప్రకాశం జిల్లాల వెనుకబాటుతనం, రాష్ట్రంలో దళితుల భూములపై, వారి హక్కులపై జరుగుతున్న దాడులు, బలవంతపు భూసేకరణ, రాజధాని ప్రాంతంలో భూములిచ్చిన వారు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి విషయంలో చంద్రబాబు చేసిన, చేస్తున్న వాగ్ధాన భంగాలు, రైతులకు దక్కని గిట్టుబాటు, బ్యాంకు రుణాలు, నిరుద్యోగం-ఇలా ప్రజలెదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వ నిర్వాకాన్ని ప్రశ్నించినదీ, ఉద్యమించినదీ వామపక్షాలే. ఆ తర్వాత వారితో జనసేన కూడా కలవడం మొదలైంది. ఒకవైపు కేంద్రం, ఇంకొకవైపు రాష్ట్ర ప్రభుత్వం తమ విషయంలో చేస్తున్న అన్యాయాలను రాష్ట్ర ప్రజలు ఈ ఉద్యమాల ఫలితంగానే గ్రహిస్తున్నారు. ఇంకోపక్క ఇంత జరుగుతున్నా ప్రకటనలకు, పాదయాత్రకే పరిమితమైన వైఎస్సార్ సీపీ నిష్క్రియాపర్వత్వాన్ని వారు అర్థం చేసుకుంటున్నారు. 'మాకు వేరే ప్రత్యామ్నాయం లేదా?' అని ప్రశ్నిస్తున్న ప్రజల ముందు జూన్ 2018లో వామపక్ష పార్టీలు ఒక స్పష్టమైన ప్రత్యామ్నాయ కార్యక్రమాన్ని ఉంచాయి. నేతలను, పార్టీలను మారిస్తే చాలదు, విధానాలను కూడా మార్చాలని స్పష్టం చేశాయి. ఆ ప్రత్యామ్నాయ విధానాలను అమలు చేయడం కోసం కలిసి వచ్చే శక్తులన్నింటినీ కూడగట్టేందుకు పూనుకున్నాయి. ఈ ప్రయత్నాలకు జనసేన, లోక్‌సత్తా, ఆమ్‌ఆద్మీ పార్టీల నుండి, ఇతర ప్రజాతంత్ర శక్తుల నుండి స్పందన వస్తోంది. ఇది చాప కింద నీరు లాగా రాష్ట్రమంతటా క్రమంగా పరుచుకుంటూ సాగుతోంది.

ఆర్థిక స్థితిగతుల పెరుగుదల కోసం, సామాజిక న్యాయం కోసం నిరంతరంగా వామపక్షాలు, ప్రజాసంఘాలు గత నాలుగున్నరేళ్ళుగా సాగించిన, సాగిస్తున్న ఉద్యమాలే ప్రజాభిప్రాయాన్ని బలంగా ప్రభావితం చేస్తున్నాయి. అందుకే పాలక పార్టీ, ప్రధాన ప్రతిపక్షం రెండూ లోలోపల గుబులు పడుతున్నాయి. 2019 ఎన్నికల ఫలితాలను ఈ ప్రజా ఉద్యమాలు ప్రభావితం చేసి ఆ పార్టీల భవిష్యత్తును తిరగరాస్తాయి. ఇది అనివార్యం. బిజెపికి తిరుగులేదన్న పరిస్థితి 2018లో మారిపోయి ఆ పార్టీ ఓటమి ఖాయమన్న స్థితి వచ్చింది. నోట్ల రద్దు, జిఎస్‌టి, కార్పొరేట్ల సేవలో పడి ప్రజాసమస్యల్ని నిర్లక్ష్యం చేసిన వైనం, రాఫెల్ ఒప్పందం వంటి కుంభకోణాలు బిజెపి పుట్టి ముంచబోతున్నాయి. రాష్ట్రంలోనూ అలాంటి మార్పులు వస్తాయి. నాలుగున్నరేళ్లు ప్రజల్ని మోసం చేసి ప్రచారార్భాటంతో గట్టెక్కాలనుకుంటున్న పాలక పక్షానికి, పాలక పక్షంపైగల అసంతృప్తి తమకే లాభిస్తుందన్న అతి తెలివితో వ్యవహరిస్తున్న ప్రధాన ప్రతిపక్షానికి రాష్ట్ర ప్రజలు 2019 ఎన్నికలలో పాఠం నేర్పడం ఖాయం. ప్రజలకు చైతన్యం కల్పించడంలో వామపక్ష పార్టీలు, వారి మిత్రులది కీలక పాత్ర అన్నది స్పష్టం.

◆

జనవాక్యం

బహుపరాక్

నర్మదా తీరాన ఎత్తైన ప్రతిమ
నార్త్ ఈస్ట్ లో పొడవైన వంతెన
అంతరిక్షంలో అరుదైన విజయం
రాజ్యాంగ సంస్థల్లో ఎదురైన కలహం
మేఘాలయ గనుల్లో పోతున్న ప్రాణం
దక్షిణాదిన తుఫాన్ల ఘాతం
విచ్చలవిడిగా అవినీతి భూతం
రాజకీయం బాధ్యతా రహితం
ఆకలి తప్పని ఆధునిక భారతం.
పడుతూ లేస్తూ...
పాత సంవత్సరం తలాక్ చెప్పింది.
ఇక...
కొత్త సంవత్సరాది బహుపరాక్ అంటుంది
అసలే ఎన్నికల్ని తెస్తుంది
ఎన్నెన్ని కలల్ని మోస్తుంది
మూడు మాసాల నాటికి,
ఓట్ల పంట కొయ్యాలని
హామీల సాగు మొదలైంది
ఇప్పుడే తిట్ల నాట్లు పడుతున్నాయి
అందుకనే ఆంగ్ల సంవత్సరాది
అంటోంది బహుపరాక్ అని.

- డా॥ డి.వి.జి.శంకరరావు,
మాజీ ఎం.పి, పార్వతీపురం.

వ్యాసాలు, ఉత్తరాలు పంపాల్సిన చిరునామా
editpageps@gmail.com

పోషకాహార లోపం పెద్ద ప్రమాదం

జి. తిరుపతయ్య

ప్రపంచ పోషకాహార నివేదిక ఊహించిన దానికన్నా ఎక్కువ ప్రమాద సంకేతాలను ఇచ్చింది. ఈ నివేదిక ప్రకారం ప్రపంచ సమాజమంతా పౌష్టికాహార లోపంతో పెరుగుతున్నది. వేళ్ళపై లెక్కించే కొన్ని దేశాలు మినహా అంతటా ఈ పౌష్టికాహార లోపాలు పుష్కలంగా ఉన్నాయి. ఇందులో బయటపడిన గణాంకాలను చూసి ఐక్యరాజ్య సమితి యునిసెఫ్ లాంటి అనేక సంస్థలు ఆందోళనకు గురవుతున్నాయి. ఈ పౌష్టికాహార లోపంతో ఎదుగుతున్న భావితరం నేడు ప్రపంచాన్ని వణికిస్తున్న అంతర్జాతీయ ఉగ్రవాదం, పెట్టుబడి రూపంలో అంతర్జాతీయ అత్యాశ, చమురు ఉత్పాదక దేశాలపై సామ్రాజ్యవాదానికి తెగబడుతున్న పెత్తందారుల దాడులు, వివిధ దేశాల్లో అంతర్గత కలహాల కన్నా ఎక్కువ ప్రమాద సంకేతాన్ని ఇస్తున్నది. అంతర్జాతీయ పోషకాహార నివేదిక ప్రకారం ప్రపంచంలోని పిల్లల్లో మూడో వంతు పిల్లలు వారి వయసుకు ఉండవలసిన ఎత్తు కన్నా తక్కువ ఎత్తు ఉన్నారు. నాలుగవ వంతు పిల్లలు ఉండవలసిన బరువుకన్నా తక్కువ బరువుతో ఉన్నారు. ఈ రకమైన లోపాలు అభివృద్ధి చెందుతున్న, వెనుకబడిన దేశాల్లో మరీ ఎక్కువగా వున్నాయి. ఇక భారత్ విషయాన్ని తీసుకుంటే మధ్య భారత్‌లో 30 శాతం, ఉత్తర భారతంలో 40 శాతం మంది పిల్లలు ఈ సమస్య బారిన పడ్డారు. దక్షిణ భారతంలో 20 శాతం కన్నా తక్కువగా ఈ రకమైనటువంటి లోపంతో ఉన్నారట. ఇటువంటి వారి మొత్తం సంఖ్య తీసుకుంటే మన దేశంలో 4 కోట్ల 66 లక్షలుగా నమోదైంది. ఇది చాలా ఎక్కువ సంఖ్యే! ఇలాంటి పిల్లల ఎదుగుదల మానసికంగా, శారీరకంగా వెనుకబడి పోతుంది. ఈ నాసిరకమైన



మానవ వనరు నిరుపయోగమే కాకుండా వైద్య పరంగా కూడా పెనుభారంగా పరిణమించింది.

రెండు దశాబ్దాల క్రితం క్యాన్సర్ అరుదుగా బయటపడేది. కానీ నేడు ప్రతి ముగ్గురిలో ఒకరు క్యాన్సరు బారిన పడుతున్నారు. ఈ వార్తపై అందరూ దృష్టి పెట్టాలి. పరిపుష్టి కలిగిన ఆహారాన్ని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. ఎందుకంటే ప్రజాస్వామ్యమైనా లేదా అధ్యక్ష తరహా పాలనైనా రాజ్యంలోని సర్వ వనరులపై తుది అధికారం పాలకులదే. పౌరులు సౌష్ఠవంగా ఉండటం ప్రతి దేశానికీ ఎంతో అవసరం. కావలసినంత సంపద లేదా ఆహార ధాన్యాలు సృష్టించబడుతున్నప్పటికీ అవి అందరికీ అందలేక పోవడానికి కారణమెవరౌతున్నారో వారికి కూడా దేశ పౌరుల సౌష్టవంతో సంబంధం ఉన్నది. ధృఢమైన మానవ వనరు ఉంటేనే అన్నింటా అభివృద్ధి సాధ్యమౌతుంది. ఈ విషయంలో ఐక్యరాజ్య సమితి ఎన్నో సూచనలూ నిర్దేశాలూ ఇచ్చినప్పటికీ చాలా దేశాలు పెడ చెవిన పెట్టటం వల్లనే నాసి రకంగా మానవాభివృద్ధి జరుగుతున్నది. భారతదేశంలో పోషకాహార లోపం ఉండకూడదనే ఉద్దేశంతో పదేళ్ల క్రితమే ఐసిడిఎస్ పేరుతో 'సమగ్ర పిల్లల అభివృద్ధి పథకం' స్థాపించి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలకు, మూడేళ్ల లోపు పసి పిల్లలకూ కొంత పోషకాహారం ఇవ్వడానికి ప్రయత్నాలు జరిగాయి. కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దోబూచులాటల మధ్య వాటి అమలులో తీవ్ర అంతరాలు ఏర్పడి అనుకున్న ఫలితాలను ఇవ్వలేదు. ఎన్నికల తాయిలాలకే పెద్ద పీట వేయడానికి అలవాటు పడిన ప్రభుత్వాలు ఇట్లాంటి దీర్ఘదృష్టిని ఏనాడో కోల్పోయాయి. పౌష్టికాహారం లేక నట్టు పడిపోతున్న పిల్లలు ఏటేటా పెరుగుతున్నారు. పౌష్టికాహార లోపం మరీ ఎక్కువగా నమోదౌతున్నది గ్రామీణ భారతంలో. అయితే పుష్కలంగా తిండి దొరికిన పట్టణాల్లోని పిల్లల్లోనూ ఈ మహమ్మారి ఉన్నది. ఇట్లా పెరిగిన పిల్లల్లో రోగాల బెడద కూడా ఎక్కువే. అందుచేత సరైన జనాభాను పెంపొందించు కోవడం కూడా ప్రభుత్వాల లక్ష్యంగా ఉండాలి. పుష్టిగా భోంచేసిన వారిలోనూ పోషకాహార లోపం పెరిగి పోవడానికి అనేక కారణాల్లో ఒకటి నిల్వ ఉంచిన ఆహార ఉత్పత్తులు అంటే, ప్యాకెట్ ఫుడ్స్ తినడం. ఈ రకమైన ఆహారంలో కేవలం 21 శాతం మాత్రమే పోషకాహారం లభిస్తుంది. ప్రపంచం మొత్తం సగటు తీసుకున్నప్పుడు ఇది 31 శాతంగా ఉంది. అత్యధికంగా న్యూజిలాండ్లో 37 శాతం ఉన్నది. ఈ గణాంకాలన్నీ గుర్తింపు పొందిన సంస్థల తయారీలకు సంబంధించినవి. గుర్తింపులేని పొట్లాల ఆహారమే డెబ్బై శాతం లభ్యత కలిగి ఉన్నదంటే ప్రమాదం ఎంతో ఆలోచించాల్సిందే.

పుట్టిన పిల్లల్లో సరైన ఎదుగుదల లేక పోవడానికి కారణం 1. తల్లుల్లో అక్షరాస్యత చాలా తక్కువగా ఉండటం. వారేగనుక అక్షరాస్యులైనట్లయితే కనీస పరిజ్ఞానంతో తమ సంతానానికి సరైన ఆహారం అందించగలుగుతారు. 2. తక్కువ వయసులో పెళ్లిళ్లు చేయడం. అనగా భారత్ లాంటి చాలా దేశాల్లో ఇప్పటికీ బాల్య వివాహాలు జరుగుతున్నాయి. దానితో సరైన అవగాహన లేకుండానే పిల్లల్ని కంటున్నారు. పర్యవసానంగా నాసిరకం సంతానం పుడుతుంది. 3. ప్రసవానంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోకపోవడం. ఇది చాలా కీలకమైనది. మొదటి మూడేళ్లు ఆ తరువాత మరో ఐదేళ్లు పౌష్టికాహారం పెరుగుదలపై ప్రభుత్వాల నిరంతర పర్యవేక్షణ ఉండాలి. కానీ టీకాలు మాత్రం వేసి చేతులు దులుపుకుంటున్నాయి. అంతేకాక బిడ్డ పుట్టిన తర్వాత కావాల్సిన మోతాదులో పౌష్టికాహారం అందే విధంగా చూసుకోవడం అందరి బాధ్యతగా ఉండాలి. ఇలా చేయకపోతే నాణ్యతలేని మానవ సంపద పెరుగుతుంది. ఇది చాలా ప్రమాదం.

అగ్రరాజ్యమూ వెనుకబడిన రాజ్యమన్న తేడా లేకుండా అన్ని దేశాల్లోనూ రాజ్యమేలుతున్న పౌష్టికాహార లోపం పాడైపోతున్న పర్యావరణ సమస్యల్లో ఒకటని గుర్తించబడింది. ఇక స్పందించాల్సింది పాలకులు, సమాజమే. ఆహార సమస్యను పరిష్కరించకుంటే అడవిలోని వృక్షాల్లా మానవ సంపదంతా వొట్టిపోతుంది. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి ఈ నివేదకను సేకరించిన సంస్థల గోడు అరణ్య రోదనగా మిగలకూడదు. ఈ బాధ్యత మొదట ప్రభుత్వానిది. తరువాత సమాజానిది.

(రచయిత సెల్ :9951300016)

పాప ఏడుపు ఆమెని కదిలించింది



ఆదివారం అర్ధరాత్రి సమయం ఒంటి గంట దాటుతోంది.

అప్పుడే ఆమె మొబైల్ రింగయ్యింది.

హైదరాబాద్‌లోని అఫ్జల్‌గంజ్ పోలీసుస్టేషన్లో డ్యూటీలో ఉన్న ఆమె భర్త నుంచి ఆ కాల్ వచ్చింది. ఫోన్ లిఫ్ట్ చేసిన ఆమెకు అతని గొంతుకన్నా బిగ్గరగా ఎవరో ఒక పసిపాప గుక్కపెట్టి ఏడుస్తున్న స్వరం విన్పించింది. అలా ఏడుస్తున్నది ఎవరని భర్తని అడిగింది. అతని మాట విన్నాక మరిక ఆమె ఆలస్యం చేయలేదు. అర్ధరాత్రి వేళలోనే స్టేషన్‌కు వెళ్లి, ఆ చిన్నారికి చనుబాలిచ్చింది. ఆమె పేరు ప్రియాంక. ఆ పసిపాపతో ఆమెకు ఏ రక్త బంధమూ లేదు. ఉన్నదల్లా మానవత్వం అనే మానసిక బంధం మాత్రమే!

ఆదివారం రాత్రి 10.30 గంటల సమయంలో ఉస్మానియా హాస్పిటల్ వద్ద ఇర్ఫాన్ అనే యువకుడు నిలబడి ఉన్నాడు. ఇంతలో తాగిన మైకంలో బురఖాలో ఉన్న ఓ మహిళ తన సుమారు రెండు నెలల పాపతో వచ్చి, ఆ బిడ్డను అతడికి అప్పగించి నీళ్లు తాగివస్తానని చెప్పి వెళ్లింది. ఆమె ఎంతసేపటికీ తిరిగి రాలేదు. ఇర్ఫాన్ చేతుల్లో ఉన్న ఆ పసిపాప ఆకలితో గుక్కపెట్టి ఏడుస్తోంది. ఏం చేయాలో తెలియక ఆ పాపను ఇర్ఫాన్ యాకత్‌పురాలోని తన ఇంటికి తీసుకెళ్లాడు. ప్యాకెట్ పాలు తాగించేందుకు ప్రయత్నం చేశాడు. కానీ, ఆ చిన్నారి పాలు తాగలేదు.. ఏడుపూ ఆపలేదు. చేసేదిలేక ఏం చేయాలో తోచని స్థితిలో ఇర్ఫాన్ ఆ పాపను రాత్రి 11.30 గంటలకు అఫ్జల్‌గంజ్ పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చి, పోలీసులకు జరిగిన విషయం చెప్పి అప్పగించాడు. అక్కడా పోలీసులు ఎంత ఓదార్చినా ఆ పాప ఏడుపు ఆపలేదు. ఆ సమయంలో రాత్రి షిఫ్ట్‌లో బాధ్యతలు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రవీందర్ ఆ బిడ్డ పరిస్థితి చూసి, చలించిపోయాడు. ఆ పాప ప్రాణాన్ని కాపాడాలన్నా తపనతో ఏం చేయాలో తెలియని స్థితిలో తన భార్య ప్రియాంకకు ఫోన్ చేసి విషయాన్ని చెప్పాడు. ఆ పసిపాప పరిస్థితికి ప్రియాంక చలించిపోయింది. ఆమె కూడా కానిస్టేబుల్‌గానే పనిచేస్తోంది. బేగంపేట మహిళాపోలీస్ స్టేషన్లో ఆమె ఉద్యోగం. అయితే ఎనిమిది నెలల కిందటే బాబు పుట్టడంతో ప్రస్తుతం ప్రసూతి సెలవులో ఉంది. భర్త నుంచి ఫోన్ రాగానే ఆమె వెంటనే స్పందించింది.

బాబుని ఇంట్లో విడిచిపెట్టి ...

పాప అంతలా గుక్కపెట్టి ఏడుస్తోంటే.. ఒక తల్లిగా ఆ బాధ ఆమెకు అర్థమైంది. ఏదో తెలియని బాధ.. ఆ పాపకు ఏమవుతుందో అన్న ఆందోళన ప్రియాంక మనసునిండా అలముకుంది. దీంతో వేరే ఆలోచనేదీ లేకుండా ఎనిమిది నెలల వయసున్న బాబును తన తల్లికి అప్పజెప్పి.. వెంటనే క్యాబ్ బుక్ చేసుకుని, బేగంపేట నుంచి అఫ్జల్‌గంజ్ పోలీసుస్టేషన్‌కు వెళ్లింది. అప్పటికీ ఆ పాప గట్టిగా కళ్లు మూసుకుని, గుక్కపెట్టి ఏడుస్తూనే ఉంది. మరోపక్క సరైన దుస్తులు లేకపోవడంతో చలికి వణుకుతోంది. ఆ పసికందు పడుతున్న బాధను చూసి ఆమెకు ఏడుపు వచ్చింది. ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆ పాపకు చనుబాలు పట్టింది. దాదాపు 40 నిమిషాల పాటు ఆ పాప కడుపారా పాలు తాగాక, నెమ్మదిగా కళ్లు తెరిచింది. అప్పుడు ఆమెకు 'హమ్మయ్యా!' అనిపించింది. తర్వాత ఆ పాపను ఉస్మానియాలోని మెటర్నిటీ వార్డులో అప్పగించి, ప్రియాంక తనింటికి వెళ్లింది. తల్లి తాగిన మత్తులో కన్నబిడ్డను వదిలేసినా ఏ సంబంధం లేని మహిళా కానిస్టేబుల్ ప్రియాంక ఆ పాప ప్రాణాన్ని నిలిపింది.



ఎవరా పసిపాప?

ఆ పసిపాప తల్లిదండ్రుల గురించి ఆరా తీసిన పోలీసులకు .. పాప తండ్రి జేబు దొంగతనం కేసులో చంచల్‌గూడ జైలులో ఉన్న ఫిరోజ్ ఖాన్‌గా తేలింది. పాపను ఇర్ఫాన్‌కు ఇచ్చిన తల్లి షబానా బేగం. చిత్తు కాగితాలేరుకుని బతుకుతోంది. కల్లుకు అలవాటు పడడంతో మత్తులోనే తన పాపని వేరొకరికి ఇచ్చింది. ఆమె తన భర్త కోసం చంచల్‌గూడ జైలు దగ్గరకు వచ్చినప్పుడు ఈ విషయం పోలీసులకు తెలిసింది. చంచల్‌గూడ వద్ద తన బిడ్డ కోసం ఏడుస్తూ కూర్చున్న ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. తాగిన మత్తులో ఆ ప్రాంతం మరిచిపోయినట్టు తెలపడంతో చీవాట్లు పెట్టిన పోలీసులు, మరోసారి ఇలా చేస్తే చర్య తీసుకుంటామని హెచ్చరించారు. వాళ్లు ఉస్మానియా సమీపంలో ఓ షెడ్డులో నివాసముంటున్నారని తెలిసింది. చిన్నారి తల్లిని మందలించి, ఇక నుంచి ప్రతిరోజూ ఉదయం.. సాయంత్రం పోలీసు స్టేషన్లో చూపించాలన్న షరతుతో ఆ పాపను ఆమెకు పోలీసులు అప్పగించారు.

కానిస్టేబుల్ దంపతులు మానవత్వం, సమయస్ఫూర్తితో చేసిన మంచిపనికి ఉన్నతాధికారుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. విషయం తెలుసుకున్న సీపీ అంజన్‌కుమార్ వారిని అభినందించి ప్రియాంకకు బహుమతిని ఇచ్చారు. విషయం తెలిసిన వారంతా కానిస్టేబుల్ దంపతులను ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.

పసందైన.. పప్పు మిఠాయిలు



కొత్త సంవత్సరం మొదలయ్యిందంటే.. ఆత్మీయుల నోటిని తీపి చేసే సందర్భాలే ఎక్కువ. ఇంట్లో పిల్లలు కూడా కొంగ్రొత్త వేళ.. మిఠాయిలు తినడానికి బాగా ఇష్టపడతారు. అయితే ఎప్పుడూ.. తినేవేనా.. కాస్తంత కొత్తదనం ఉండాలి కదా..! అలా అనుకుంటే.. పల్లీలు (వేరుశనగ), బాదం, జీడిపప్పు. వాల్‌నట్స్ వంటి వాటితో.. ఇంట్లోనే.. బోల్డన్ని రకాల స్వీట్స్ తయారుచేయొచ్చు. ఇలాంటివి పిల్లలూ ఇష్టంగా తింటారు.



కాజు చిక్కీ

కావల్సిన పదార్థాలు : ఒకటిన్నర కప్పు – కాజు(జీడిపప్పు), పంచదార– ఒకటిన్నర కప్పు, నీరు – కొద్దిగా.

తయారుచేసే విధానం : ముందుగా పాన్ తీసుకుని అందులో పంచదార, కొద్దిగా నీటిని పోసి పాకంలా పట్టుకోవాలి. అందులో కాజూని వేసి ఆ మిశ్రమాన్ని ఒక పాన్‌లో పోసుకుని, ఆరిన తర్వాత కట్ చేసుకుంటే కాజుచిక్కీ రెడీ!

వాల్‌నట్ బర్ఫీ



కావల్సిన పదార్థాలు : వాల్‌నట్ పేస్ట్ – కప్పు, కోవా – అరకేజి, పంచదార – అరకప్పు, యాలకుల పొడి – అరటేబుల్ స్పూను, నెయ్యి– కొద్దిగా.

తయారుచేసే విధానం : ముందుగా పాన్‌కి కొద్దిగా నెయ్యిరాసి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడొక పాన్‌లో కోవా వేసి, వేడి చేసుకోవాలి. అందులో పంచదార వేసి ఐదు నిమిషాలపాటు ఉడికించుకోవాలి. ఇందులో వాల్‌నట్ పేస్ట్ వేసి, మరో 2, 3 నిమిషాలు ఉడికించుకోవాలి. చివరగా యాలకుల పొడి వేసి కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముందుగా నెయ్యిరాసి పెట్టుకున్న పాన్‌లోకి తీసుకోవాలి. కాసేపు ఆరిన తర్వాత, ఫ్రిజ్‌లో ఐదు లేక ఆరు గంటలు ఉంచుకోవాలి. ఆ తర్వాత కట్ చేసుకొని, సర్వ్ చేసుకోవాలి.

స్వీట్ అండ్ సాల్టీ

కావల్సిన పదార్థాలు : వాల్‌నట్ ముక్కలు – కప్పు, బాదంపప్పు – కప్పు, కాజు – కప్పు, డ్రై అంజూరు – కప్పు, ఉప్పు – టేబుల్ స్పూను, మిరియాల పొడి – అరటేబుల్ స్పూను, జీలకర్ర పొడి – పావు టేబుల్‌స్పూను, కారం – పావు టేబుల్ స్పూను, పంచదార – టేబుల్ స్పూను, నీళ్లు – పావుకప్పు, వెన్న– టేబుల్ స్పూను.

తయారుచేసే విధానం : ముందుగా పాన్‌లో వాల్‌నట్ ముక్కలు, బాదం పప్పు, కాజు వేసి ఇలా ఒక్కొక్కటిగా లైట్‌గా వేపుకొని, పక్కన పెట్టుకోవాలి. తర్వాత ఓ గిన్నె తీసుకుని, అందులో మిరియాల పొడి, కొద్దిగా ఉప్పు, కారం, జీలకర్ర పొడి వేసి, అన్నీ కలిసేలా బాగా కలుపుకోవాలి. ఇప్పుడు స్టౌవ్‌పై పాన్ పెట్టి, అందులో కొద్దిగా వెన్న వేయాలి. తర్వాత ముందుగా కలిపి పెట్టుకున్న కాజూ మిశ్రమాన్ని వేసి ఐదు, పది నిమిషాలు వేడి చేసుకోవాలి. అందులోనే పంచదార కూడా వేసి కలుపుకోవాలి. చివరగా డ్రై అంజూరు ముక్కలు, వెన్న వేసి కలుపుకోవాలి. అంతే స్వీట్‌గానూ, హాట్‌గానూ ఉండే నట్స్ స్పెషల్ రెడీ!



కుబానీ కా మీఠా



కావలసిన పదార్థాలు : ఎండు అక్రూట్ (కుబానీ) పండ్లు– కేజీ, పంచదార–ఒకటిన్నర కేజీ, తాజా మీగడ– కప్పు, బాదంపప్పులు– అర కప్పు.

తయారుచేసే విధానం : అక్రూట్ పండ్లను ఓ రాత్రంతా నానబెట్టాలి. మర్నాడు గింజలను వేరుచేసి గుజ్జును మెత్తగా గ్రైండ్ చేయాలి. ఇందులో పంచదార బాగా కలుపుతూ, తక్కువ మంటమీద ఉడికించాలి. బాగా దగ్గరపడ్డాక దించాలి. చివరగా దీన్ని ప్లేట్లలో సర్ది, పాల మీగడ, బాదంపప్పుతో అలంకరిస్తే రుచికరమైన కుబానీ కా మీఠా రెడీ! దీన్ని ఐస్‌క్రీమ్‌తో జతచేసి తినొచ్చు.


పోషకాలుంటాయి

అన్ని రకాల నట్స్‌లో ప్రొటీన్‌తోపాటు మంచి కొవ్వులూ ఉంటాయి. ఈ గింజలు మంచి కొలెస్ట్రాల్‌ను శరీరంలో పెంచి, చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. శరీరం ఆరోగ్యంగా ఉండటానికి ఉపయోగపడే పోషకాలు వీటిలో పుష్కలంగా ఉంటాయి.



జానకి బడుగు, పోషకాహార నిపుణులు

బాదం హల్వా



కావల్సిన పదార్థాలు : బాదం – కప్పు, పంచదార– ఒకటిన్నర కప్పు, నీళ్లు – ఐదున్నర కప్పులు, నెయ్యి – ఒకటిన్నర కప్పు, కుంకుమపువ్వు – కొద్దిగా.

తయారుచేసే విధానం : వేడిచేసిన ప్యాన్‌లో నాలుగు కప్పుల నీటిని తీసుకోవాలి. రెండు నిమిషాలు మరిగాక, బాదాం పప్పులను వేసి ఉడకనివ్వాలి. ఇలా ఉడికిన బాదంపప్పులపై పొట్టు తీసుకోవాలి. ఈ బాదంపప్పులను పేస్ట్‌లా చేసుకొని, పక్కన పెట్టుకోవాలి. వేడిచేసిన పాన్‌లో పావుకప్పు నీటిని తీసుకొని, అందులో పంచదార వేసి, కరిగిపోయేవరకూ కలపాలి. ఇందులో కుంకుమపువ్వు వేసి, నిమిషం పాటు మరిగించాలి. ఆ తరువాత మరొక వేడిచేసిన ప్యాన్‌లో నెయ్యి వేసి, కాగాక బాదం పేస్ట్‌ను వేయాలి. ఈ మిశ్రమాన్ని దాదాపు 8–10 నిమిషాల పాటు బాగా దగ్గరకు వచ్చేవరకూ కలుపుతూనే ఉండాలి. ఇప్పుడు ముందుగా తయారుచేసి పెట్టుకున్న పంచదార పాకాన్ని వేసి, దాదాపు రెండు నిమిషాల వరకు బాగా కలుపుతూ ఉండాలి. నెయ్యి అంచుల వెంట తేలే వరకూ కలుపుతూ ఉండాలి. అంతే బాదం హల్వా రెడీ అయినట్టే. అయితే ఇది మీ టేస్ట్‌ను బట్టి వేడిగానూ, చల్లగానూ సర్వ్ చేసుకోవచ్చు.

బహుమతి పొందిన ముగ్గు

17 చుక్కలు, 7 వరుసలు, 7 వచ్చేవరకు, సరిచుక్క.



సి. రాజ్యలక్ష్మి, ఎస్.రావ్ నగర్, హైదరాబాద్.

9 చ్కులు, 1 వచ్చే వరకు సరిచుక్క.



ఎస్. మల్లేశ్వరి, పామూరు, ప్రకాశంజిల్లా.

జీవన సౌరభం

మన జీవితమే మనకు టీచర్. అది నిరంతరం మనకు పాఠాలు నేర్పుతుంది. అదే ప్రకృతి సహజమైన జీవన సిద్ధాంతం.

మీకోసం

చికెన్ వేయించేటప్పుడు చక్కని రంగు రావాలంటే మొక్కజొన్నపిండికి బదులు, పాలపొడిని తీసుకుని, అందులో అద్ది వేయించాలి.



మా చిరునామా: 'రమణుల రంగవల్లి', జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక, హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2. ఇమెయిల్: jeevanapageps@gmail.com ఆదివారం మినహా ఉ.12 గం. సా.6 గం. మధ్య ఫోన్ నెం. 9490099006కు సంప్రదించండి.

సెన్సెక్స్ ⬆ 186
36,254

నిఫ్టీ ⬆ 48
10,910

రూపాయి ⬆ 09 పై
అమెరికా డాలరుకు రూ.
69.68

అమితాబ్‌కు యాక్సిస్ బ్యాంకు బాధ్యతలు

పెరిగిన షేర్ విలువ



న్యూఢిల్లీ : ప్రముఖ ప్రయివేటు రంగ బ్యాంకు యాక్సిస్ బ్యాంకు కొత్త సిఇఒగా అమితాబ్ చౌదరీ నియమితులయ్యారు. దీంతో శనివారం ఆ బ్యాంకు షేర్ 1 శాతం మేర పెరిగింది. యాక్సిస్ బ్యాంక్ అధినేత పదవి నుంచి శిఖా శర్మ తప్పుకున్నారు. సోమవారం బ్యాంక్ వేళలు ముగిసిన తదుపరి నుంచి ఆమె పదవీ విరమణ అమలులోకి వచ్చినట్టుగా యాక్సిస్ బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది. బ్యాంక్ కొత్త సారథిగా అమితాబ్ చౌదరీ నియామకం మంగళవారం నుంచి అమలులోకి వస్తుందని బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది. గత సెప్టెంబరులోనే శిఖా శర్మ వారసుడిగా అమితాబ్‌ను బ్యాంక్ ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఆయన నియామకంతో మంగళవారం నిఫ్టీలో యాక్సిస్ బ్యాంకు షేర్ 1.19 శాతం పెరిగి రూ.627.30 వద్ద ముగిసింది.

విశాఖ ఉక్కు రికార్డు అమ్మకాలు

ఏప్రిల్ డిసెంబర్‌లో 29% వృద్ధి

కొల్‌కత్తా : వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను నిర్వహిస్తున్న ఆర్ఐఎన్ఎల్ 2018 ఏప్రిల్ నుంచి డిసెంబర్ కాలం అమ్మకాల్లో రికార్డు స్థాయిలో 29 శాతం వృద్ధిని సాధించింది. ఈ సమయంలో రూ.14,687 కోట్ల విక్రయాలు చేసింది. గతేడాది ఇదే కాలంలో రూ.11,395 కోట్ల అమ్మకాలు నమోదు చేసింది. నూతన సంవత్సరం సందర్భంగా ఆర్ఐఎన్ఎల్-విఎస్‌పి ఛైర్మన్ పికె రత్ ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ 2018లో అన్ని రకాల నిర్వహణల్లో 20 శాతం వృద్ధి సాధించామన్నారు. తమ ఉద్యోగులు బ్లాస్ట్ ఫర్నేసెస్‌లో పుల్వెరైజ్డ్ కోల్ ఇంజెక్షన్ (పిసిఐ)ని ఉపయోగించడం ద్వారా వేడి లోహ ఉత్పత్తి తయారీ వ్యయాన్ని తగ్గించారన్నారు. ప్రతీ ఏడాది వేడి లోహ 100 కిలోలు లేదా టన్నుపై పిసిఐపై రూ.1,500 కోట్ల పొదుపు చేశామన్నారు. నాలుగో త్రైమాసికంలో ఆర్ఐఎన్ఎల్ బ్లాస్ట్ ఫర్నేసెస్, స్టీల్ మెల్ట్ షాప్స్, ఫర్నిషింగ్ మిల్స్‌లో విలువ, ఉత్పత్తి లక్ష్యం చేరడంలో తమ ఉద్యోగుల ప్రోత్సాహం ఉందన్నారు. 2018లో తాము చెప్పుకోదగ్గ లక్ష్యాలను చేరుకున్నామన్నారు. ముఖ్యంగా అధిక విలువ కలిగిన స్టీల్ ఉత్పత్తి, కొత్త మిల్లుల సామర్థ్యం వినియోగం, విద్యుత్ ఉత్పత్తిలో మెరుగుదల, ముడి సరుకు సరఫరాను పెంచుకున్నామన్నారు.

తగ్గిన జిఎస్‌టి వసూళ్లు




న్యూఢిల్లీ : వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) వసూళ్లలో తగ్గుదల చోటు చేసుకుంది. క్రితం ఏడాది డిసెంబర్‌లో ఈ పన్ను వసూళ్ల 94,726 కోట్లకు పడిపోయాయి. ఇంతక్రితం నవంబరు నెలలో జిఎస్‌టి వసూళ్ల రూ.97,637 కోట్లుగా నమోదయ్యాయి. 2018 డిసెంబరు 30 నాటికి మొత్తం జిఎస్‌టిఆర్-3బి రిటర్న్‌ల నమోదు సంఖ్య 72.44లక్షలకు చేరినట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ మంగళవారం వెల్లడించింది. క్రితం మాసంలో కేంద్ర జిఎస్‌టి కింద రూ.16,442కోట్లు వసూలు కాగా రాష్ట్ర జిఎస్‌టి కింద రూ.22, 459కోట్లు, ఇంటిగ్రేటెడ్ జిఎస్‌టి(ఐజిఎస్‌టి) రూ.47,936కోట్లు, సెస్ కింద రూ.7,888కోట్లు వసూలు అయ్యాయి. గతేడాది రెండు సార్లు జిఎస్‌టి వసూళు లక్ష కోట్ల మార్క్‌ను నమోదు చేశాయి. ఏప్రిల్‌లో రూ.1.03లక్ష కోట్లు, మేలో రూ.94,016కోట్లు, జూన్‌లో రూ.95,610కోట్లు, జులైలో రూ.96,483కోట్లు, ఆగస్టులో రూ.93,960కోట్లు, సెప్టెంబరులో రూ.94,442కోట్లు, అక్టోబరులో రూ.1,00,710కోట్లు, నవంబరులో రూ.97,637 కోట్ల చొప్పున జిఎస్‌టి వసూళ్లయ్యింది.

పేటియం పేమెంట్ బ్యాంకుకు ఊరట

న్యూఢిల్లీ : కొత్త ఖాతాదారుల నమోదుకు ప్రముఖ డిజిటల్ చెల్లింపుల యాప్ పేటియం పేమెంట్స్ బ్యాంకుకు రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) అనుమతించింది. వన్9 కమ్యూనికేషన్స్, విజయ్ శేఖర్ శర్మ సహ యాజమాన్యంలోని పేటియం బ్యాంకులో కెవైసీ నిబంధనలు ఉల్లంఘనల ఆరోపణలతో గత ఏడాది జూన్‌లో కొత్త కస్టమర్లను నమోదును ఆర్‌బిఐ నిలిపివేసింది. తాజా నిర్ణయం ఆ సంస్థకు భారీ ఊరటనిచ్చినట్లయ్యింది. ఈవాలెట్లను తెరుచుకునేందుకు, కొత్త కొస్టమర్ల నమోదుకు మంగళవారం ఆర్‌బిఐ అనుతినిచ్చింది. దీంతో తన బ్యాంకింగ్ సేవలను మరింత మెరుగుపరచడానికి సంబంధిత వినియోగదారుల కెవైసి ప్రాసెస్‌ను ప్రారంభించాలని పేటియం పేమెంట్ బ్యాంకు యోచిస్తోంది. అదే విధంగా బ్యాంక్ సిఇఒగా ఉన్న రేణు సత్తిని తొలగించి, కొత్త సిఇఒ, మేనేజింగ్ డైరెక్టర్‌గా సతీష్ గుప్తాను నియమించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో దాదాపు 32 సంవత్సరాల అనుభవం కలిగి ఉన్నారు. పేటీఎం పేమెంట్స్ బ్యాంకులో సుమారు 4.2 కోట్ల ఖాతాలుండగా, 2019 చివరి నాటికి10 కోట్లకు చేరుకోవాలని ఆ సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.

రూ.77వేల కోట్ల డిజిన్వెస్ట్‌మెంట్

2018లో పిఎస్‌యుల్లో ప్రైవేటు బాట
ఈ ఏడాది ఎయిరిండియా పై వేటు



న్యూఢిల్లీ : క్రితం ఏడాది 2018లో మోడీ సర్కార్ ప్రభుత్వ రంగ సంస్థల్లో రికార్డు స్థాయిలో రూ.77,417 కోట్ల వాటాలను విక్రయించింది. 2019లోనూ భారీ ఎత్తున డిజిన్వెస్ట్‌మెంట్ చేయనుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా తదుపరి వాటా విక్రయం ఎయిర్ ఇండియాలోనేనని తెలుస్తోంది. ఇప్పటికే చాలా పిఎస్‌యుల ప్రయివేటీకరణకు బిజెపి సారథ్యంలోని ఎన్‌డిఎ బాటలు వేసింది. పలు కంపెనీలను విలీనం చేయడం, డిజిన్వెస్ట్‌మెంట్‌లో కొత్త ఎత్తుగడలు వేయడం ద్వారా బ్లూచిప్ కంపెనీల్లో సర్కార్ వాటాలను తగ్గించుకుంటుంది.

ముఖ్యంగా గతేడాది హెచ్‌పిసిఎల్‌ను ఒఎన్‌జిసి స్వాధీనం చేసుకోవడం, సిపిఎస్ఇ ఇటిఎఫ్, భారత్-22 ఇటిఎఫ్, కోల్ ఇండియాలో వాటాలను విక్రయించారు. అదే విధంగా మరో ఆరు పిఎస్‌యులను ఐపిఒకు పెట్టారు. దీని ద్వారా రూ.77,412 కోట్ల విలువ చేసే వాటాలను ప్రయివేటుకు దారాదత్తం చేసినట్లయ్యింది. ఇదే సమయంలో ఎయిరిండి యాలో 74 శాతం వాటాను విక్రయించడానికి ప్రయత్నించి విఫలమైంది. దీంతో తాజాగా ఎయిరిండియా విక్రయానికి కేంద్రం కొత్త ప్రణాళికలు వేస్తోంది. ఇందులో భాగంగానే ఆ సంస్థ ఆస్తులను విడదీసి అమ్మడానికి కసరత్తు చేస్తుంది. ఇందులో భాగంగానే ఎయిర్ ఇండియా ఎయిర్ ట్రాన్స్‌పోర్టు సర్వీసెస్ లిమిటెడ్ (ఎఐఎటిఎస్ఎల్), ఎయిర్ ఇండియా ఇంజనీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్ (ఎఐఇఎస్ఎల్), లాండ్ అండ్ బిల్డింగ్ అసెట్స్ ఆఫ్ ఎయిర్ ఇండియాను వేరు వేరుగా చేసి విక్రయించడం ద్వారా ఎయిరిండియా రుణ భారాన్ని రూ.29,000 కోట్లకు తగ్గించాలని కేంద్ర యోచనగా ఉంది. అదే విధంగా సబ్సీడరీ ఆస్తుల విక్రయం ద్వారా రూ.9,000 కోట్ల వరకు రాబట్టుకోవాలని ప్రభుత్వ ఆలోచనగా ఉంది. 2019లో ముఖ్యంగా పవన్ హాన్స్‌లో వాటా విక్రయించాలనేది మోడీ సర్కార్ ప్రణాళిక. ఇందులో ప్రభుత్వానికి 51 శాతం వాటా, మిగితా వాటా ఒఎన్‌జిసికి ఉంది. ఈ హెలిక్యాప్టర్ సేవల సంస్థను వచ్చే మార్చి ముగింపు నాటికి ప్రయివేటు శక్తులకు విక్రయించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. అదే విధంగా 10 కేంద్ర ప్రభుత్వ కంపెనీల్లో డిజిన్వెస్ట్‌మెంట్ చేయాలనేది ప్రధాన ఉద్దేశంగా ఉంది. ఇందులో ఒఎన్‌జిసి, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఆయిల్ ఇండియా, ఎన్ఎల్‌సి, భెల్, నాల్కో కంపెనీలున్నాయి. వీటిల్లో వాటాల విక్రయం ద్వారా రూ.12,000 కోట్లు రాబట్టుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. అదే విధంగా రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్ఇసి)ని పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పిఎఫ్‌సి) ద్వారా కొనిపించాలని కేంద్ర యోచన. దీని ద్వారా రూ.15,000 కోట్లు పొందాలని యోచిస్తుంది. అదే విధంగా ప్రభుత్వానికి చెందిన ఎస్‌జెవిఎన్‌ను ఎన్‌టిపిసి ద్వారా కొనుగోలు చేయించడం ద్వారా రూ.6,000 కోట్లు రాబడి పొందడానికి ప్రణాళికలు వేసింది.

గతేడాది జనవరిలో హెచ్‌పిసిఎల్-ఒఎన్‌జిసి విలీనం జరిగింది. హెచ్‌పిసిఎల్‌లోని 51.11 శాతం ప్రభుత్వ వాటాను ఒఎన్‌జిసి రూ.36,915 కోట్లకు కొనుగోలు చేసింది. దీంతో ఈ మొత్తం ప్రభుత్వ ఖాజానకు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇదే అతిపెద్ద డిజిన్వెస్ట్‌మెంట్. 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ.72,500 కోట్ల డిజిన్వెస్ట్‌మెంట్‌ను లక్ష్యంగా పెట్టుకోగా.. ఒఎన్‌జిసి-హెచ్‌పిసిఎల్ డీల్‌తో రూ.1 లక్ష కోట్ల వాటాల ఉపసంహరణ మార్క్‌ను చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పలు పిఎస్‌యుల్లోని వాటాలను ఉపసంహరించుకోవడం ద్వారా రూ.80,000 కోట్లు రాబట్టుకోవాలని మోడీ సర్కార్ లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే. 2018లో రైల్వే సెక్టార్‌లోని ఆర్‌ఐటిఇఎస్, ఐఆర్‌కాన్‌లు ఐపిఒకు వచ్చాయి. నవంబర్‌లో కోల్ ఇండియాలో వాటాల ఉపసంహరణ ద్వారా కేంద్రానికి రూ.5,218 కోట్లు, జనవరిలో ఎన్ఎండిసిలో డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా రూ.1,200 కోట్ల విలువ చేసే వాటాలను ప్రయివేటుకు కట్టబెట్టింది.

ఆరంభం అదిరింది

ముంబయి : కొత్త ఏడాది తొలి రోజు దేశీయ స్టాక్ మార్కెట్లతో లాభాలతో ప్రారంభమయ్యాయి. మదుపర్ల కొనుగోళ్ల మద్దతుతో మంగళవారం సెన్సెక్స్, నిఫ్టీలు రాణించాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 186 పాయింట్లు లేదా 0.52 శాతం రాణించి 36,254కు చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 47 పాయింట్లు లేదా 0.44 శాతం లాభపడి 10,910 వద్ద ముగిసింది. సెన్సెక్స్-30లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, భారతీ ఎయిర్‌టెల్, యస్ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, ఎస్‌బిఐ షేర్లు అధిక లాభాలు సాధించిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్, హెచ్‌యుఎల్, ఒఎన్‌జిసి, కొటాక్ బ్యాంకు షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

కొత్త ఏడాదిలో పెరిగిన పసిడి ధర

2018లో రూ.1,870 ప్రియం

న్యూఢిల్లీ : కొత్త ఏడాది తొలి రోజు బంగారం ధరలో పెరుగుదల చోటు చేసుకుంది. అంతర్జాతీయంగా పసిడికి డిమాండ్ పెరగడంతో పాటు దేశీయంగా అభరణాల వర్తకులు కొనుగోళ్లకు మొగ్గు చూపడంతో సోమవారం బంగారం, వెండి ధరలు మరింత ప్రియమయ్యాయి. గ్లోబల్‌గా న్యూయార్క్ మార్కెట్‌లో ఒక ఔన్స్ పసిడి ధర 1,282.17 డాలర్లకు చేరగా, వెండి ధర 15.44 డాలర్లుగా నమోదయ్యింది. దేశీయంగా న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 99.9 శాతం, 99.5 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.200 పెరిగి వరుసగా రూ.32,470, రూ.32,320గా పలికింది. కిలో వెండిపై రూ.150 భారమై రూ.39,250గా నమోదయ్యింది.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

ఉదో

ప్రెస్‌మడ్ అని దేనిని అంటారు?



ఎస్.పి. మనోహర్ కుమార్,
టీచర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
నున్న, కృష్ణా జిల్లా.
సెల్ : 94903 00637

జనరల్ సైన్స్

ముఖ్యమైన పరిశ్రమలు

ఎరువుల పరిశ్రమ : మొక్కలకు ఆవశ్యక పోషకాలను అందించేందుకు ఉపయోగించే వాటిని ఎరువులు అంటారు. ఇవి రెండు రకాలు.

1. ఏకమాత్ర ఎరువులు : ఒకే ఒక పోషక మూలకాన్ని ఇచ్చే ఎరువులను ఏకమాత్ర ఎరువులని అంటారు.

ఉదా : NH_4NO_3, NH_4Cl, KCl, $Ca(NO_3)_2$

2. ద్విమాత్ర ఎరువులు : కొన్ని ఎరువులు రెండు పోషక మూలకాలను ఇవ్వగలవు వీటిని ద్విమాత్ర ఎరువులు అంటారు. వీటిని సంయోగ ఎరువులు అని కూడా అంటారు. **ఉదా :** KNO_3

సాధారణంగా వ్యవసాయ రంగంలో ఉపయోగించే ఎరువులు

పొటాషియం ఎరువులు : KCl, KNO_3, K_2SNO_4


నైట్రోజన్ ఎరువులు : NH_4NO_3, NH_4Cl, NH_2CONH_2

ఫాస్పరస్ ఎరువులు : $NH_4H_2PO_4$, $Ca(H_2PO4)_2$.

ఆహార పరిశ్రమ : చట్టపరంగా అనుమతించిన ఆహార పదార్థాలకు రంగు, రుచి, వాసన, నిల్వ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు కలిపే పదార్థాలను ఫుడ్ అడిటివ్స్ అంటారు. యాంటీ ఆక్సిడెంట్లు ఆహార పదార్థాలు పాడవ్వకుండా కాపాడతాయి. ఫ్రూట్ సాల్ట్స్, సోడియం బైకార్బొనేట్ టార్టారిక్ అమ్లం, సిట్రిక్ ఆమ్లాల మిశ్రమం. ఇవి ఎక్కువకాలం నిల్వ ఉండేందుకు సోడియం మెటాబైసల్ఫేట్‌ను కలుపుతారు.

చక్కెర పరిశ్రమ : చెరకుగడలను క్రషింగ్ చేసినపుడు చెరకు రసం వస్తుంది. చెరకురసం తీసివేసిన చెరకు పిప్పిని **'బగాసే'** అంటారు. దీనిని విద్యుదుత్పత్తికి ఇంధనంగానూ, కాగితం తయారీలోనూ ఉపయోగిస్తారు. ఇలా తీయగా మిగిలిన చెరకురసంలోని ఆమ్లత్వాన్ని తొలగించడానికి $Ca(OH)_2$ (సున్నం) కలుపుతారు. ఇలా ఆమ్లత్వాన్ని తగ్గించడాన్ని డెఫికేషన్ అంటారు. అనంతరం ద్రావణంలోని సున్నాన్ని తొలగించడానికి CO_2 వాయువును పంపుతారు. ఇలా ఎక్కువైన సున్నాన్ని తొలగించే ప్రక్రియను కార్బొనేషన్ అంటారు. ఇంకా ఏమైనా సున్నం అవశేషాలను తొలగించడానికి SO_2 వాయువును పంపిస్తారు. ఈ ప్రక్రియను సల్ఫిటేషన్ అంటారు. పై ప్రకియలైన డెఫికేషన్, కార్బొనేషన్, సల్ఫిటేషన్ వల్ల ఏర్పడిన అవక్షేపాన్ని **ప్రెస్‌మడ్** అని అంటారు. ఇది మంచి ఎరువుగా ఉపయోగ పడుతుంది. ఈ రకంగా ఏర్పడిన అవక్షేపం పోగా మిగిలిన పారదర్శక రసాన్ని బాష్పీకరణ యంత్రాల్లో ఇగిర్చినపుడు చక్కెర స్ఫటికాలు ఏర్పడతాయి.


ఆల్కహాల్ పరిశ్రమ : సాధారణంగా ఇథైల్ ఆల్కహాల్‌ను ఆల్కహాల్‌గా పిలుస్తారు. వివిధ పదార్థాలలో మత్తును కలిగించేది ఇథైల్ ఆల్కహాల్. అందుకే దీనిని **'స్పిరిట్ ఆఫ్ వైన్'** అంటారు. చెరకురసం నుంచి చక్కెరను వేరుచేయగా మిగిలిన ద్రావణాన్ని **'మొలాసిస్'** అంటారు. ఇది జేగురు రంగులో ఉంటుంది. దీనికి ఈస్ట్‌ను కలిపి **'కిణ్వప్రక్రియ'** జరిపినపుడు ఇథైల్ ఆల్కహాల్ ఏర్పడుతుంది. శుద్ధ ఆల్కహాల్‌ను తాగడానికి వినియోగించకుండా ఉండేందుకు దానికి మిథైల్ ఆల్కహాల్‌ను కలుపుతారు. దీనిని అసహజ స్పిరిట్ అంటారు. కల్తీ సారాలో మిథైల్ ఆల్కహాల్‌ను కలపడం వల్ల దానిని సేవించిన వారు కంటిచూపు కోల్పోయి, మరణం సంభవిస్తుంది. కల్తీకల్లులో మత్తు కోసం **'డైజోపామ్'**, నురగ కోసం **'క్లోరాల్ హైడ్రేట్'**ను కలుపుతారు. బీరులో 3-6% ఆల్కహాల్ ఉంటుంది. దీనిని బార్లీ నుంచి తయారుచేస్తారు. వోడ్కాలో 60% ఆల్కహాల్ ఉంటుంది. దీనిని పొటాటోల నుంచి తయారుచేస్తారు. జిన్‌లో 40-45% ఆల్కహాల్ ఉంటుంది. దీనిని మొక్కజొన్న నుంచి తయారుచేస్తారు. విస్కీలో 35-40% ఆల్కహాల్ ఉంటుంది. దీనిని మాల్ట్ నుంచి తయారుచేస్తారు. సైడర్‌లో 2-6% ఆల్కహాల్ ఉంటుంది. దీనిని ఆపిల్ నుంచి తయారుచేస్తారు. రమ్‌లో 45-55% ఆల్కహాల్ ఉంటుంది. దీనిని మొలాసిస్ నుంచి తయారుచేస్తారు. బ్రాందీలో 40-45% ఆల్కహాల్ ఉంటుంది. దీనిని ద్రాక్షరసం నుంచి తయారుచేస్తారు. వైన్‌లో 12-16% ఆల్కహాల్ ఉంటుంది. దీనిని ద్రాక్షరసం నుంచి తయారుచేస్తారు.



మందుల పరిశ్రమ : ఆధునిక రసాయన శాస్త్రం, బయో టెక్నాలజీ అభివృద్ధి అనంతరం మానవులకు వచ్చే వివిధ రకాల వ్యాధులు తగ్గించడానికి, ప్రివెంటివ్ మందులు ఎన్నో లభ్యమవుతున్నాయి.

ఆంటిసెప్టిక్స్ : వ్యాధులు వ్యాపించడానికి, వాటిని తగ్గించడానికి ఇవి ఉపయోగపడతాయి. **ఉదా :** టింక్చర్ అయోడిన్, హైడ్రోజన్ పెరాక్సైడ్.


$$KNO_3 \rightleftharpoons K^+ + NO_3^-$$
Potassium Nitrate
$$K_2SO_4 \rightleftharpoons 2K^+ + SO_4^-$$
Potassium Sulfate



యాంటి బయాటిక్స్ : శరీర రోగాలకు కారకమయ్యే వివిధ రకాల హానికారక సూక్ష్మజీవులను నశింపజేసేవి. వీటిని సూక్ష్మజీవుల నుంచి తయారుచేస్తారు. అంటే సూక్ష్మజీవులకు వ్యతిరేకంగా కలిగించే సూక్ష్మజీవుల నుంచి తయారుచేసిన ఉత్పన్నాలే యాంటిబయాటిక్స్. **ఉదా :** పెన్సిలిన్, టెట్రాసైక్లిన్, ఆంపిసిలిన్, పోలియోవ్యాక్సిన్ వంటివి.

క్లోరోక్విన్ : మలేరియాని తగ్గించడానికి దీనిని ఉపయోగిస్తారు. మానసిక రుగ్మతను నయం చేయడానికి దీనిని ఉపయోగిస్తారు.

అనాల్జెసిక్‌లు : శరీర నొప్పిని తగ్గించడానికి వీటిని ఉపయోగిస్తారు. **ఉదా :** అసిటైల్ సాలిసిలిక్ ఆసిడ్ (ఆస్పరిన్)



నార్కోటిక్స్ : ఇవి తీవ్రస్థాయిలో మత్తును కలుగజేసి అపస్మారక స్థితిని, నిద్రను కలుగజేస్తాయి.

ఉదా : హెరాయిన్, మార్ఫిన్, ఇతర ఆల్కలాయిడ్‌లు.

సెడెటివ్స్ : ఇవి బలహీనతను, ఆతృతను తగ్గిస్తాయి.

ఉదా : సోడియం బ్రోమైడ్, పొటాషియం బ్రోమైడ్

సల్ఫాడ్రగ్స్ : వీటిని యాంటీ బ్యాక్టీరియల్‌గా ఉపయోగిస్తారు.

డీటాక్సోహాల్ : ఇది రక్తంలోని ఆల్కహాల్ శాతాన్ని తగ్గించడానికి ఉపయోగిస్తారు.

ఫొటోగ్రఫీ పరిశ్రమ : ఫొటోగ్రఫీ అనేది కాంతి సమక్షంలో జరిగే ఒక రసాయనచర్య. ఇందులో ఉపయోగించే ద్రావణం హైపో. ఇది స్థిరీకరణిగా ఉపయోగపడుతుంది. ఫొటోగ్రఫీ కాగితంపై పూసే రసాయనం సిల్వర్ బ్రోమైడ్. అదేవిధంగా బ్లాక్ అండ్ వైట్ ఫొటోగ్రాఫ్‌లో నల్లగా కనిపించేది సిల్వర్ లోహం.

సిమెంట్ పరిశ్రమ : సిమెంట్‌ను జోసఫ్ ఆస్పిడిన్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. దీంతో కట్టిన కట్టడాలు ఇంగ్లండ్‌లోని పోర్టులాండ్ అనే ప్రదేశంలోని రాళ్లవలే గట్టిగా ఉంటాయి. అందుకే సిమెంటును పోర్టులాండ్ సిమెంట్ అంటారు. దీని తయారీలో సున్నపురాయి, బంకమన్ను, జిప్సమ్‌లను ముడిపదార్థాలుగా ఉపయోగిస్తారు.

సిరామిక్స్ : గ్రీకు పదమైన 'కెరామోన్' నుంచి సిరామిక్స్ అనే పదం వచ్చింది. వీటి తయారీలో బంకమన్ను, ఫెల్‌స్పార్, ఇసుకలను ఉపయోగిస్తారు. వీటిని చూర్ణం చేసి, తగినంత నీరు కలిపి ఎండబెడతారు. ఎండిన పదార్థాలను కొలిమిలో 2000 సె.కు వేడిచేసినపుడు ఈ **సిరామిక్స్ లేదా మృణ్మయపాత్రలు** ఏర్పడతాయి.

గాజు పరిశ్రమ : గాజు తయారీలో ముడి పదార్థాలుగా సోడాయాష్, సున్నపురాయి, శుద్ధ సిలికాతో పాటు పగిలిన గాజుముక్కలనూ ఉపయోగిస్తారు. వీటన్నింటినీ కలిపి **'బాచ్'** అనీ పగిలిన గాజుముక్కలను **'కల్లెట్'** అనీ అంటారు. గాజు పారదర్శక పదార్థం. అస్ఫటిక పదార్థం. ఇది ఘనరూపంలో కనిపిస్తున్నా, నిజమైన ఘనపదార్థం కాదు. అతి శీతలీకరణం చెందిన ద్రవం. గాజు రసాయనికంగా సోడియం సిలికేట్, క్యాల్షియం సిలికేట్, సిలికాల మిశ్రమం. సోడా గాజు లేదా మెత్తని గాజును సీసాలు, కిటికీ అద్దాల తయారీలో, ఫ్లింట్ గాజును విద్యుత్ బల్బులు, కంటి అద్దాల తయారీలో, పైరెక్స్ గాజును ప్రయోగశాల పరికరాల తయారీలో, క్వార్ట్జ్ గాజును అల్ట్రావయోలెట్ కిరణాలను నిరోధించే అద్దాలు, కటకాల తయారీలో బోరోసిలికేట్‌ను వంటపాత్రలు, గొట్టపు ద్వారాల తయారీలో ఉపయోగిస్తారు.

పరిశ్రమలు - జబ్బులు : వివిధ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు ఆయా ముడిపదార్థాల వల్ల వివిధ జబ్బులు సోకుతుంటాయి. గాజు, కంకర పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు **'సిలికోసిస్'**, బొగ్గు గనుల్లో పనిచేసే కార్మికులకు **'న్యూమోకోనియోసిస్'**, జిన్నింగ్ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు **'బిస్సినోసిస్'** (బ్రౌన్‌లంగ్స్ వ్యాధి), ఇనుప పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు **'సిడరోసిస్'**, పాదరసం ఉపయోగించే పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు **'మినీమేటా'**, పాస్ఫరస్ ఉపయోగించే పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు **'ఫాసీజా'**, రాతినార పరిశ్రమలో పనిచేసే కార్మికులకు **'ఆస్‌బెస్టాసిస్'** నూలు, టెక్స్‌టైల్ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు **'వైట్‌లంగ్స్'** వ్యాధులకు గురవుతారు. ★

ఉద్యోగాలు

సౌత్ వెస్ట్రన్ రైల్వేలో 963 ఖాళీలు

హుబ్లిలోని సౌత్ వెస్ట్రన్ రైల్వే (ఎస్‌డబ్ల్యూఆర్) వివిధ డివిజన్/యూనిట్లలో ఖాళీగా ఉన్న 963 ట్రేడ్ అప్రెంటీస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

డివిజన్ల వారీ ఖాళీలు: హుబ్లి డివిజన్-287, క్యారేజ్ రిపేర్ వర్క్‌షాప్ (హుబ్లి)-176, బెంగళూరు డివిజన్-280, మైసూర్ డివిజన్-177, సెంట్రల్ వర్క్‌షాప్ (మైసూర్)-43.

ట్రేడులు: ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, ప్రోగ్రామింగ్ అండ్ సిస్టమ్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్, టర్నర్, మెషినిస్ట్, పెయింటర్, కార్పెంటర్, స్టెనోగ్రాఫర్ తదితర విభాగాలు.

అర్హత: పోస్టును బట్టి పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణత.

వయసు: 15-24 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో **దరఖాస్తు ఫీజు:** రూ.100 (ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మహిళలకు ఉచితం).

ఎంపిక: అకడమిక్ మార్కుల ఆధారంగా.

దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 16, 2019.

వెబ్‌సైట్: www.rrchubli.in

భువనేశ్వర్-ఎయిమ్స్‌లో 124 పోస్టులు

భువనేశ్వర్‌లోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 124 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు:

1. సీనియర్ రెసిడెంట్లు: 123

విభాగాలు: అనస్థీషియాలజీ, బయో కెమిస్ట్రీ, బర్న్స్ అండ్ ప్లాస్టిక్ సర్జరీ, కార్డియాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ తదితర విభాగాలు

అర్హత: పోస్టును బట్టి సంబంధిత విభాగంలో పీజీ (ఎండీ/ఎంఎస్/డీఎం/ ఎంసీహెచ్/డీఎన్‌బీ) ఉత్తీర్ణత.

2. పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ (కార్డియో-థొరాసిక్ అనస్థీషియా): 1

అర్హత: ఎండీ / డీఎన్‌బీ ఉత్తీర్ణత.

వయసు: సీనియర్ రెసిడెంట్ పోస్టులకు 37 ఏళ్లు, పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ పోస్టుకు 45 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

ఎంపిక: సీనియర్ రెసిడెంట్ పోస్టులకు రాత పరీక్ష, పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ పోస్టులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఉంటుంది.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో. **దరఖాస్తు ఫీజు :** జనరల్, ఓబీసీలకు రూ.1000 ఎస్సీ, ఎస్టీలకు రూ.500.

దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 25, 2019.

వెబ్‌సైట్: https://aiimsbhubaneswar.nic.in

శ్రీవారి సేవలో ప్రముఖులు

ప్రజాశక్తి-తిరుమల(కొండ)

నూతన సంవత్సరం సందర్భంగా శ్రీవేంకటేశ్వరస్వామిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. అర్ధరాత్రి 12 గంటలకు ప్రారంభమైన విఐపి విరామ సమయంలో డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, సినీ నిర్మాత దిల్ రాజు, బాలీవుడ్ నిర్మాత బోనీకపూర్, శ్రీదేవి కుమార్తెలు జాహ్నవి, ఖుషి కపూర్, చెన్నయ్ హైకోర్టు జడ్జి ఎం. గోవిందరాజు, ఉదయగిరి ఎమ్మెల్యే బొల్లినేని రామారావు, వెంకటగిరి ఎమ్మెల్యే రామకృష్ణ, తిరుపతి ఎమ్మెల్యే సుగుణమ్మ, తెలంగాణ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, పద్మశ్రీ ఎల్లా వెంకటేశ్వరరావు శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు స్వాగతం పలకి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.



అసంపూర్తిగానే నిర్మాణాలు

మినీ స్టేడియాన్ని ప్రారంభించిన బాబాయ్, అబ్బాయి

ప్రజాశక్తి-టెక్కలి(శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లా టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మినీ స్టేడియం నిర్మాణ పనులు అసంపూర్తిగానే ఉన్నప్పటికీ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు హడావుడిగా మంగళవారం స్టేడియాన్ని ప్రారంభించడంపై పలువురు విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు. నాలుగేళ్ల క్రితం మినీ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పటికీ పూర్తిస్థాయిలో పనులు పూర్తికాలేదు. దీనిపై ప్రతిపక్షాలు, పత్రికలు పలుమార్లు స్పందించాయి. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలనే ప్రారంభించడంలో గల తొందరపాటును పలువురు విమర్శిస్తున్నారు. ఇదిలా ఉండగా స్టేడియం ప్రారంభంలో భాగంగా చదరంగం, బాల్ బ్యాడ్మింటన్‌లను మంత్రి, ఎంపీ ఆడి వాటిని ప్రారంభించారు. టెక్కలిలోనూ నూతనంగా నిర్మించిన మోడల్ పోలీస్ స్టేషన్ భవనాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టెక్కలిని మహా నగరంగా తీర్చిదిద్దాలన్న ఆశయానికి ఎవరూ ఆటంకంగా నిలవడం లేదని, తాను చేసిన అభివృద్ధే తనకు విజయాన్ని చేకూర్చి పెడుతుందని చెప్పారు. టెక్కలిలో స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటుకు మంత్రి హామీనిచ్చారు. దీనివల్ల జాతీయ స్థాయి క్రీడలకు క్రీడాకారులు వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. గృహ నిర్మాణ శాఖ పీడీ శ్రీనివాసరావు, ఇఇ రవికుమార్, రీజనల్ అధికారి ఎల్.దేవానందం, జిల్లా ఎస్‌పి డాక్టర్ త్రివిక్రమవర్మ, జిల్లా అడిషనల్ ఎస్‌పి టి.పనసారెడ్డి, డిఎస్‌పిలు బర్ల ప్రసాదరావు, భీమారావు, గోపాలరావు, సుబ్రమణ్యం, శ్రీనివాసరావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేళ

విద్యార్థుల ఆకలి కేకలు

- ప్రయివేటు సంస్థకు అప్పగించిన ఫలితం
- హోటల్ నుంచి భోజనం తెప్పించిన ఉపాధ్యాయులు



తూర్పుగోదావరి జిల్లా కాట్రేనికోన హైస్కూల్‌లో హోటల్ నుంచి తెప్పించి విద్యార్థులకు వడ్డిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - కాట్రేనికోన (తూర్పుగోదావరి)

నూతన సంవత్సరం రోజు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందక విద్యార్థులు ఆకలితో అలమటించిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా కాట్రేనికోన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం 2018 డిసెంబర్ నెలాఖరు వరకూ పాఠశాలల్లోనే ఉపాధ్యాయుల పర్యవేక్షణలో మధ్యాహ్న భోజన నిర్వహణ కార్మికుల ద్వారా భోజనాలు తయారుచేసి వడ్డించేవారు. మండలంలోని 83 పాఠశాలలకు గానూ, మొదటివిడతగా 30 పాఠశాలలకు మధ్యాహ్న భోజన నిర్వహణ బాధ్యతను జనవరి 1 నుంచి ఏక్తాశక్తి ఫౌండేషన్‌కు ప్రభుత్వం అప్పగించింది. మొదటిరోజు మంగళవారం 30 పాఠశాలలకు గానూ ఐదు పాఠశాలలకు భోజనమే సరఫరా కాలేదు. దీంతో, విద్యార్థులు ఆకలితో అలమటించి రోడ్డెక్కారు. మిగిలిన పాఠశాలల్లో భోజనం సరఫరా అయినప్పటికీ చాలీచాలని భోజనాన్ని సరఫరా చేయడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. మెనూ ప్రకారం గుడ్డు పెట్టాల్సి ఉన్నా, పెట్టలేదని, సాంబారుకు, కూరకు తేడాలేకుండా నాసిరకంగా వంటలు ఉన్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మండల కేంద్రమైన కాట్రేనికోన జిల్లా పరిషత్ హైస్కూల్‌కు మధ్యాహ్నం 2 గంటలు దాటినా భోజనాలు రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. ఉపాధ్యాయులు స్థానిక హోటల్ నుంచి భోజనాలు రప్పించి విద్యార్థులకు పెట్టారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ ప్రయివేట్ సంస్థలకు అప్పగించడం వల్లనే ఇలా జరిగిందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పాతవిధానాన్ని కొనసాగించి, విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు.

భోజనాలు సక్రమంగా రాకపోవడం వాస్తవమే

మండలంలోని 30 పాఠశాలలకు ఏక్తాశక్తి ఫౌండేషన్ ద్వారా సరఫరా కావాల్సిన భోజనాలు సక్రమంగా పాఠశాలలకు చేరకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. కొన్ని పాఠశాలలకు పూర్తిగా భోజనాలు వెళ్లలేదు. అటువంటి పాఠశాలలకు విద్యాశాఖ ఆధ్వర్యాన పులిహోర వంటి పదార్థాలు విద్యార్థులకు అందించాం. పూర్తిస్థాయిలో విద్యార్థులందరికీ భోజనాలు సరిపోలేదు. మెనూ ప్రకారం కోడిగుడ్డు, కూరలు, సాంబారు నాశిరకంగానే ఉన్నాయి. వీటిపై నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాను.

సిహెచ్‌వివి.సత్యప్రసాద్, ఎంఇఒ, కాట్రేనికోన

ప్రయివేటు సంస్థలను నిషేధించాలి

మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ బాధ్యతలను ప్రయివేట్ సంస్థలకు అప్పగించరాదు. సక్రమంగా, స్థానికంగా పాఠశాలలవద్దే మధ్యాహ్న భోజనం తయారయ్యే విధానాన్ని కొనసాగించాలి. ఏక్తాశక్తి ఫౌండేషన్‌ను మధ్యాహ్న భోజనం నిర్వహణ బాధ్యతల నుంచి పూర్తిగా తొలగించాలి. లేనిపక్షంలో జిల్లాస్థాయిలో ఉద్యమం చేపట్టుతామం. నాసిరకంగా కూరలు, భోజనాలు తయారుచేయడం మా దృష్టికి వచ్చింది. వీటిపై అధికారులు స్పందించకుంటే ఉద్యమం తప్పదు.

జి.దుర్గాప్రసాద్, సిఐటియు జిల్లా కార్యదర్శి

ప్లాట్ల కేటాయింపునకు అంగీకారం

అల్లాపురంలో నిరసన దీక్షల విరమణ

ప్రజాశక్తి - గన్నవరం (విజయవాడ)

కృష్ణా జిల్లా గన్నవరం మండలం అల్లాపురం విజయసాయి వెంచర్ రోడ్డులో ఏడు రోజులుగా ప్లాట్ల యజమానులు చేపట్టిన నిరసన దీక్షలు మంగళవారంతో ముగిశాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నూజివీడు సబ్ కలెక్టర్ బాధితులకు ప్రత్యామ్నాయ ప్లాట్లు నెల రోజుల్లో కేటాయించడానికి అంగీకరిస్తూ లిఖిత పూర్వకమైన హామీ పత్రాన్ని ఇచ్చారు. ఎమ్మెల్యే వంశీ, తహశీల్దార్ గోపాలకృష్ణ చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. బాధితులు పెట్టిన 13 డిమాండ్లలో 12 డిమాండ్లు పరిష్కరించడానికి కలెక్టర్ ఒప్పుకున్నారని తహశీల్దార్ గోపాలకృష్ణ చెప్పారు. సిఆర్‌డిఎ అధికారులతో మాట్లాడి వెంటనే 56 ఎకరాల్లో లేఅవుట్ల అప్రూవల్ చేయించి, లాటరీ ద్వారా బాధితులకు కేటాయిస్తామన్నారు. దీనికి బాధితులు అంగీకరించడంతో ఆందోళనను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు పోరాట కమిటీ అధ్యక్షులు వేదవతి ప్రకటించారు



రోడ్డుపై నిరసన తెలియజేస్తున్న కుటుంబ సభ్యులు

విద్యార్థి మృతదేహంతో ఆందోళన

ఆర్‌విఆర్ అండ్ జెసి కళాశాలపై చర్యలు తీసుకోవాలని రహదారిపై నిరసన

ప్రజాశక్తి - పిడుగురాళ్ల (గుంటూరు)

'లక్షలకు లక్షలు ఫీజులు వసూలు చేసిన కాలేజీ యాజమాన్యం విద్యార్థులు కాలేజీ సమయంలో బయటకు వెళ్తుంటే ఎందుకు ఆపలేదని ఆపి ఉంటే ఈ రోజు నా కొడుకు చనిపోయి ఉండేవాడుకదా' అంటూ లాలపూరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థి తండ్రి, అతని బంధువులు గుంటూరు జిల్లా పిడుగురాళ్ల పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద మంగళగవారం నిరసన తెలిపారు. సోమవారం గుంటూరు నగరం లాలాపురం వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పిడుగురాళ్లకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి షేక్ గఫూర్ మృతి చెందిన విషయం విదితమే. మంగళవారం కుటుంబ సభ్యులు గఫూర్ మృత దేహాన్ని పిడుగురాళ్ళ పోలీస్ స్టేషన్ ఎదుట ఆర్.వి.ఆర్ అండ్ జేసీ కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని నిరసన తెలిపారు. మృతుడు షేక్ గఫూర్ సామాజిక తరగతికి చెందిన వారు పెద్ద సంఖ్యలో పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. అనంతరం దాదాపు గంట సేపు మృతదేహంతో అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిపై ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మృతుని బంధువులు పలువురు మాట్లాడుతూ యాజమాన్యంపై నమ్మకంతో తమ బిడ్డలను ఇక్కడ వదిలి వెళ్తుంటే వారి నిర్లక్ష్యం కారణంగా ఈ రోజు ఆ కుటుంబంలో విషాదమలుముకుందని అన్నారు. ప్రభుత్వం వెంటనే కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మృతదేహాన్ని ఖననం చేశారు.

సమ్మెతో ఇబ్బంది కలిగిస్తే చర్యలు : ప్రద్యుమ్న

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్

డ్వామాలో పని చేస్తున్న ఎంపిఎం, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు సమ్మెకు పూనుకుని, నరేగా ఉపాధి హామీ పనులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ప్రద్యుమ్న హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం నుంచి 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమం ప్రారంభమవుతుందని, ఇలాంటి సమయంలో సమ్మెకు పూనుకోవడం సరికాదన్నారు. క్రమబద్ధీకరణ ప్రభుత్వ పరిధిలో ఉన్న విషయాలని, ఇతర సమస్యలపై ఆ సంఘం నేతలతో చర్చిస్తామన్నారు. ఎటువంటి పరిస్థితుల్లో నరేగా పనులకు ఇబ్బంది కలిగేలా ఉంటే కఠిన చర్యలు తప్పవని, ఈ మేరకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు అందినట్లు తెలిపారు. తనవంతుగా నరేగా సిబ్బందితో మాట్లాడతానని చెప్పారు.

సమ్మె జయప్రదానికి పాదయాత్రలు, ప్రదర్శనలు

- పలు జిల్లాల్లో పోస్టర్ల ఆవిష్కరణ



విశాఖలో ప్రదర్శన నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించే దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మంగళవారం పాదయాత్రలు, ప్రదర్శనలు, సమావేశాలు చేపట్టి పెద్దఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. పలుచోట్ల సమ్మె వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. విశాఖలో సింహాచలం కమిటీ బిల్డింగ్ వర్కర్స్ ఆధ్వర్యాన పాదయాత్ర చేపట్టారు. జివిఎంసి 72వ వార్డు ప్రాథమిక గ్రామీణ ఆరోగ్యకేంద్రం వద్ద పెంచిన పారితోషకాలు తగ్గించవద్దని ఆశ వర్కర్స్ ఆందోళన చేపట్టారు. సిఐటియు, ఏఐటియుసి ఆధ్వర్యాన కొమ్మాది కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. మద్దిలపాలెం సిఐటియు కార్యాలయంలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిచారు. కూర్మన్నపాలెంలో భవన నిర్మాణ కార్మికులతో సిఐటియు నాయకులు సమావేశం నిర్వహించారు. విశాఖ జిల్లా డుంబ్రిగుడ, సబ్బవరం, నాతవరంలో కేంద్రాల్లో సిఐటియు ఆధ్వర్యాన సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. పాడేరు మండలంలో వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు సిఐటియు ఆధ్వర్యాన సమ్మె సన్నాహక సమావేశం నిర్వహించి, అనంతరం ఎడిఎంహెచ్‌ఒ, మినుములూరు పిహెచ్‌సి వైద్యాధికారులకు సమ్మె నోటీసులను అందజేశారు. రాంబిల్లి మండలంలో భవన నిర్మాణ కార్మికుల, ట్రాక్టర్ల డ్రైవర్లలో సమావేశాలు నిర్వహించారు. ఆశా కార్యకర్తలు రాంబిల్లి పిహెచ్‌సి వైద్యాధికారికి, మునగపాకలో ఎంపిడిఒకు సమ్మె నోటీసులు అందించారు. కృష్ణా జిల్లాలో పలుచోట్ల సిఐటియు, దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ప్రచార కార్యక్రమాలు జరిగాయి. చల్లపల్లిలోని ఎటిఎం సెంటరులో జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశంలో సమ్మె వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కోడూరులోని లంకేశ్వరరావు అడితీ ఆవరణలో వాల్‌పోస్టర్లను రైతుసంఘం దివి డివిజన్ నాయకులు ఆవుల బసవయ్య ఆవిష్కరించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో సిపిఎం, సిఐటియు, డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఎపి ఆశావర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) పాల్గొంటున్నట్లు పశ్చిమగోదావరి జిల్లా పోలవరం మండలంలోని వింజరం, ఎల్‌ఎన్‌డి పేట పిహెచ్‌సి పరిధి ఆశా యూనియన్ నాయకులు వైద్యాధికారులకు సమ్మె నోటీసు అందజేశారు. సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.దక్షిణామూర్తి, జిల్లా కార్యదర్శి పివి ప్రతాప్ తణుకులో ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులంతా పాల్గొనాలని నిడమర్రు మండలంలోని పెదనింద్రకొలను, అడవికొలను, నిడమర్రు గ్రామాల్లో జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘ సమావేశాల్లో జిల్లా కార్యదర్శి రమణారావు పేర్కొన్నారు. చింతలపూడిలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్ నారాయణ పాల్గొన్నారు. ఐఎఫ్‌టియు ఆధ్వర్యాన తాడేపల్లిగూడెంలో ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి జయలక్ష్మి థియేటర్ వరకు కెఎన్ రోడ్డులో ప్రదర్శన నిర్వహించారు.

ప్రజ్ఞ

జవాబులు

1. స్మృతి మంధాన
2. సుధీర్ భార్గవ
3. బివిపి రావ్
4. వినోద్ కుమార్ యాదవ్
5. కన్నడ

రైతులకు పరిహారం చెల్లించాలని జనసేన రిలే దీక్షలు

ప్రజాశక్తి - అనకాపల్లి టౌన్ (విశాఖపట్నం)

విశాఖ జిల్లా అనకాపల్లి మండలం టి.వెంకుపాలెం గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 67, 68లో గల భూమి సాగు రైతులకు పరిహారం చెల్లించిన తర్వాత భూములు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జనసేన ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారమూ కొనసాగాయి.. ఈ సందర్భంగా జనసేన అనకాపల్లి నియోజకవర్గ నాయకులు కొణతాల సీతారామ్ మాట్లాడుతూ రైతులకు పరిహారం చెల్లించడం పట్ల స్థానిక ఎమ్మెల్యే కనీస శ్రద్ధ చూపకపోవడం దారుణమన్నారు. ఇన్ని రోజులుగా దీక్షలు చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకూ దీక్షలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.


గోల్‌మాల్

భూధార్‌తో రికార్డులు తారుమారు!


- రెవెన్యూ మాయలతో కొత్త చిక్కులు
- ఆందోళనలో చిన్న, సన్నకారు రైతులు

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

భూధార్‌తో రైతుల సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టినట్లు ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. రైతులకు కొత్త చిక్కులు వచ్చిపడుతున్నాయి. భూధార్ అనుసంధానంతో పూర్వం నుంచి ఉన్న రెవెన్యూ రికార్డుల్లో పేర్లు తారుమారవుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. రెవెన్యూ అధికారులు భూధార్‌ను అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విజయనగరం జిల్లా జామి మండల కేంద్రంలో భూ రికార్డులు తారుమారయ్యాయంటూ రైతులు జిల్లా కలెక్టర్ హరిజవహర్‌లాల్‌ను కలవడంతో భూధార్ భాగోతం బయటపడింది. భూధార్‌తో గ్రామాల్లోని జిరాయితీ, పోరంబోకు, చెరువు, వాగులు ఇలా అన్ని రకాల భూములనూ గుర్తించి, వాటికి ఆధార్ అనుసంధానం చేస్తారు. వివాదాల్లో ఉన్న భూములను మాత్రం గ్రామానికి ఒక ఉమ్మడి ఖాతాను తెరిచి అందులోకి డంప్ చేస్తారు. అనంతరం రైతుల వద్ద ఉన్న ఆధారాలను బట్టి పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేస్తామని అధికారులు చెప్తున్నారు. తమ తాతల కాలం నుంచి సాగు చేస్తోన్న భూములను ప్రభుత్వ భూములుగా నమోదు చేస్తుండడంతో సాగుదారుల్లో ఆందోళన మొదలైంది. జామి గ్రామానికి చెందిన కొత్తలి రాములు తన తాతదండ్రుల నుంచి సర్వే నంబర్ 315/1లో 73 సెంట్లు సాగు చేస్తున్నారు. రెవెన్యూ ఖాతా నెంబర్ 78974 పేరున ఏటా క్రమం తప్పకుండా శిస్తు చెల్లిస్తున్నారు. పాసుపుస్తకం ఇప్పించాలని ఏళ్ల తరబడి తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. భూధార్‌లో ఈ భూమిని ప్రభుత్వ భూమిగా నమోదు చేయడంతో రాములు తహశీల్దార్‌ను ఆశ్రయించాడు. ఆధారాలు లేకుంటే భూమి ప్రభుత్వానికి చెందుతుందని తహశీల్దార్ చెప్పడంతో జిల్లా కలెక్టర్ హరిజవహర్‌లాల్‌కు ఫిర్యాదు చేశాడు. మరో రైతు గనివాడ కృష్ణమూర్తి సాగుచేస్తున్న సర్వే నంబర్ 199/1, 2ల్లోని సుమారు రెండు ఎకరాల భూమి భూధార్‌తో ప్రభుత్వ భూమిగా మారిపోయింది. ఈ విధంగా జామి మండలంలో 900 ఎకరాల వరకూ భూ రికార్డులను మార్చేసినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. భూ యాజమాన్య చట్టంలోని సెక్షన్ 5 (5) ప్రకారం తహశీల్దార్ ఈ సమస్యను పరిష్కరించే అవకాశం ఉంది. ఇదే అనుదుగా కొందరు రెవెన్యూ అధికారులు అధిక మొత్తాలు గుంజుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా ఇప్పటికే 78 శాతం భూధార్ జరిగినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు.



విజయనగరం జిల్లా కొత్తలి రాములు భూమికి సంబంధించిన అడంగల్



భూధార్‌లో మార్పు తరువాత చూపిస్తున్న రికార్డు

నిబంధనలు ఇవీ..

ఆంధ్రప్రదేశ్ భూ యాజమాన్య హక్కుల చట్టం-1971 ప్రకారం భూ రికార్డుల జోలికి వెళ్లాలంటే రెవెన్యూ అధికారులు కొన్ని నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. గత నెలలో ప్రారంభమైన భూధార్ అనుసంధానం అడ్డగోలుగా జరుగుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. భూ రికార్డులు మార్చాలంటే ఎపి భూ యాజమాన్యం చట్టంలోని సెక్షన్-3 ప్రకారం భూమికి సంబంధించిన అనుభవదారుడికి, పట్టాదారుడికి ముందుగా నోటీసు ఇవ్వాలి. వారి అభ్యర్థనను పరిగణనలోకి తీసుకొని, వారి వద్ద ఉన్న రికార్డుల ఆధారంగా మార్పు చేయాలి. భూధార్ పేరుతో తమకు తెలియకుండానే రెవెన్యూ రికార్డులు మార్చేస్తున్నట్లు రైతులు ఆరోపణలున్నాయి.

సమస్యలుంటే తక్షణమే పరిష్కరిస్తాం

భూధార్ జిల్లాలో వేగంగా జరుగుతోంది. ఇప్పటికే కొన్ని సమస్యలు మా దృష్టికి వచ్చాయి. భూధార్ వల్ల ఎటువంటి సమస్యలు వస్తున్నాయన్న దానిపై సమీక్షించి, భూ సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటాం.

- జెవి మురళి, ఆర్‌డిఒ, విజయనగరం

అమరావతి సందర్శనకు ఆర్టీసీ ఉచిత బస్సులు

జనం తరలింపునకు అధికారుల పాట్లు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'అమరావతి సందర్శన ఉచితంగా కల్పిస్తున్నాం. టీ, టిఫిన్, భోజనం వంటి సదుపాయాలు ఫ్రీ. బస్సుఛార్జీలూ కట్టక్కర్లేదు. అన్నీ ప్రభుత్వమే భరిస్తుంది. మీరు రావడమే తడువు, తిరిగి ఇళ్లకు చేర్చే బాధ్యత కూడా ప్రభుత్వానిదే.' ఇటీవల అధికారులు, సిబ్బందినోట వినిపిస్తున్న మాటలు. రాష్ట్ర రాజధాని అమరావతిని సందర్శించేందుకు గ్రామాల్లోని రైతులు, విద్యార్థులు, జర్నలిస్టులను తీసుకెళ్లాలని ప్రభుత్వం గతేడాది డిసెంబర్‌లో నిర్ణయించింది. ఈ మేరకు 1117 నెంబరు జిఒను జారీ చేసింది. జనాన్ని తీసుకొచ్చే బాధ్యతను మండల స్థాయిలో తహశీల్దార్లు, ఎంపిడిఒలకు, నియోజకవర్గస్థాయిలో ప్రత్యేక అధికారులకు అప్పగించింది. బస్సులు నడపాలని ఆర్టీసి అధికారులకు అదేశాలు జారీ చేసింది. విజయనగరం జిల్లాలో డిసెంబర్ 28న కురుపాం మండలంలో ప్రారంభమైన ఈ కార్యక్రమం ఫిబ్రవరి 19 వరకూ కొనసాగనుంది. ఈ మేరకు ప్రభుత్వమే షెడ్యూల్ ఖరారు చేసింది. పర్యటనకు సంబంధించిన ఖర్చులను ఎపి సిఆర్‌డిఎ (రాజధాని ప్రాంత అభివృద్ధి మండలి) భరిస్తుందని ఈ మేరకు ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్ తన ఉత్తర్వులో పేర్కొన్నారు. బస్సు నిండా జనాన్ని పంపాల్సిందేనంటూ ప్రభుత్వం మౌఖిక ఆదేశాలు జారీ చేయడంతో అధికారులకు తలనొప్పిగా మారింది. ఈ నేపథ్యంలో గ్రామాల్లో నాయకుల ద్వారా జనాన్ని తరలించేందుకు అధికారులు శతవిధాలా ప్రయత్నించారు. డిసెంబర్ 27న కురుపాం, 28న జియ్యమ్మవలస, 30న పార్వతీపురం, 1న మక్కువ మండలాల నుంచి బస్సుల్లో సుమారు 120 మందిని తరలించారు. మరోవైపు ఎన్నికల నేపథ్యంలో ప్రజాసమస్యల నుంచి దృష్టిని మళ్లించేందుకు, తెలుగు తమ్ముళ్ల విహారానికే ప్రభుత్వం ఈ యాత్ర చేపడుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అమరావతి సందర్శనకు రాష్ట్రవ్యాప్తంగా అన్నిజిల్లాల నుంచి మండలానికో బస్సు వేయడంతో పాటు భోజనాలు, బస ఇతరాత్ర సదుపాయాల కల్పనకు సిఆర్‌డిఎ ద్వారా రూ.కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధపడడంతో చర్చనీయాంశంగా మారింది.

మహిళా చైతన్యం ... మహా కుడ్యం



కేరళలో 35 లక్షల మందితో మానవహారం
సమాన హక్కుల కోసం నినదించిన గళాలు
620 కి.మీ పొడవు .. ప్రపంచ రికార్డు

తిరువనంతపురం : కొత్త సంవత్సరం తొలిరోజున సమానహక్కుల కోసం కేరళ మహిళలు కదం తొక్కారు. వందలు వేలు కాదు 35 లక్షల మంది కదలివచ్చి మహిళా మహా కుడ్యాన్ని సృష్టించారు. లింగవివక్షతను, అణచివేతను ప్రశ్నించారు. అన్నిరంగాల్లో సమానహక్కులు సాధిస్తామని, అంతవరకు పోరాటాన్ని కొనసాగిస్తామని ప్రతిన చేశారు. రాష్ట్ర రాజధాని తిరువనంతపురం నుంచి ఉత్తరాన రాష్ట్ర చివరన ఉన్న కాసరగోడ్ వరకూ 620 కిలోమీటర్ల పొడవునా మంగళవారం సాయంత్రం ఈ మహాకుడ్యం ఏర్పాటైంది. 14 జిల్లాలోని జాతీయ రహదారులు మహిళల, వారికి మద్దతుగా కదలివచ్చిన అభ్యుదయ శక్తుల నినాదాలతో మారు(మోగింది. కేరళ మహిళలు సాధించిన ఈ విజయాన్ని యూనివర్శల్ రికార్డు ఫోరమ్ గుర్తించింది. '35 లక్షల మంది మహిళలు ఏర్పాటు చేసిన అతిపొడవైన మానవహారం'గా దీనిని నమోదుచేసింది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఈ మానవహారాన్ని ప్రారంభించారు. , సుమారు అర గంటపాటు సాగింది. కులమతాలకు, హోదాలకు అతీతంగా ఈ మహిళలు ఇందులో పాల్గొన్నారు. అలాగే మహిళా కుడ్యానికి సంఘీభావంగా దాని వెనక పురుషులు మానవహారం నిర్మించారు. ఇందులో ప్రముఖ పురుష రచయితలు, కళాకారులు పాల్గొన్నారు. ఈ మహిళా కుడ్యం ఏర్పాటుతో రహదారులన్నీ సందడిగా మారాయి. మహిళలు తమ నినాదాలతో మహిళా కుడ్యం నిర్మించిన ప్రాంతాలను హోరెత్తించారు. లింగ వివక్ష అంతం కావాలని పిలుపునిచ్చారు. సినీనటులు, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు కూడా ఇందులో పాల్గొన్నారు. తిరునంతపురంలో ఈ కార్యక్రమం సందర్భంగా స్వామి అగ్నివేష్ మహిళలకు మద్దతు తెలిపారు. ఈ హారం ముగింపు ప్రాంతం వెల్లయంబళమ్ వద్ద చివరి వ్యక్తిగా రాష్ట్ర ఆరోగ్య మంత్రి కెకె శైలజ నిలిచారు.

సిపిఎం కార్యకర్తలపై ఆర్ఎస్ఎస్ గూండాల దాడి

మహిళాకుడ్యం సందర్భంగా కాసరగోడ్ వద్ద సిపిఎం కార్యకర్తలపై ఆర్ఎస్ఎస్ గూండాలు దాడికి దిగారు. పోలీసులు స్పందించి ఆర్ఎస్ఎస్ గూండాలపై లాఠీచార్జీ చేసి ఘర్షణను నిరోధించారు.




చారిత్రక దినం : బృందాకరత్



లక్షలాది మందితో మహిళాకుడ్యాన్ని నిర్మించడం ఒక చారిత్రాత్మక దినమని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకరత్ పేర్కొన్నారు. మహిళాకుడ్యం సందర్భంగా ఏర్పాటు చేసిన ఒక బహిరంగ సభలో బృందాకరత్ ప్రసంగించారు.

ఇది రిఫరెండం కాదు : కె.బాలకృష్ణన్



శబరిమలపై సుప్రీంకోర్టు తీర్పుపై మహిళా కుడ్యం ఒక రిఫరెండం కాదని సిపిఎం కేరళ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణన్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వ నిధులను ఈ కార్యక్రమం కోసం ఉపయో గించలేదని అన్నారు. లింగ సమానత్వానికి మద్దతు ఇచ్చేవారందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు.

చీకటి యుగంలోకి వెళ్లకుండా.. : విజయన్



కేరళ మళ్లీ చీకటి యుగంలోకి వెళ్లకుండా ఈ హారంతో వెనక్కిలాగారని రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. లింగసమానత్వం, విలువల పునరుద్ధరణ కోసం ఇలాంటి కార్యక్రమాలు దోహద పడతాయని అన్నారు. తిరువనంతపురంలో ఈ కార్యక్రమాన్ని విజయన్ ప్రారంభించారు. కాగా, ఈ మహిళా కుడ్యం గురించి విజయన్ మాట్లాడుతూ డిసెంబరు ప్రారంభంలో వివిధ హిందూ సంస్థలతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమావేశంలోనే దీని గురించి నిర్ణయం తీసుకు న్నట్లు తెలిపారు. 'మహిళా సమస్యలను పరిష్కరించడాన్ని పార్టీ చేస్తున్న పోరాటంలో భాగంగా భావిస్తున్నాం. విలువలను రక్షించుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు అవసరం' అని తెలిపారు.



ప్రత్యక్ష ప్రసారాన్ని అడ్డుకునేందుకేనా?

తిరువనంతపురం : కేరళ మహిళాలోకం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మానవహార కార్యక్రమానికి విస్తృత ప్రచారం రాకుండా అడ్డుకునే కుట్ర జరిగిందా? ప్రధానమంత్రి నరేంద్రమోడీ 'ప్రత్యేక ఇంటర్వ్యూ' మానవహారం జరుగుతున్న సమయంలోనే ప్రసారం కావడం ఇదే సందేహాన్ని కలిగిస్తోంది. ఐదేళ్ళ కాలంలో ఎన్నడూ మీడియా ముందుకు రాని, పాత్రికేయుల ప్రశ్నలకు సమాధానం ఇవ్వని ప్రధాని ఇస్తున్న ఇంటర్వ్యూ కావడంతో దేశ వ్యాప్తంగా అన్ని ఛానళ్లు ప్రసారం చేశాయి. ఇది లైవ్ కార్యక్రమం కూడా కాదు. ముందుగా రికార్డు చేసిందే! లింగ వివక్ష, అణచివేత, మతోన్మాదాలకు వ్యతిరేకంగా, సమాన హక్కుల సాధన కోసం 630 కి.మీల మేర 'మహాకుడ్యం'లా నిలబడి కేరళ మహిళా లోకం ప్రపంచ రికార్డు సృష్టిస్తున్న సమయాన్నే ప్రధాని కార్యాలయం ఇంటర్వ్యూ ప్రసారానికి ఎంపిక చేసుకోవడం యాదృచ్ఛికం కాదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

నిజానికి ప్రతిష్టాత్మక 'మహిళాకుడ్యం' ప్రకటన వెలువడిన నాటినుండే కేరళలో ఈ తరహా ప్రయత్నాలను సంఘ్‌పరివార్, బిజెపిలు ఎన్నో చేశాయి. మానవహారం జరిగిన మంగళవారం నాడు కూడా కేరళలోని పలు ప్రాంతాల్లో సిపిఎం, వామపక్ష కార్యకర్తలపై దాడుల జరిగాయి. ఒక పథకం ప్రకారం చేసిన ఈ కుట్రలను కేరళ మహిళా లోకం వమ్ము చేసింది. అన్ని రంగాల్లో సమానత్వ సాధనకు తమ గళాన్ని ప్రపంచానికి వినిపించింది. మహిళల గొంతు నొక్కడానికి ప్రయత్నం చేసిన ప్రధాని మోడి, తన ఇంటర్వ్యూలో వారికి అండగా నిలిచిన వామపక్ష ప్రభుత్వంపై విషం చిమ్మడం గమనార్హం.

బ్రిట్టో మరణంపై ఏచూరి దిగ్భ్రాంతి

ఇండియాన్యూస్‌నెట్‌వర్క్, న్యూఢిల్లీ: విద్యార్థి దశ నుండి తనకు సన్నిహిత మిత్రుడిగావున్న భారత విద్యార్థి సమాఖ్య నేత సైమన్ బ్రిట్టో మరణవార్త తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కెఎస్‌యు(ఐ)కి చెందిన గూండాల కిరాతక దాడిలో ఆయన గాయపడ్డారన్న ఆందోళన నుండి తాను తేరుకోకముందే ఈ విషాద వార్త తనను కలచి వేసిందన్నారు. బ్రిట్టో మరణించినా ఆయన స్ఫూర్తి మాత్రం సజీవంగానే వుంటుందని ఏచూరి తన ప్రకటనలో పేర్కొన్నారు. గూండాల దాడిలో గాయపడి అశక్తుడైనప్పటికీ లక్ష్యసాధనలో బ్రిట్టో చూపిన ధైర్యం, కృతనిశ్చయం, అంకిత భావం వంటి లక్షణాలు ప్రస్తుత తరానికి ఆదర్శమని ఆయన నివాళు లర్పించారు. సైమన్ బ్రిట్టో మృతి ద్వారా స్ఫూర్తిదాయకుడైన ఒక నేతను కోల్పోయామన్నారు. బ్రిట్టో మృతి ఉద్యమపరంగా మాత్రమే కాక వ్యక్తిగతంగా తనకు తీరని లోటని ఏచూరి అన్నారు. బ్రిట్టో భార్య సీనా భాస్కర్, ఆయన కుమార్తెకు ఏచూరి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియచేశారు.

ఘనంగా బీమా కొరేగావ్ వార్షికోత్సవం

ముంబయి : 1818 పీష్వాలపై బ్రిటీష్ వారి గెలుపు వారికోత్సవ సంబరాలను బీమా కొరేగావ్‌లో జరుపుకుంటున్నారు. పూణెకు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామంలో ప్రజలు, ముఖ్యంగా దళితులు 'జయస్థంబ'ను సందర్శిస్తున్నారు. గత సంవత్సరం ఈ వేడుకల సందర్భంగా చోటుచేసుకున్న అల్లర్లలో ఒక వ్యక్తి చనిపోగా, పలువురికి గాయలయ్యాయి. ఈ ఘర్షణలు పునరావృతం కాకుండా పోలీసులు, జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. శాంతి యుతంగా, సజావుగా ఈ కార్యక్రమం ముగుస్తుందని పోలీసు అధికారులు భావిస్తున్నారు. ఇంటర్‌నెట్ సేవలను నిలిపివేశారు. హిందూత్వ నేత మిలింద్ ఏక్బోటే, కబీర్ కళా మచ్(కెకెఎం)లతో సంబంధం ఉన్న కార్యకర్తలను గ్రామంలోకి ప్రవేశించరాదని నిషేదాజ్ఞలు విధించారు.

సమగ్ర చర్చలు అవసరం
జాతీయ శిశు రక్షణ ముసాయిదాపై ఎన్‌పిఆర్‌డి

ఇండియా న్యూస్ నెట్‌వర్క్, న్యూఢిల్లీ : దేశం జనాభాలో 40 శాతం ఉన్న చిన్నారులు రక్షణ కోసం రూపొందిస్తున్న ముసాయిదాపై మరింత సమగ్ర చర్చలు అవసరమని ఎన్‌పిఆర్‌డితో సహా 33 సంస్థలు ప్రభుత్వాన్నికి విజ్ఞప్తి చేశాయి. కేంద్రం రూపొందించిన జాతీయ శిశురక్షణ విధానం ముసాయిదాపై 33 సంస్థలు తమ స్పందనలు తెలియచేశాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన ఈ సంస్థలు చిన్నారుల, వికలాంగుల హక్కుల కోసం పోరాటం చేస్తున్నాయి. జాతీయ శిశురక్షణ విధానం డ్రాఫ్ట్‌ను డిసెంబరు 14న కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ తమ వైబ్‌సైట్‌లో ఉంచింది.

ముందుగా ఈ ముసాయిదాను రూపొందించినందకు ప్రభుత్వాన్ని సంస్థలు స్వాగతించాయి. అయితే అంచనాలకు తగినట్లుగా ఈ డ్రాఫ్ట్ లేదని, మరిన్ని మార్గదర్శకాలు ఉండాలని సంస్థలు సూచించాయి. చిన్నారుల రక్షణ కోసం ప్రభుత్వ నిబద్ధత, బాధ్యత ఈ డ్రాఫ్ట్‌లో లోపించాయని సంస్థలు విమర్శించాయి. దేశ జనాభాలో 40 శాతం మంది కోసం రూపొందిస్తున్న విధానం కాబట్టి దీనిపై సమగ్ర చర్చలు అవసరమని పేర్కొన్నాయి. అలాగే ఈ ముసాయిదాను సమగ్రంగా పరిశీలించడానికి తగినంత సమయం లేదని, స్పందనలకు గడువు తేదీని పొడిగించాలని సంస్థలు కోరాయి. దీనిపై వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి), చిన్నారుల హక్కుల కేంద్రం, ఆస్థాతో పాటు 33 సంస్థలు సంతకం చేశాయి.

బులంద్‌షహర్ కేసులో మరో నేరస్తుడి అరెస్ట్

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్‌లో జరిగిన ఘర్షణల్లో పోలీసు అధికారిపై అతి కిరాతకంగా దాడిచేసిన మరో వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీస్ అధికారి సుభోద్‌ను కాల్చి చంపకముందే అతనిపై గొడ్డలితో దాడి చేసి, వేళ్లను కోసి, తలకు గాయం చేసినట్లు ఇటీవల వెల్లడైన సంగతి తెలిసిందే. ఈ దాడికి పాల్పడిన కాల్వా అనే వ్యక్తిని అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. ఈ దాడిలో పాల్గొన్న ప్రశాంత్ నట్‌ను పోలీసులు డిసెంబర్ 28న అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. గత నెల 3న బులంద్‌షహర్‌లోని ఒక గ్రామంలో ఆవుల కళేబ రాలతో నిరసనలకు దిగిన బృందాన్ని అదుపుచేయడానికి పోలీసులతో కలిసి సుభోద్ అక్కడికి వెళ్లారు. ఈ దాడుల్లో సుమారు 400 మంది పాల్గొనగా, సుభోద్‌పై రాళ్ళు, కర్రలతో దాడి చేశారు. అతని కారును వెంబడించి హత్య చేశారు.

కుంభమేళాతో అభివృద్ధి జరగదు
యోగిపై బిజెపి మాజీ నేత విమర్శలు

బచారిచ్/లక్నో : దేశంలో కుంభమేళాలు, దేవాలయాలు నిర్మించడం వల్ల అభివృద్ధి జరగదని, రాజ్యాంగాన్ని ఖచ్చితంగా అమలు చేయడం ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని ఉత్తరప్రదేశ్ బిజెపి మాజీ నేత సావిత్రీబాయి పూలే చెప్పారు. యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌పై ఆమె విమర్శలు ఎక్కుపెట్టారు. షెడ్యూల్డ్ కులాల ప్రజలు, గిరిజనులు వారి హక్కుల కోసం, ఉద్యోగాల కోసం పోరాడుతుండగా యుపి ప్రభుత్వం కుంభమేళాలు, దేవాలయాలకు కోట్లు ఖర్చు పెడుతుందని అన్నారు. అవి వెనుకబడిన తరగతులకు, మైనారిటీలకు జీవనోపాధి కల్పిస్తాయా అని ప్రశ్నించారు.

పరీక్షల తేదీలను మార్చండి
కేంద్ర మంత్రికి కార్మిక సంఘాల విజ్ఞప్తి

ఇండియా న్యూస్ నెట్‌వర్క్-న్యూఢిల్లీ : ఈ నెల 8,9 తేదీల్లో జాతీయ స్థాయిలో నిర్వహించనున్న సమ్మె నేపథ్యంలో మెడికల్, ఇంజనీరింగ్ పరీక్షల తేదీలను మార్చాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్‌కు వివిధ కార్మిక సంఘాలు విజ్ఞప్తి చేశాయి. 12 డిమాండ్లతో దేశవాప్త సమ్మెకు గత సెప్టెంబరు 28న జరిగిన సమావేశంలో పిలుపునిచ్చినట్లు ఐఎన్‌టియుసి, ఎఐటియుసి, హెచ్‌ఎంఎస్, సిఐటియు, ఎఐయుటియుసి, ఎఐసిసిటియు, యుటియుసి, టియుసిసి, ఎల్‌పిఎఫ్, ఎస్‌డబ్ల్యుఇఎ తదితర సంఘాలు పేర్కొంటూ, ఈ సమ్మెకు నోటీసు జారీ చేశామని, తగిన సన్నాహాలు జరుగుతున్నాయని మంత్రి దృష్టికి తెచ్చాయి.

అయితే, ఈ నెల తొలి, రెండో వారాల్లో వైద్య, ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశం కోసం జాతీయ స్థాయి పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిం దని సంఘాలు తెలిపాయి. జనవరి 8, 9 తేదీల్లోనూ పరీక్షలు ప్రకటించారని, . ఈ తేదీల్లో సమ్మె కారణంగా అభ్యర్థులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశ ఉందని, కనుక పరీక్షల తేదీలను రీషెడ్యూల్ చేయాలని డిమాండ్ చేశాయి.

గుజరాత్ ఎన్‌కౌంటర్ కేసుల్లో నిందితులకు పదోన్నతి

అహ్మదాబాద్ : ఇష్రాత్ జహాన్, సోహ్రాబుద్దీన్ షేక్ ఎన్‌కౌంటర్ కేసుల్లో కీలక నిందితులకు ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఇష్రాత్ జహాన్ కేసులో ప్రస్తుతం బెయిల్‌పై ఉన్న ఐపిఎస్ అధికారి జి.ఎల్. సింఘాల్, సొహ్రాబుద్దీన్ షేక్ ఎన్‌కౌంటర్ కేసులో నిందితుడైన అగర్వాల్‌కు గుజరాత్ ప్రభుత్వం మంగళవారం ఐజిపిలుగా పదోన్నతి కల్పించింది. ఐజిపిలుగా పదోన్నతులు పొందాల్సిన 2001వ సంవత్సరం బ్యాచ్‌కు చెందిన ఆరుగురు ఐపిఎస్ , డిఐజి ర్యాంక్ అధికారుల జాబితాలో సింఘాల్, అగర్వాల్ పేర్లు కూడా ఉన్నాయి. గుజరాత్‌లో 2004లో చోటుచేసుకున్న ఇష్రాత్ జహాన్ ఎన్‌కౌంటర్ కేసు నిందితులలో సింఘాల్ కీలక నిందితుడు. సింఘాల్‌ను 2013లో సిబిఐ అరెస్టు చేసింది. సింఘాల్‌పై గడువులోగా చార్జిషీట్ దాఖలు చేయడంలో సిబిఐ విఫలమైన నేపథ్యంలో ఆయనకు బెయిల్ లభించింది. సింఘాల్‌కు 2014లో డిఐజిగా పదోన్నతి కల్పిస్తూ గుజరాత్ ప్రభుత్వం తిరిగి విధుల్లోకి తీసుకుంది.

ఎన్ఆర్‌సిలో నమోదుకు 30 లక్షల మంది దరఖాస్తు



గౌహతి : జాతీయ పౌరసత్వ రిజిస్టర్ (ఎన్ఆర్‌సి) తొలి విడత నమోదు ప్రక్రియలో చోటు దక్కని దాదాపు 30 లక్షల మంది ప్రజలు మరోసారి నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ గడువు సోమవారంతో ముగిసింది. గతంలో ప్రచురించిన పౌరసత్వ రిజిస్టర్ ముసాయిదాపై సందేహాలు వ్యక్తం చేస్తూ దాదాపు 600 అభ్యంతరాలు దాఖలయ్యాయి. ముసాయిదా రిజిస్టర్‌లో నమోదు కోసం సెప్టెంబర్ 25న ప్రారంభమైన ప్రక్రియ డిసెంబర్ 15తో ముగిసిన విషయం తెలిసిందే. అయితే డిసెంబర్ 5 నుండి 9 వరకూ జరిగిన పంచాయితీ ఎన్నికల ప్రక్రియతో ఎన్ఆర్‌సి నమోదుకు విఘాతం కలిగినట్లు అసోం ప్రభుత్వం చేసిన వాదనను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు దీనిని డిసెంబర్ చివరి వరకూ పొడిగించింది. ఆరంభం నుండి ఈ ప్రక్రియను సుప్రీంకోర్టు పర్యవేక్షించిన విషయం తెలిసిందే. కాగా క్లెయిమ్‌లు, అభ్యంతరాల దాఖలు ప్రక్రియ గత పక్షం రోజుల నుండే ఊపందుకున్నదని ఎన్ఆర్‌సి అధికారులు చెబుతున్నారు. గత ఆదివారం వరకూ ఎన్ఆర్‌సి ముసాయిదాలో చోటు దక్కని దాదాపు 30 లక్షల మంది తిరిగి దరఖాస్తు చేసుకున్నారని, మరికొంత మంది సోమవారం నాడు దరఖాస్తు చేసుకోవటంతో ఈ ప్రక్రియ 75 శాతం మేర పూర్తయిందని ఒక అధికారి వివరించారు. ఎన్ఆర్‌సి నమోదుకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ప్రక్రియలోని ఒక నిబంధనను తొలగించిన తరువాత దరఖాస్తుల సంఖ్య పెరిగిందని గౌహతికి చెందిన ఎబి ఖండాకర్ అనే కార్యకర్త చెప్పారు. ఈ నిబంధన కారణంగా ఆగస్టు 31 తరువాత అందిన పత్రాలను స్వీకరించేందుకు అధికారులకు అవకాశం లేకుండా పోయిందని ఆయన వివరించారు. ఇప్పుడు ఈ నిబంధనను తొలగించటంతో అనేక మందికి సాంత్వన చేకూరిందని, ఎన్ఆర్‌సిలో నమోదు కోసం దరఖాస్తు చేసుకునేందుకు అడ్డంకి తొలగిపోయిందని ఆయన చెప్పారు. ఈ నిబంధనను తొలగించటంతో ఎన్ఆర్‌సి ముసాయిదా పూర్తయ్యే సమయానికి అందిన దరఖాస్తుల్లో ప్రస్తావించిన పూర్వ చరిత్రను దరఖాస్తు దారులు మార్చాల్సిన అవసరం లేదన్నారు. అయితే నిరక్షరాస్యులు, ఎన్ఆర్‌సి సేవాకేంద్రాలు, సైబర్ ఆపరేటర్లపై ఆధారపడిన వారిలో ఒక వ్యక్తి పూర్వ చరిత్రను ఇతరులకు కూడా అన్వయించే ప్రయత్నం చేసిన ఘటనలు వెలుగు చూశాయి. ఇందులో కొన్ని కేసులు మోసపూరితమైనవి కాగా మరికొన్ని కేసుల్లో పూర్వచరిత్ర కలిగిన వ్యక్తి సంబంధీకులే దానిని ఉపయోగించుకున్నట్లు తేలింది. క్లయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించిన తరువాత ఈ ప్రక్రియ ప్రోసెసింగ్‌ను 2019 జూన్ చివరి నాటికి ముగించాల్సి వుంది. ముసాయిదాలో ప్రచురించిన పేర్ల దిద్దుబాటు కోసం సేవా కేంద్రాలు ఈ నెల 2 నుండి 31 వరకూ తెరచి వుంటాయని అధికారులు చెప్పారు.

ప్రత్యేకం

మేఘాలయ గని కార్మికుల రక్షణలో సాంకేతిక సమస్య

స్తంభించిన రెస్క్యూ ఆపరేషన్



షిల్లాంగ్ : మేఘాలయలోని అక్రమ బొగ్గు గనిలో వెల్లువెత్తిన నీటి వరదలో చిక్కుకున్న గని కార్మికుల రక్షణకు చేపట్టిన రిస్క్యూ ఆపరేషన్ మంగళవారం నీటిపంపుల్లో తలెత్తిన సాంకేతిక సమస్యతో నిలిచిపోయిందని అధికారులు చెప్పారు. దాదాపు 370 అడుగుల లోతున్న ఈ అక్రమ గనిలో మొత్తం 15 మంది కార్మికులు గత మూడు వారాలుగా చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. భూగర్భ గనిలో ఒక గోడకు చిల్లు పడటంతో సమీపంలోని నది నుండి గనిలోని నీటి ప్రవాహం వెల్లువెత్తుతోంది. ఈ కార్మికులను రక్షించేందుకు గత 20 రోజులుగా నౌకాదళ సిబ్బంది, ఎన్‌డిఆర్ఎఫ్ సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌ను కొద్ది విరామానంతరం మంగళవారం నాడు ప్రారంభించినట్లు ఆపరేషన్స్ ప్రతినిధి ఆర్ సుసంగి చెప్పారు. కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురవు తుండటంతో ఈ ప్రక్రియకు విఘాతం కలుగుతోందన్నారు. గనిలోని నీటిని తోడివేసేందుకు పంపులను సిద్ధం చేసే ప్రక్రియ కొనసాగుతోందని ఆయన చెప్పారు. ఒడిషా రాష్ట్ర అగ్నిమాపక శాఖ సిబ్బంది సమీపంలో మరో రెండు షాఫ్ట్‌లతో నీటిని తోడేందుకు ఏర్పాట్లుచేస్తున్నారని ఆయన వివరించారు. గనిలోని నీటి మట్టం కొంతమేర తగ్గినప్పటికీ నీటిని తోడేందుకు తాము దింపిన ప్రధానషాఫ్ట్ పొడవు సరిపోలేదన్నారు.

కుప్పకూలి పోతున్నా ఆగని అక్రమ 'ఘను'లు

మేఘాలయలోని తూర్పు జయంతియా పర్వత ప్రాంతాలలో అక్రమ గనుల వ్యాపారం జోరుగా సాగుతోంది. మూడు వారాల క్రితం ఒక అక్రమ గనిలో నీటి ప్రవాహంలో చిక్కుకున్న 15 మంది కార్మికులను రక్షించే ప్రక్రియకు ఆటంకాలు ఎదురై వారిరక్షణ ప్రశ్నార్థకంగా మారుతున్న నేపథ్యంలో ఇక్కడ కొనసాగుతున్న అక్రమ మైనింగ్ స్థానికులను తీవ్రంగా కలవర పరుస్తోంది. అక్రమ గనుల యాజమాన్యాలు ఇచ్చే కొద్దిపాటి కూలి కోసం ఇక్కడి పర్వత సానువుల కింద వున్న బొగ్గు నిక్షేపాలను చేరుకోవటానికి ఈ ప్రాంత గ్రామాలకు చెందిన వేలాది మంది ప్రజలు ఎలుక కలుగుల తరహాలో అక్రమ గనులు తవ్వుతున్నారు, అయితే తాము ఈ బొగ్గు మైనింగ్ మీదే బతుకుతున్నామని, తమకు చేతనైన పని ఇదొక్కటేనని మధ్యవయస్కుడైన ఒక కార్మికుడు తనను పలకరించిన మీడియా ప్రతినిధులకు చెప్పాడు. తమకు ఇదొక్కటే జీవనాధారం కావటంతో తాము పర్యావరణ చట్టాలను, మృత్యుభయాన్ని పట్టించుకోబోమని తేల్చిచెప్పాడు. ఇటువంటి సంఘటనలు గతంలో కూడా కొన్ని జరిగాయని, గని కార్మికులు సజీవసమాధి అయ్యారని వెల్లడించాడు. తూర్పు జయంతియా పర్వత ప్రాంతాలలో మైనింగ్ మాఫియాదే రాజ్యమని ఆ కార్మికుడు వివరించాడు. కాగా మేఘాలయలో బొగ్గు తవ్వకాలను జాతీయ హరిత ట్రిబ్యునల్ 2014లోనే నిషేధించినప్పటికీ, తాజాగా జరిగిన ఈ ఘటన ఇక్కడి అక్రమ మైనింగ్‌పై ప్రభుత్వ తనిఖీలను ప్రశ్నార్థకం చేస్తోంది. బొగ్గు తవ్వకాలను నిషేధించిన ఎన్‌జిటి ఆదేశాలలో వున్న లొసుగులను తమకు అనుకూలంగా మార్చుకుంటూ మైనింగ్ మాఫియా అక్రమార్జనకు పాల్పడుతోందని పర్యావరణ పరిరక్షణణ ఉద్యమ కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. మేఘాలయలో, ఎక్కువగా తూర్పు జయంతియా పర్వత ప్రాంతాలలో దాదాపు 5,000కుపైగా అక్రమ గనులున్నాయని అధికారిక అంచనాలు చెబుతున్నాయి. 2014లో ఎన్‌జిటి బొగ్గు మైనింగ్‌ను నిషేధించిన తరువాత ఇక్కడి కార్యకలాపాలు 70 శాతం మేర తగ్గుముఖం పట్టాయి. ఎన్‌జిటి నిషేధం వున్నప్పటికీ అక్రమ మైనింగ్‌ను అరికట్టడంలో తాము విఫలమైనట్లు మేఘాలయ ప్రభుత్వం అంగీకరించటం విశేషం.

నీటి ప్రవాహాన్ని తప్పించుకున్న మృత్యుంజయుడు

అక్రమ గనిలోని నీటి ప్రవాహంలో మూడు వారాల క్రితం చిక్కుకుపోయిన గని కార్మికుల్లో ఒకడైన సాహెబ్ ఆలీ గనిలోకి వస్తున్న నీటి ప్రవాహం నుండి తప్పించుకున్నాడు. ఆలీతో పాటు అతడి మిత్రులైన మరో ఇద్దరు కార్మికులు కూడా నీటి ప్రవాహం బారి నుండి తప్పించుకుని మృత్యుంజయులుగా బయటపడ్డారు. దాదాపు రెండు వారాల పాటు గనిలో చిక్కుకుపోయిన వీరిపై వారి కుటుంబ సభ్యులు ఆశలు వదిలేసుకున్న తరుణంలో వీరు ప్రాణాలతో బయటపడటం వారికి సంభ్రమాశ్చర్యాలు కలిగించింది. తాను ప్రాణాలతో బయటపడటం అల్లాదయేనని అన్నాడు. గత నెల 13న జరిగిన ఈ ఘటనను అతడు గుర్తు చేసుకుంటూ తాము మొత్తం 20 మంది కార్మికుల బృందం 115 మీటర్ల లోతులో వున్న గనిలోకి వెళ్లామని చెప్పాడు. గనిలో బొగ్గును తవ్వి వ్యాగన్‌లో పైకి తీసుకు వస్తున్న సమయంలో తనకు చల్లటి గాలి తగలటంతో పాటు నీటి హోరు వినిపించిందన్నాడు. కొద్ది సెకండ్లలోనే తమ ముందు నీటి ప్రవాహాన్ని గమనించి తాము కేకలు పెట్టామని చెప్పాడు. తాను మరో నలుగురు అక్కడి విద్యుత్ కేబుల్స్ పట్టుకుని షాఫ్ట్ రూఫ్‌పైకి చేరుకోగలిగామన్నారు. క్షణక్షణానికి పెరుగుతున్న నీటిమట్టంలో మునిగిపోకుండా వుండేందుకు తాను తీవ్రంగా ప్రయత్నించానని చెప్పాడు. నీటి ప్రవాహం తమ షాఫ్ట్‌ను 100 అడుగుల ఎత్తుకు తీసుకెళ్లిందని, అదృష్టవశాత్తు అక్కడ ఒక లిఫ్ట్ కనిపించిందని వివరించాడు. అందులో వున్న ఒకే ఒక వ్యక్తి తమను ఒకరితరువాత ఒకరిగా అందులోకి లాగేశాడని, తాము భూమిపైకి చేరుకోగలిగామని చెప్పాడు. తన అదృష్టాన్ని ఇప్పటికీ నమ్మలేకపోతున్నానని, అయితే తన మిత్రులు సాహెర్ ఇస్లామ్, మొనిరుల్ ఇస్లామ్, అమీర్ హుస్సేన్‌ల పరిస్థితిని ఊహించలేకపోతున్నానన్నాడు.



గ్రహశకలాల కక్ష్యలోకి చేరిన 'ఓసిరిస్-రెక్స్'

తంపా (అమెరికా): రోదసీ పరిశోధనల కోసం నాసా ప్రయోగించిన 'ఓసిరిస్-రెక్స్' అనే అంతరిక్ష నౌక సోమవారం బెన్ను అనే ఒక గ్రహశకల కక్ష్యలోకి ప్రవేశించటం ద్వారా మరో మైలు రాయిని అధిగమించింది. అతి చిన్న గ్రహశకలం చుట్టూ పరిభ్రమిస్తున్న తొలి మానవ నిర్మిత రోదసీ నౌకగా అది రికార్డులకెక్కింది. ఈ గ్రహశకలం చుట్టూ పరిభ్రమిస్తూ దానికి సంబంధించిన ధూళి నమూనాలతో ఓసిరిస్-రెక్స్ భూమికి తిరిగి వస్తుంది. రెండేళ్ల క్రితం రోదసిలోకి ప్రయోగించిన ఈ నౌక గత నెల 3న 11 కోట్ల కి.మీ దూరంలో వున్న గమ్య స్థానాన్ని చేరుకుంది. ఈ గ్రహశకలాన్ని కొన్ని వారాల పాటు నిశితంగా పరిశీలించిన తరువాత సోమవారం ఈ రోదసీ నౌక బెన్ను కక్ష్యలో ప్రవేశించేందుకు తన థస్సర్స్‌ను పేల్చింది.రోదసీనౌక బెన్ను కక్ష్యలోకి ప్రవేశించటం అద్భుత విజయమని ఓరిసిస్-రెక్స్ ప్రాజెక్టు ప్రధానాధికారి డాంటె లారెట్టా చెప్పారు.

టోక్యోలో నూతన సంవత్సర వేడుకలపై దాడి

9మందికి గాయాలు



టోక్యో: జపాన్‌లో నూతన సంవత్సర ప్రారంభ వేడుకల్లో విషాదం చోటుచేసుకుంది. సోమవారం రాత్రి టోక్యోలో వేడులకు జరపుకుతుంటున్న వారిపైకి కౌజిరలో కుసాకబె అనే 21 ఏళ్ల యువకుడు వేగంగా కారు పోనివ్వడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనలో తొమ్మిది మంది గాయపడ్డారు. ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా మారింది. మొదట్లో దీనిని ఉగ్రవాద చర్యగా భావించి, నగరంలో ప్రవేశించే దారులన్నిటినీ మూసివేశారు. ఓ మత ఛాందస వాదికి ఉరి శిక్ష విధించడానికి నిరసనగా ఆ మతఛాందసవాద సంస్థకు చెందిన సభ్యులు ఈ ప్రతీకారానికి పాల్పడినట్లు పోలీసులు తరువాత నిర్ధారించారు. 1995లో టోక్యో సబ్‌వేలో శరీన్ విషయవాయు ప్రయోగం కేసులో దోషిగా తేలిన మరో వ్యక్తికి కోర్టు మరణశిక్ష విధించింది. ఈ కేసులో కొందరికి గత ఏడాది ఉరి శిక్ష విధించారు. దీనికి ప్రతిగా ఈ కారు దాడికి దిగిన కుసాకబే పై హత్యాయత్నం నేరం కింద కేసు నమోదు చేశారు.

దోషిగా తేలినా రాజీనామా చేయను..!


నెతన్యాహు స్పష్టీకరణ

జెరూసలేం: ప్రస్తుతం తనపై కొనసాగుతున్న అవినీతి కేసుల విచారణలో దోషిగా తేలినా తాను పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు చెప్పారు. తనపై నేరాభియోగాలు నమోదు చేయాలని అటార్నీ జనరల్ కార్యాలయం సిఫార్సు చేస్తుందన్న అంశం నెతన్యాహును కలవర పెడుతోందని, అందువల్లే ఆయన రాజీనామాకు వెనుకంజ వేస్తున్నారని పరిశీలకులు చెబుతున్నారు. చట్ట నిబంధనల ప్రకారం విచారణ ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో ప్రధాని తన పదవికి రాజీనామా చేయాల్సిన అవసరం లేదని ఆయన గుర్తు చేశారు.

డిజిటల్ దిగ్గజాలపై ఫ్రాన్స్ పన్ను

పారిస్: ఇంటర్నెట్ ఆధారిత డిజిటల్ కార్యకలాపాలు నిర్వహించే టెక్నాలజీ సంస్థలపై భారీ పన్నును ఫ్రాన్స్ విధించింది. డిజిటల్ సంస్థలపై పన్ను విధింపు ప్రతిపాదన ఐరోపా కూటమి (ఇయు) పరిశీలనలో వుండగానే ఫ్రాన్స్ ఈ పన్నును అమలులోకి తెచ్చేందుకు పూనుకోవడం గమనార్హం. గాఫా టాక్స్ పేరుతో గూగుల్, యాపిల్, ఫేస్‌బుక్, అమెజాన్ తదితర ఇంటర్నెట్ దిగ్గజ సంస్థలపై విధించిన ఈ పన్ను మంగళవారం నుంచే అమలులోకి తెచ్చింది. ఈ పన్ను ద్వారా దాదాపు 50 కోట్ల యూరోల ఆదాయాన్ని ఆశిస్తున్నట్లు ఫ్రాన్స్ ఆర్థిక ఆర్థిక మంత్రి బ్రూనో లీ మెయిర్ చెప్పారు. ఐరోపా కూటమి దేశాలలో టెక్నాలజీ సంస్థలపై పారదర్శక పన్ను విధానాన్ని అమలు చేయాలని ఫ్రాన్స్ గత కొంతకాలం నుండి ఇయుపై వత్తిడి తెస్తోంది. అయితే ఈ అంశంపై కూటమి సభ్యదేశాలలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావటంతో ఈ ప్రక్రియపై ప్రతిష్టంభన ఏర్పడింది.

క్యూబా విప్లవానికి అరవై ఏళ్లు



క్యూబాకు అమెరికా, చైనా కమ్యూనిస్టు పార్టీల అభినందనలు

క్యూబా విప్లవ 60 వార్షికోత్సవాల సందర్భంగా చైనా, అమెరికా కమ్యూనిస్టు పార్టీలు తమ అభినందనలు తెలిపాయి. చైనా కమ్యూనిస్టు పార్టీ తరపున ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, ఆ దేశ అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ అభినందనలు తెలిపారు. ఈ మేరకు క్యూబా కమ్యూనిస్టు పార్టీ ప్రథమ కార్యదర్శి, మాజీ అధ్యక్షుడు రావుల్ కాస్ట్రోకి, అధ్యక్షుడు మిగుయెల్ డియాజ్ కానెల్‌కు ఒక సందేశాన్ని పంపారు. క్యూబా ఈ అరవై ఏళ్లలో అనేక సవాళ్లను దీటుగా ఎదుర్కోవడం, కఠోర శ్రమతో ఎన్నో గొప్ప విజయాలు సాధించిందని ప్రశంసించారు. క్యూబా, చైనా మధ్య మైత్రీ బంధం ముమ్ముందు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

అమెరికా కమ్యూనిస్టు పార్టీ రావుల్ కాస్ట్రోకు ఒక సందేశాన్ని పంపిస్తూ క్యూబా విప్లవాన్ని మీతోబాటు ప్రపంచ వ్యాపితంగా పోరాటాలు సాగిస్తున్న ప్రజలతోబాటు మా దేశ ప్రజలు (అమెరికన్లు) కూడా జరుపుకుంటున్నారని తెలిపారు. క్యూబాలో సోషలిస్టు విప్లవం విజయం సాధించడంతో అమెరికన్ సామ్రాజ్యవాదుల గుండెల్లో గుబులు రేగింది. తమ ఆర్థిక, రాజకీయ, సైనిక ప్రయోజనాలకు, అలాగే గ్వాంటెనామో స్థావరానికి క్యూబానుంచి ముప్పు వస్తోందని అది భయపడింది. అందుకే క్యూబాను ఎలాగైనా ఒంటరిపాటు చేసేందుకు అన్ని రకాల కుట్రలు కుతంత్రాలకు పాల్పడింది. క్యూబా ఆర్థిక వ్యవస్థను నాశనం చేయాలని చూసింది. క్యూబాలో విప్లవ ప్రభుత్వాన్ని కూలదోయాలని అమెరికా చేసిన యత్నాలను క్యూబన్లు సమర్థవంతంగా తిప్పికొట్టారని తన సందేశంలో అమెరికన్ కమ్యూనిస్టు పార్టీ పేర్కొంది. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడడంలోను, సోషలిజాన్ని నిర్మించడంలోను క్యూబా చూపిన తెగువ ప్రపంచ వ్యాపితంగా కోట్లాది మందికి స్ఫూర్తినిస్తోందని అది తెలిపింది.

షట్‌డౌన్ పరిష్కారానికి డెమొక్రాట్లు ఓకె

ట్రంప్ మెక్సికో గోడ ప్రతిపాదనకు నో

వాషింగ్టన్ : ట్రంప్ డిమాండ్ చేస్తున్న మెక్సికో గోడకు 500 కోట్ల డాలర్ల విడుదలకు ససేమిరా అన్న డెమొక్రాట్లు గత పది రోజులుగా కొనసాగుతున్న షట్‌డౌన్‌కు తెర దించేందుకు కొత్త ప్రతిపాదనలను ముందుకు తెచ్చారు. అమెరికన్ కాంగ్రెస్‌కు ఎన్నికైన నూతన సభ్యులు గురువారం ప్రమాణ స్వీకారం చేయనుండడంతో అమెరికన్ ప్రతినిధుల సభలో డెమొక్రాట్లు, సెనేట్‌లో రిపబ్లికన్ల పట్టు సాధిస్తారు. ట్రంప్ మెక్సికో గోడ బిల్లుకు ప్రతినిధుల సభ ఆమోదం తెలిపినా, సెనేట్ దీనిని ఆమోదించేందుకు సిద్ధంగా లేకపోవడంతో షట్‌డౌన్‌కు పరిస్థితి దారి తీసింది. సెనేట్‌లో గురువారం సమీకరణలు మారాక రిపబ్లికన్లకు మెజారిటీ లభిస్తుంది కాబట్టి ఇదే ప్లాన్‌ను వారు ఆమోదిస్తారా? తిరస్కరిస్తారా? అన్నది వేచి చూడాలి. ట్రంప్ ప్రతిపాదనను రిపబ్లికన్లలో కొందరు వ్యతిరేకిస్తున్నారు. కొత్త సంవత్సరం ప్రవేశించాక కూడా షట్‌డౌన్ కొనసాగుతుండడంతో లక్షలాది మంది ఫెడరల్ ఉద్యోగులు జీతాలందక నానా అవస్థలు పడుతున్నారు. షట్‌డౌన్‌కు స్వస్తి చెప్పాలన్న వారి రోదన అరణ్య రోదనే అవుతుంది.

'మాట నిలుపుకోకపోతే...! మా దారి మాది...!!

అమెరికాకు కిమ్ హెచ్చరిక



సియోల్: ప్రపంచదేశాల ముందు అమెరికా మాకు ఇచ్చిన మాటను నిలుపుకోపోతే... మా దేశ ప్రయోజనాల పరిరక్షణకు మా దారి మేం చూసుకుంటాం' అంటూ ఉ.కొరియా అధినేత కిమ్‌జోంగ్ ఉన్ అమెరికాను హెచ్చరించారు. నూతన సంవత్సర సందర్భంగా మంగళవారం ఆయన ఇచ్చిన సందేశంలో 'అమెరికా ఇంకా మాపై ఆంక్షలతో వత్తిడి పెంచాలని చూస్తే.. మా దారి మేం చూసుకుంటాం' అని స్పష్టం చేశారు. అంతర్జాతీయ సమాజం స్వాగతించే సత్ఫలితాలను రాబట్టటం కోసం తాను ట్రంప్‌తో ఎక్కడైనా, ఎప్పుడైనా భేటీ కావటానికి సిద్ధంగా వున్నానని ఆయన చెప్పారు. తమ దేశంపై అమలు చేస్తున్న ఆంక్షల నుండి సత్వర విముక్తి కల్పించాలని డిమాండ్ చేస్తున్న ఉ.కొరియా, అణు రహిత కొరియా ద్వీపకల్పంపై అమెరికా వైఖరి గ్యాంగ్‌స్టర్‌లను తలపిస్తోందని వ్యాఖ్యానించింది. అమెరికా మాత్రం కొరియాలో స్పష్టమైన పూర్తి స్థాయి అణు నిరాయుధీకరణ పూర్తయ్యే వరకూ తాము ఆంక్షల వత్తిడి కొనసాగిస్తామని చెబుతోంది. ఈ నేపథ్యంలో ట్రంప్‌తో గత ఏడాది తన భేటీతో ప్రారంభమైన శాంతి చర్చల ప్రక్రియలో పురోగతి లేకపోవటం పట్ల కిమ్ తన ప్రసంగంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

మొదటి పేజీ తరువాయి

ఆ తర్వాతే అయోధ్య

లేదన్నారు. మోడీ లక్ష్యంగానే పార్టీలన్నీ ఏకమయ్యాయని, స్వార్థ ప్రయోజనాల కోసమే నాయకులు ఏకమవుతున్నారని ఆరోపించారు. తెలంగాణలో మహాకూటమి ఓటమి పాలైందని, త్రిపుర, కాశ్మీర్‌లో కూడా ఓటమి పాలైందని అన్నారు. గత ప్రభుత్వాలే కొనసాగి ఉంటే దేశంలో అవినీతి పెరిగిపోయేదని అన్నారు. కెసిఆర్ ఫ్రంట్ గురించి తనకు తెలియదని అన్నారు. చంద్రబాబు ద్వేషంతో రాజకీయం చేయాలనుకున్నారని, అందుకే తెలంగాణ ఎన్నికలలో ఓటమి పాలయ్యారని అన్నారు. భవిష్యత్‌లో ఎన్‌డిఎతో ఏ పార్టీలు కలిసి ఉంటాయో ఇప్పుడే చెప్పలేమని అన్నారు.

జస్టిస్ ప్రవీణ్‌కుమార్ అనే నేను..

న్యాయమూర్తులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకట రమణ, రిజిస్ట్రార్ జనరల్ సిహెచ్ మనవేంద్రనాథ్ రాయ్, మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర, నక్కా ఆనంద్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్రపునేట, డిజిపి ఆర్పీ ఠాకూర్, ఇతర అధికారులు, న్యాయవాదులు, పలువురు ప్రజాప్రతినిధులు, ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఇదీ జస్టిస్ చాగరి ప్రవీణ్ కుమార్ నేపథ్యం...

1961, ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో ప్రవీణ్‌కుమార్ జన్మించారు. ఆయన తండ్రి ప్రముఖ న్యాయవాది సి పద్మనాభ రెడ్డి మానవతా వాది. ప్రవీణ్ కుమార్ విద్యాభ్యాసం అంతా హైదరాబాద్‌లోనే సాగింది. ప్రాథమిక విద్య నుంచి పదవ తరగతి వరకు లిటిల్ ఫ్లవర్ హైస్కూల్లో చదువుకున్నారు. లిటిల్ ఫ్లవర్ జూనియర్ కళాశాలలోనే ఇంటర్మీడియేట్ చదివారు. నిజామ్ కళాశాలలో బిఎస్సీ పూర్తి చేసిన ఆయన ఉస్మానియా యూనివర్సిటీ నుంచి న్యాయ శాస్త్రంలో పట్టా పొందారు. 1986 నుంచి న్యాయవాదిగా తన ప్రస్థానాన్ని కొనసాగించారు. తండ్రి పద్మనాభ రెడ్డి వద్దే న్యాయవాద వృత్తిలో ఓనమాలు నేర్చుకున్నారు. అనతి కాలంలోనే న్యాయవాద వృత్తిలో పట్టు సంపాదించుకున్నారు. 2012 డిసెంబర్ 4న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హై కోర్టు అదనపు న్యాయమూర్తిగాను, 2013 డిసెంబర్ 4న శాశ్వత న్యాయమూర్తిగానూ నియమితులయ్యారు.

రాయలసీమలో హైకోర్టు : జెఎసి డిమాండ్

నుంచి డిమాండ్ చేస్తున్నా... పాలక ప్రభుత్వాలు స్వార్థ రాజకీయాల కోసం పాకులాడుతూ ప్రజల ప్రయోజనాలను నిర్వీర్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వైఖరిని మార్చుకోవాలని, రాయలసీమలోనే హైకోర్టు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. కడపలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వి రాజగోపాల్‌రెడ్డి, అనంతపురంలో ప్రజా సంఘాల నాయకులు సీమకృష్ణ, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

అణు కేంద్రాల జాబితాను ఇచ్చిపుచ్చుకున్న భారత్ పాక్

ఇస్లామాబాద్ : పాకిస్తాన్ మంగళవారం తన అణు స్థావరాల జాబితాను భారత్‌తో పంచుకుంది. భారత్- పాక్‌ల అణుస్థావరాలపై పరస్పర దాడులను నిషేధిస్తూ రెండు దేశాలు కుదుర్చుకున్న ఒప్పందంలోని ఆర్టికల్-2 ప్రకారం పాక్ తన అణు స్థావరాల జాబితాను భారత్‌కు ఇచ్చినట్లు విదేశాంగ శాఖ కార్యాలయం మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. దీనికి సంబంధించిన ఒప్పందంపై డిసెంబరు 31, 1988న సంతకాలు జరిగినప్పటికీ జనవరి 27, 1991 నుండి అమలులోకి వచ్చింది. స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో భారత హైకమిషన్ ప్రతినిధికి పాక్ అధికారికంగా ఆ జాబితాను అందచేసిందని ఆ ప్రకటన పేర్కొంది. అదే విధంగా ఉదయం 10.30 గంటల సమయంలో ఢిల్లీలోని పాక్ హై కమిషన్ ప్రతినిధికి భారత్ తన అణు స్థావరాల జాబితాను అందించినట్లు విదేశాంగ శాఖ తన ప్రకటనలో వెల్లడించింది. ఈ ఒప్పందం మేరకు ప్రతి ఏడాది జనవరి 1న రెండు దేశాలు తమ అణుస్థావరాల జాబితాను పరస్పరం ఇచ్చి పుచ్చుకుంటున్నాయి. 1992 జనవరి 1 నుండి ఇది అమలు జరుగుతున్నదని విదేశాంగ కార్యాలయం తెలిపింది.

అణగదొక్కుతున్న మోడీ

మొదటి పేజీ తరువాయి

వివరించారు. షెడ్యూల్ సంస్థల విభజన చేయకపోవడం వల్ల వేలాది కోట్ల నిధులు రాకుండా పోయాయని, తెలంగాణలో పట్టణీకరణ ఎక్కువగా ఉన్నందున సేవా రంగ వృద్ధి అధికంగా నెలకొందని వివరించారు. విభజన చేసింది కేంద్రమేనని, అందుకే ఆంధ్రాకు సహకరించాల్సింది కూడా కేంద్రమేనని స్పష్టం చేశారు. లోటు నిధులపైనా కేంద్రం వ్యతిరేకంగానే వ్యవహరించిందని,సాకులు చెప్పి వివిధ పద్దుల కింద రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులు మంజూరు చేయడం లేదని వివరించారు. పైగా న్యాయం అడుగుతున్నందుకు విపక్ష పార్టీ నేతలపై దాడులు చేసేందుకు మోడీ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఎవరో ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుచేస్తే బిజెపి నేతలు దానిని తమ భుజాలపై ఎత్తుకుంటున్నారని చంద్రబాబు ఆరోపించారు. దీనిపై మోడీ, అరుణ్‌జైట్లీ చేస్తున్న ప్రకటనలే నిదర్శనమన్నారు. మమత బెనర్జీ బయటకు వచ్చేస్తారంటూ చేస్తున్న ప్రకటనలపై స్పందిస్తూ అసలు ఫెడరల్ ఫ్రంట్ ఎక్కడుందని, దీనిపై నవీన్ పట్నాయిక్, మమత ఎక్కడైనా మాట్లాడారా? అని ప్రశ్నించారు. తాము మాత్రం బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కూటమి ఏర్పాటు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. యుపిఎ ప్రభుత్వం కన్నా మోడీ అధ్వర్యంలోని ఎన్‌డిఎ సర్కారు ఎంతవరకు వృద్ధి సాధించిందని ప్రశ్నించారు. నల్లధనం, జిఎస్‌టి, నోట్ల రద్దు, రాఫెల్‌పై మోడీ, షా సమాధానాలు చెప్పాలని డిమాండ్ చేశారు. చివరకు ఫోన్ ట్యాపింగ్‌లకు కూడా పాల్పడుతున్నారనీ, మీరు, నేను మాట్లాడినా తెలుసుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపించారు. రాష్ట్రంలో సామంతుల రాజ్యం ఏర్పాటుచేసేందుకు కూడా బిజెపి కుట్ర చేస్తోందని విమర్శించారు.

రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు చంద్రబాబు వ్యాఖ్యానించారు. అనేక కార్యక్రమాలు, పండగ కానుకలు, బియ్యం పంపిణీ, పింఛన్లు వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని, పెట్టుబడి వ్యయంతోపాటు సంక్షేమ కార్యక్రమాలు కూడా సజావుగా సాగాలని తాను ప్రయత్నిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలకు ఖర్చులు తగ్గించడం, వారి ఆదాయాన్ని పెంచడంపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న వారందరికీ సాంకేతిక సాయంలో భాగంగా ప్రతి ఇంటికీ ఒక స్మార్ట్ ఫోన్ ఇచ్చేందుకు త్వరలోనే ఆలోచన చేస్తున్నట్లు వివరించారు. అలాగే ప్రతి గ్రామంలో, ప్రతి ఇంట్లో డిజిటల్ విధానం అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఇదే సమయంలో రాష్ట్రంలో విమానాశ్రయాలు, రాజధాని నిర్మాణం, పోలవరం నిర్మాణం, ఇతర కార్యక్రమాలపైనా దృష్టి సారిస్తున్నామన్నారు. కొత్త సంవత్సరం తొలి రోజునే హైకోర్టు ప్రారంభం కావడం శుభ సూచికమన్నారు. అయితే ఇంత చేస్తున్నా ఎవరెవరో వచ్చి ఏదేదో మాట్లాడుతున్నారని విమర్శించారు.

జగన్ ఎవరితో కలుస్తారో చెప్పాలి

మీడియా భేటీ సందర్భంగా పవన్ కల్యాణ్‌పైనా చర్చ జరిగింది. ఇటీవల కాలంలో పవన్, చంద్రబాబు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం లేదని కొంతమంది ప్రశ్నించారు. జగన్ కూడా వారిద్దరూ భాగస్వాములంటూ మాట్లాడుతున్నారన్న ప్రశ్నకు చంద్రబాబు స్పందిస్తూ తామిద్దరం కలిస్తే జగన్‌కు నష్టమేమిటని ఎదురు ప్రశ్నించారు. వాస్తవానికి జగన్ ఎవరితో కలుస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. పవన్ మళ్లీ వస్తే ఆయనతో కలుస్తారా? అన్న ప్రశ్నకు ఇప్పుడే సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని దాటవేశారు.

కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలి

- జాతీయ సదస్సులో కార్మిక సంఘాలు తీర్మానం

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా కార్మికులందరికీ రూ.18వేలు కనీస వేతనం అందజేయాలని కేంద్ర కార్మిక సంఘాల కూటమి డిమాండ్ చేసింది. న్యూఢిల్లీలో జరుగుతున్న జాతీయ సదస్సులో 20 పాయింట్లతో కూడిన ఎజెండాకు కేంద్ర కార్మిక సంఘాల కూటమి (కాన్సెంట్) ఆమోదం తెలిపింది. 'సార్వత్రిక సామాజిక భద్రత' పేరుతో 20 పాయింట్లతో కూడిన ఎజెండాను సదస్సు విడుదలచేసింది. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో, ఈపీఎఫ్ఓ, ఈఎస్ఐ కార్పొరేషన్ ద్వారా రిటైర్మెంట్ నిధిని ఏర్పాటుచేయాలని, తద్వారా సార్వత్రిక సామాజిక బాధ్యతను అమలు జేయవచ్చునని సదస్సు తీర్మానించింది. ఆర్‌ఎస్ఎస్ అనుబంధ సంస్థ భారతీయ మజ్దూర్ సంఘ్, ఐఎన్‌టీయూసీ, ద ట్రేడ్ యూనియన్ కోర్డినేషన్ సెంటర్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ట్రేడ్ యూనియన్స్... సదస్సులో ప్రధాన భూమిక పోషించాయి. అంగన్‌వాడీలకు, ఆషా, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు దేశ వ్యాప్తంగా రూ.18వేలు కనీస వేతనంగా అందజేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. రెగ్యులర్ ఉద్యోగులకు ఇస్తున్నట్టుగానే ఒప్పంద ఉద్యోగులకు కూడా వేతనాలు అందజేయాలని, సుప్రీంకోర్టు ఆదేశాల్ని అమలుజేయాలని సదస్సు కోరింది. ఏడాదికి 30 రోజులు వేతనాన్ని గ్రాట్యుటీగా చెల్లించాలనీ, నిబంధనల్ని మార్చాలనీ, 'నిటి ఆయోగ్'లో కార్మికుల, రైతుల ప్రాతినిథ్యం తీసుకురావాలని 'కాన్సెంట్' కేంద్రాన్ని కోరింది. కార్మిక చట్టాల్లో ఇటీవల చేసిన మార్పుల్ని రద్దుచేయాలని కోరింది. ప్రభుత్వ రంగసంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణను వ్యతిరేకిస్తున్నామని కార్మిక సంఘాలు ప్రకటించాయి.

భర్తలకు విడాకులు ... మళ్లీ 'ఒక్కటైన' యువతులు

- తమ వివాహాన్ని చట్టబద్ధం చేయాలంటూ న్యాయపోరాటం

లక్నో : ఇద్దరు యువతులు తమ భర్తలకు విడాకులిచ్చి, అనంతరం తమ పాత ప్రేమికురాలితో 'స్వలింగ' వివాహం చేసుకున్న ఘటన యుపిలో చోటు చేసుకుంది. తమ వివాహానికి చట్టబద్ధత కోసమై వారు న్యాయపోరాటం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే ఆ ఇద్దరు యువతులు కాలేజిలో చదువుకుంటున్నప్పుడే ఒకరినొకరు ప్రేమించుకున్నారు. అయితే వారి ప్రేమను వారి తల్లిదండ్రులు తిరస్కరించి బలవంతంగా వేర్వేరు వివాహాలు చేశారు. ఇది జరిగి ఆరేళ్లు గడిచింది. అయినా వారి ప్రేమ ఘాటు ఏ మాత్రం తగ్గలేదు. చివరికి 24, 26 ఏళ్ళ వయస్సున్న ఆ ప్రేమ జంట తెగించి, తమ భర్తలతో తెగతెంపులు చేసుకుని బుందేల్‌ఖండ్ ప్రాంతంలోని ఒక ఆలయంలో శనివారం పూలదండలు మార్చుకుని ఒక్కటయ్యారు. అయితే వీరి వివాహాన్ని నమోదు చేసేందుకు రిజిస్ట్రార్ నిరాకరించడంతో న్యాయ పోరాటానికి సిద్ధమయ్యారు. గత ఏడాది సెప్టెంబరు 6న సుప్రీం కోర్టు ధర్మాసనం స్వలింగ సంపర్కానికి చట్టబద్ధత కల్పిస్తూ, భారత శిక్షా స్మృతిలోని సెక్షన్ 377 కింద స్వలింగ సంపర్కులను శిక్షించడాన్ని నిషేధించింది. అయితే స్వలింగ వివాహాలకు మాత్రం చట్టబద్ధత కల్పించలేదు.

ఈ కారణంగా రిజిస్ట్రార్ ఆర్‌కె పాల్ వారి వివాహాన్ని నమోదు చేసేందుకు నిరాకరించారని వారి తరుపు న్యాయవాది దయా శంకర్ తివారీ తెలిపారు.

కాగా రిజిస్ట్రార్ పాల్ ఈ సోమవారమే పదవీ విరమణ చేశారు. దీనిపై ఆయన మాట్లాడుతూ ఆ వివాహాన్ని నమోదు చేయడానికి నిబంధనలు అంగీకరించవని అన్నారు.

అయితే ఆ యువతులిద్దరూ ఏ మాత్రం నిరుత్సాహ పడకుండా తమ వివాహానికి చట్టపరమైన గుర్తింపు లభిస్తుందనే ఆశాభావంతో ఉన్నారు. సుప్రీంకోర్టు సెక్షన్ 377ను కొట్టేసినప్పటికీ, తాము కలిసే జీవిస్తామన్నారు. తమకు ఎవరూ ఇబ్బందులు కలిగించలేరన్నారు. ఇప్పటికే కొంతకాలంగా తాము జంటగా జీవిస్తున్నామని తెలిపారు.

ఆరేళ్ళ క్రితం తాము కాలేజిలో తొలిసారి కలుసుకున్నామని, తమ మధ్య ఉన్న సంబంధాన్ని తెలుసుకున్న కుటుంబ సభ్యులు మధ్యలోనే చదువు మాన్పించారని వారిలో ఒక యువతి తెలిపింది. ఆ తరువాత ఆరు నెలలకు తమకు వేరేవేరే వ్యక్తులతో వివాహమైందని చెప్పారు. వివాహమై భర్తలున్నప్పటికీ తమని ఒకరినొకరు మరిచిపోలేకుండా ఉన్నామని తెలిపారు. దీంతో తమ భర్తలకు విడాకులిచ్చామని చెప్పారు. తాము కలిసి జీవించేందుకు న్యాయపోరాటం జరుపుతామని అన్నారు..



నాలుగు నెలల అనంతరం సచివాలయానికి పారికర్

పనాజీ: గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ ...ఎయిమ్స్‌లో చికిత్స చేయించుకొని గోవాకు తిరిగి వచ్చిన ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ నాలుగు నెలల అనంతరం మంగళవారం తొలిసారిగా రాష్ట్ర సచివాలయానికి విచ్చేశారు. పారికర్ సచివాలయానికి వచ్చిన విషయాన్ని తెలుసుకున్న ప్రజలు, బిజెపి నేతలు ఆయనకు స్వాగతం పలికారు. గోవా అసెంబ్లీ స్పీకర్ ప్రమోద్ సవంత్, మాజీ, ప్రస్తుత మంత్రులు, భాజపా ఎమ్మెల్యేలు ఆయనను సచివాలయంలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన అధికారులు, మంత్రులతో సమావేశమైనట్లు తెలిపారు.

నిరసనలకు భయపడి...

- నలుపు రంగు దుస్తువులు, వస్తువులపై నిషేధం
- ఈ నెల 5న జార్ఖండ్‌లో మోడీ సభ

రాంచీ: ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు అందరికీ ఉంది. కానీ, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హక్కును కూడా కాలరాస్తోంది. ప్రధాని మోడీతో సహ బీజేపీ పాలిత ముఖ్యమంత్రులు పాల్గొంటున్న సభలలో నిరసనకారులు ఏదో ఒక రూపంలో తమ నిరసనను ప్రభుత్వానికి వెల్లడించే ప్రయత్నం చేస్తూ ఉంటే.. బీజేపీ ప్రభుత్వాలు మాత్రం వారిని కట్టడి చేసే విధంగా వ్యవహరించిన ఘటనలు కోకొల్లలు. కాగా, జార్ఖండ్‌లో ఈనెల 5న పలాములో జరగబోయే మోడీ సభకు హాజరయ్యేవారు నలుపు రంగు దుస్తువులు, బ్యాగులు ధరించి రావొద్దని రాష్ట్ర సర్కారు తెలిపింది. నలుపు రంగు ఉన్న ప్రతీ వస్తువు పైనా ముఖ్యమంత్రి రఘుబర్ దాస్ నేతృత్వంలోని బీజేపీ సర్కారు నిషేధం విధించింది.

చెరువుల్ని నింపండి : సిఎంకు సిపిఐ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(పిఎబిఆర్) కుడి కాలువ కింద చెరువులకు 2.5 టిఎంసిల నీటిని విడుదల చేసి, చెరువులన్నింటినీ నింపేందుకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మంగళవారం ఒక లేఖ ద్వారా కోరారు. అనంతపురం జిల్లాలో తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని, అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించిందని పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా పిఎబిఆర్ కుడి కాలువ కింద చెరువులకు నీరందిస్తున్నారని, ఫలితంగా బావులు, బోర్లలో నీటిమట్టం పెరిగి కొన్ని గ్రామాల ప్రజలకు నీటి ఇబ్బందులు తీరాయని తెలిపారు. ఈ ఏడాది తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయని, అనంతపురం జిల్లాలో లక్షలాది ఎకరాల్లో పంట వేయలేదని, వేసిన అరకొర పంటలు కూడా నీరులేక ఎండిపోయాయని పేర్కొన్నారు.

'మా' పథకాలు అద్భుతం



'మా' డైరీని ఆవిష్కరిస్తున్న దృశ్యం


మూవీ ఆర్టిస్టుల సంఘం (మా) ఇటీవలే కొత్త పథకాల్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ మేరకు మా అధ్యక్షకార్యదర్శకులు శివాజీ రాజా, సీనియర్ నరేష్ ఈ పథకాల వివరాల్ని అందించారు. మా డైరీ ఆవిష్కరణలో సూపర్‌స్టార్ కృష్ణ, విజయ నిర్మల, రెబల్‌స్టార్ కృష్ణంరాజు, శ్యామలా దేవి దంపతులు ఈ పథకాల్ని ప్రశంసించి తమవంతు సాయాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ పథకాలకు ప్రత్యేకించి విడివిడిగా నామకరణం చేసింది మా అసోసియేషన్. ఈ పథకాలు అద్భుతంగా ఉన్నాయని, మూవీ ఆర్టిస్టుల సంఘం మంచి పనులు చేసేందుకు ప్రతిసారీ ముందుకొస్తోందని మెగాస్టార్ చిరంజీవి అభినందించారు. మా అధ్యక్షుడు శివాజీరాజా, ఇతర సభ్యుల కషిని ప్రత్యేకంగా అభినందించారు.

2019 జనవరి 1 నుంచి 'మా' తమ సభ్యుల కోసం ప్రవేశపెట్టిన పథకాల వివరాలివి. డా.చిరంజీవి 'మా' కళ్యాణ లక్ష్మి పథకం పేరుతో రూ.1,16,000 మొత్తాన్ని పెళ్లి చేసుకునే ఆడపిల్లకు అందజేస్తారు. డా.ఏఎన్నార్ 'మా' విద్యా పథకం పేరుతో 80 శాతం స్కోర్ చేసిన పిల్లలకు రూ.1,00,000 అందజేస్తారు. డా.విజయనిర్మల మా చేయూత పథకం పేరుతో వృద్ధులకు నెలవారీ ఫించను రూ.5000 చొప్పున అందిస్తారు. ఇదివరకూ రూ.2000గా ఉన్న ఫించనును రూ.5000కు పెంచారు. 35 మంది సభ్యులకు ఈ ఫించను అందనుంది. శ్రీకాంత్ 'మా' మానవతా ఎల్ఐసీ పథకం పేరుతో రూ.3,00,000 ఇన్సూరెన్స్ సదుపాయం మెంబర్స్‌కి కలగనుంది. ఇలాంటి పథకాలు భారతదేశంలోనే వేరొక సినీపరిశ్రమలో ఎక్కడా లేవని పరిశ్రమ ప్రముఖులు పేర్కొన్నారు.

'మిస్టర్ మజ్ను' టీజర్



అఖిల్ అక్కినేని హీరోగా శ్రీవెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ఎల్‌పి పతాకంపై 'తొలిప్రేమ' ఫేం వెంకీ అట్లూరి దర్శకత్వంలో బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'మిస్టర్ మజ్ను'. ప్రస్తుతం ఈ చిత్రం చిత్రీకరణ దశలో ఉంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి ఈనెల 25న ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవల ఈ చిత్రానికి సంబంధించి విడుదలైన 'ఏమైనదో.. ఏమైనదో.. పలుకు మరచినట్టు పెదవికేమైనదో..', మిస్టర్ మజ్ను టైటిల్ సాంగ్‌కు చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది. కాగా, నూతన సంవత్సర కానుకగా ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేయనున్నారు. నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో నాగబాబు, ప్రియదర్శి, జయప్రకాష్, హైపర్ ఆది ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు.



కీలకమైన పాత్రలో రానా

బాలీవుడ్‌లో అక్షయ్‌కుమార్, రితేష్‌దేశ్‌ముఖ్, బాబీ డియోల్ ప్రధాన తారాగణంగా తెరకెక్కుతోన్న చిత్రం 'హౌస్‌ఫుల్ 4'. గత ఏడాది మీటూ ఉద్యమం ఊపందుకున్న తరుణంలో ఈ చిత్ర దర్శకుడు సాజిద్ ఖాన్‌పై పలు వేధింపు ఆరోపణలు వచ్చాయి. పలువురు నటీమణులు తమకు ఎదురైన చేదు అనుభవాలను వెల్లడించారు. దాంతో చిత్ర నిర్మాణాన్ని కొద్ది కాలం ఆపేసి దర్శకుడు ఆ చిత్రం నుంచి తొలగించారు. కాగా, ప్రస్తుతం ఈ చిత్రానికి ఫర్హాద్ సామ్జీ దర్శకత్వ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మధ్యలో ఈ చిత్ర బాధ్యతలు తీసుకోవడం సవాల్‌గా మారిందని పేర్కొన్నారు. ఇందులో రానా దగ్గుబాటి పాత్ర చాలా కీలకమైందని పేర్కొన్నారు.

'రామ చక్కని సీత'



ఇంద్ర, సుకత వాగ్లే జంటగా శ్రీ హర్ష మండ తెరకెక్కిస్తున్న చిత్రం 'రామ చక్కని సీత'. మహాకవి వాల్మీకి రాసుకున్న రామాయణం నిజం అయితే తన కథ కూడా నిజమే అంటున్నాడు దర్శకుడు శ్రీ హర్ష మండ. ఆయన తెరకెక్కిస్తున్న సినిమా చిత్రీకరణ ఇప్పటికే 70 శాతం పూర్తయింది. క్రొకోడైల్ క్రియేషన్స్, లియో సెల్యులాయిడ్స్ బ్యానర్స్ పై విశాలక్ష్మి మండ, జి.ఎల్ ఫణికాంత్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సినిమా ఆద్యంతం వినోదాత్మకంగా అన్ని వర్గాలను ఆకట్టుకునేలా ఉంటుందని చెబుతున్నారు దర్శక నిర్మాతలు. జనవరి 1 నూతన సంవత్సరం సందర్భంగా ఈ చిత్ర ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఇందులో ప్రియదర్శి, కాశీ విశ్వనాథ్, అభయ్, బుల్లెట్ భాస్కర్, జబర్దస్త్ అప్పారావు, మధు మణి, రాహుల్ సిప్లిగంజ్ ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. కేశవ కిరణ్ సంగీతం అందిస్తుండగా మురుగన్ గోపాల్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. గ్యారీ బి హెచ్ ఎడిటింగ్ చేస్తున్నారు.

1983 బ్యాక్‌డ్రాప్‌తో 'కల్కి'




డా.రాజశేఖర్ నటిస్తున్న తాజా చిత్రం 'కల్కి'. 'అ' వంటి విలక్షణమైన చిత్రాన్ని తెరకెక్కించిన ప్రశాంత్ వర్మ డైరెక్షన్‌లో రూపొందు తోంది. 'పి.ఎస్.వి.గరుడవేగ' తర్వాత రాజశేఖర్ చేస్తున్న చిత్రమిది. శివానీ శివాత్మిక మూవీస్ బ్యానర్ సమర్పణలో హ్యాపీ మూవీస్ పతాకంపై సి.కల్యాణ్, శివానీ రాజశేఖర్, శివాత్మిక రాజశేఖర్ నిర్మిస్తున్నారు. ఆదాశర్మ, నందితాశ్వేత, స్కార్లెట్ విల్సన్ హీరోయిన్లుగానటిస్తున్నారు. అశుతోష్ రానా, నాజర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. 1983 బ్యాక్‌డ్రాప్‌లో సినిమా కథాంశం సాగుతుంది. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం విడుదల చేశారు.

'ఎక్కువ అనే భావన లేకుండా పెంచుతా'



'ఇంట్లో అబ్బాయిలను సరిగ్గా పెంచాలని తల్లిదండ్రులకు సూచించిన రేణు దేశాయ్, అమ్మాయిల వల్ల ఎవరికీ ఎలాంటి ఇబ్బంది ఉండదని చెప్పారు. అబ్బాయిలు సరిగా ఉంటే సమాజం బాగుంటుందని తెలిపారు. మహిళలకు గౌరవం ఇచ్చేలా అకీరాను పెంచుతున్నానని రేణు దేశాయ్ తెలిపారు. చెల్లెలి కంటే తను ఎక్కువ అనే భావన రాకుండా అకీరాను పెంచుతున్నానని' ఆమె ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఇటీవల మీడియాతో మాట్లాడిన ఆమె మీటూ గురించి సంచలన వ్యాఖ్యలు చేసింది. 18 ఏళ్లకే 'బద్రీ'తో సినిమాల్లోకి అడుగుపెట్టానని చెప్పిన రేణు.. పవన్‌ను ప్రేమించి పెళ్లాడినందున తనకు ఇండస్ట్రీలో అలాంటి అనుభవాలు ఎదురు కాలేదని చెప్పింది. కానీ ఇలాంటి ఘటనలను మాత్రం గమనించానని చెప్పింది. సినిమా ఇండస్ట్రీతోపాటు సాఫ్ట్‌వేర్, బిజినెస్.. పలు చోట్ల మహిళలు వేధింపులు ఎదుర్కొంటున్నారని చెప్పిన రేణు దేశాయ్.. గ్లామర్ ఇండస్ట్రీ కావడంతో సినీ రంగం ఎక్కువగా ఫోకస్ అవుతుందని చెప్పింది. సినిమాల్లో కంటే ఐటీ ఫీల్డ్‌లో ఇలాంటి ఇబ్బందులు ఎక్కువగా ఉంటాయనొ పేర్కొంది. 'నాకు తెలిసిన ఓ 15 ఏళ్ల అమ్మాయిని రేప్ చేశారు. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడానికి స్టేషన్‌కి వెళ్తే అక్కడ కూడా రేప్ చేశారు. ఇది తెలిశాక నాకు ఏడుపొచ్చింది. పోలీసులంతా ఇలాగే ఉంటారని చెప్పను. కానీ ఇలాంటి సంఘటనలు కూడా చోటు చేసుకుంటాయి. పోలీసులు చెడ్డవాళ్లు అని కామెంట్ చేశానని మళ్లీ నన్ను టార్గెట్ చేస్తారు. అందుకే క్లారిటీ ఇస్తున్నా' అని రేణు తెలిపింది.

ఖాదర్ ఖాన్ కన్నుమూత



బాలీవుడ్ సీనియర్ నటుడు, రచయిత ఖాదర్ ఖాన్ (81) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కెనడాలో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుమారుడు సర్ఫరాజ్ వెల్లడించారు. దాదాపు 17 వారాలుగా హాస్పిటల్లో చికిత్స పొందుతోన్న ఖాదర్ ఖాన్ సోమవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు తెలిపారు. ఆయన అంత్యక్రియలు కెనడాలోనే నిర్వహించనున్నారు. అనారోగ్యంతో ఉన్న తన తండ్రి కోలుకోవాలని అభిమానులు, స్నేహితులు కోరుకున్నారని, వారందరికీ తన ధన్యవాదాలని సర్ఫరాజ్ పేర్కొన్నారు. అఫ్గానిస్థాన్‌లో కాబూల్‌లో 1937 డిసెంబరు 11న జన్మించిన ఖాదర్ ఖాన్, 1973లో రాజేశ్ ఖన్నా హీరోగా వచ్చిన 'దాగ్' చిత్రంతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. 300లకు పైగా చిత్రాల్లో నటించారు. 250కిపైగా చిత్రాలకు సంభాషణలు అందించారు.


1980, 90 దశకంలో బాలీవుడ్‌లో ఓ వెలుగు వెలిగిన ఖాదర్ ఖాన్, అనేక విజయవంతమైన చిత్రాలకు రచయితగా పనిచేశారు. రణధీర్ కపూర్, జయాబచ్చన్ జంటగా వచ్చిన 'జవానీ దివానీ' చిత్రంలోని ఆయన రాసిన సంభాషణలు అప్పట్లో పాపులర్ అయ్యాయి. ఇక, మన్మోహన్ దేశాయ్, ప్రకాశ్ మెహ్రాలతో ఎక్కువగా పనిచేశారు. వీరి కలయికలో 'సుహాగ్, పర్వారీశ్, అమర్ అక్బర్ ఆంటోనీ, జ్వాలాముఖి, షరాబీ, లవారీస్, ముఖ్దర్ కా సికిందర్' లాంటి సూపర్ హిట్ చిత్రాలు వచ్చాయి. శ్వాససంబంధ వ్యాధి కారణంగా మెదడులో నరాలు దెబ్బతినడంతో నడవడానికి కూడా కష్టపడ్డారు. మెదడు పనితీరు మందగించడంతో మతిమరుపు వచ్చింది. ఆయన కొద్ది రోజుల కిందటే కన్నుమూసినట్లు మీడియాలో కథనాలు వచ్చాయి. అయితే, ఈ వార్తలను ఖాదర్ ఖాన్ కుమారుడు అప్పట్లో ఖండించారు. కాగా, ఖాదర్ మరణవార్త తెలిసి బాలీవుడ్ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

సస్పెన్స్ థ్రిల్లర్‌గా 'కెఎస్ 100'



సమీర్ ఖాన్, శైలజ

మోడల్స్ సమీర్ ఖాన్, శైలజ హీరో హీరోయిన్లుగా పరిచయమవున్న చిత్రం 'కెఎస్ 100'. చంద్రశేఖరా మూవీస్ పతాకంపై వెంకట్‌రెడ్డి నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. దర్శకుడు షేర్ మాట్లాడుతూ.. టైటిల్‌కు తగ్గట్టుగానే వైవిధ్యమైన కంటెంట్‌తో తెరకెక్కిన చిత్రమిది. హార్రర్, సస్పెన్స్ థ్రిల్లర్, రొమాంటిక్ జోనర్స్‌లో ప్రేక్షకులను నచ్చేలా తీశాం. యూత్‌ను, మహిళలను ఆకట్టుకునే అంశాలుంటాయి. గోవా, హైదరాబాద్, మహారాష్ట్రని హిరంబుల్ లొకేషన్స్‌లో షూటింగ్ చేశాం. ఇందులో చాలా మంది మోడల్స్‌ను పరిచయం చేయటం విశేషం. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాణాంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తామన్నారు. అక్షిత, అషి, సునీత, శ్రద్ధా, నందిని, కల్పన అజీమ్, పూరివి, సుమన్ తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: వంశీ, ఎడిటర్: లోకేష్ చందు, నాగార్జున, సాహిత్యం: భాష్య శ్రీ, మ్యూజిక్: నవనీత్ చారి.



విడుదల దగ్గర పడడంతో ఎన్‌టిఆర్ బయోపిక్‌కు సంబంధించిన స్టిల్స్‌ను ఒక్కొక్కటి విడుదల చేస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం నాడు ఎన్టీఆర్ తన కుమారుడికి నామకరణోత్సవం జరుపుతున్న స్టిల్‌ను విడుదల చేశారు.

ఇప్పుడు లాభం లేదంటున్న జానకి

సినిమాల్లో అవకాశాల కోసం తలొగ్గి, డబ్బులు పోగుచేసుకొని... ఇప్పుడేమో మీటూ అంటూ లైంగిక ఆరోపణలు చేయడం చాలా తప్పు అని సీనియర్ నటి షావుకారు జానకి పేర్కొన్నారు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ, మలయాళ భాషల్లో దాదాపు 300 చిత్రాల్లో ఆమె హీరోయిన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటించారు. ఆమె మీటూ ఉద్యమంపై మాట్లాడారు. అన్యాయం అంటూ జరిగితే అప్పుడే ప్రశ్నించాలి, ఎదురించాలి.. అంతేకాని అవకాశాల కోసం సర్దుకుపోయి, చాలాకాలం తర్వాత ఇలాంటి ఆరోపణలు చేయడం చాలా దారుణం. అసలు మీటూ ఉద్యమాన్ని పక్కదారి పట్టించారు.' అని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ విషయాలను ఆమె ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

రవిబాబు 'ఆవిరి'

గత ఏడాది 'అదిగో' అంటూ చిత్రమైన కాన్సెప్ట్‌తో ముందుకు వచ్చిన దర్శక నిర్మాత రవిబాబు ఈ ఏడాది 'ఆవిరి' అంటూ రాబోతున్నాడు. తన చిత్రం గురించి భిన్నమైన కోణంలో ప్రచారాన్ని ఆవిష్కరించే ఆయన ఈసారి ఆవిరి కాన్సెప్ట్ పోస్టర్ విడుదల చేశారు. విభిన్నంగా ఉన్న ఈ పోస్టర్ సినిమాపై అంచనాలు పెంచేసింది. ఇది ఒక ఆఫ్ బీట్ చిత్రమనీ, త్వరలోనే చిత్ర వివరాలను, నటీనటులను ప్రకటిస్తామని తెలిపారు. మరికొన్ని రోజుల్లోనే వీటి వివరాలు బయటకు రానున్నాయి. ఫ్లయింగ్ ఫ్రాగ్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



సైటెక్
Science & Technology



నూతన సంవత్సరాన్ని జరుపుకోవడంలో శాస్త్రీయత ఉందా?

ప్రశ్న: నూతన సంవత్సరాన్ని ఇంత హడావిడిగా, వినోదంగా జరపడంలో శాస్త్రీయత ఉందా?

- ఎం.జగన్మోహనరెడ్డి, వరంగల్.

జవాబు : నాగరిక సమాజంలో ప్రతిదాన్నీ శాస్త్రీయ దృక్కోణంతో చూడడంలో తప్పులేదుగానీ ప్రతీది శాస్త్రీయ సూత్రాలకు అనుగుణంగానే జరిగి తీరాలనుకోవడం అత్యాశే అవుతుంది. తద్వారా మనం ప్రజల మన్ననల్ని పొందలేము. సామాజిక ప్రగతికి, గమనానికి భంగం కలగనంత వరకు కొన్ని ఆచారాలను రాజ్యాంగం ఆమోదిస్తుంది. వైజ్ఞానిక పరిభాషలో చెప్పాలంటే జనవరి 1వ తేదీకీ, అక్టోబర్ 29వ తేదీకి, మరో ఇతర తేదీకి తేడాలేదు. ఋతువులను బట్టి కూడా కచ్చితంగా ప్రతి సంవత్సరం జనవరి నెల ఒకటవ తేదీనాడు ఈ భూమ్మీద ఒకే విధమైన వాతావరణ పరిస్థితులుంటాయనడానికి లేదు. అంతెందుకు? సుమారు 10 వేల సంవత్సరాల క్రితం భూమ్మీద ఇపుడున్న పరిస్థితులకు పూర్తి వ్యతిరేక పరిస్థితులు ఉండేవి. అంటే భారతదేశం వంటి దేశాల్లో మే, జూన్ నెలల్లో విపరీతమైన చలి ఉండేది. డిసెంబర్, జనవరి నెలల్లో వేసవికాలం ఉండేది. ఇపుడు మనం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో చలికాలాన్ని చవిచూస్తున్నాము. మొన్నమొన్నటి వరకు మే, జూన్ నెలల్లో విపరీతమైన మండు వేసవికి తట్టుకొన్నాం. కానీ సుమారు 10 వేల సంవత్సరాల తర్వాత పదివేల సంవత్సరాల క్రితం ఉన్న పరిస్థితులే పునరావృతం అవుతాయి. అంటే 2019 సంవత్సరం దరిదాపుల్లో మన తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు ఫిబ్రవరి, మార్చి నెలల్లో కురుస్తాయి. డిసెంబర్, జనవరి నెలలో వేసవి ఉంటుంది. ఏప్రిల్, మే, జూన్ వంటి నెలల కాలంలో విపరీతమైన చలితో ఉంటాము. ఋతువులు, ఉష్ణోగ్రతా పీడన పరిస్థితులు పంటలు, మామిడి పండ్ల కాలం మారుతుంది. తెలుగు సంవత్సరాది, తమిళ సంవత్సరాది, ఆంగ్ల సంవత్సరాది సుమారు ప్రతి 12 నెలలకోసారి పునరావృతమవుతున్నా అవి క్యాలెండర్ ప్రకారమేగానీ ఋతువుల కనుగుణంగా కాదనీ ఇట్టే తెలిసిపోతుంది. నిన్న మొన్న జనవరి 1 వ తేదీన మనం భారత కాలమాన ప్రకారం డిసెంబర్ 31 రాత్రి 12 గంటలు (అర్ధరాత్రి) దాటిన వెంటనే నూతన సంవత్సరంగా జరుపుకొన్నాము. కానీ మన దేశంలో డిసెంబర్ 31 సాయంత్రం 6 గంటలు అవుతుండగా అప్పటికే న్యూజిలాండ్ దేశ ప్రజలు నూతన సంవత్సరాన్ని జరిపేసుకొన్నారు. మనం జనవరి 1వ తేదీ ఉదయాన్నే స్నేహితులకు, బంధువులకు, మిత్రులకు, అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకొని హడావిడి చేశాం. కానీ మన అమెరికా బంధువులకా సమయం ఇంకా డిసెంబర్ 31 రాత్రి 12 గంటలు దాటలేదు. కాలిఫోర్నియా వంటి రాష్ట్రాల్లో మనం జనవరి 1 వ తేదీ మధ్యాహ్నం 2 గంటల సమయంలో వారికి జనవరి 1వ తేదీ ప్రారంభమయ్యింది. (అంటే డిసెంబర్ 31 అర్ధరాత్రి దాటింది). ప్రపంచ దేశాల్లో 30 నిముషాల వ్యవధిలో ఆయా దేశాల గడియారాలు నడుస్తున్నాయి. అంటే న్యూజిలాండ్‌లో అర్ధరాత్రి దాటి గడియారం 00.00 చూపిస్తుండగా, ఆ క్రితపు రోజు రాత్రి పదిగంటలు (22.00గా) ఆస్ట్రేలియా దేశంలో గడియారం చూపిస్తుంది. మన దేశంలో ఆ క్రితపురోజు సాయంత్రం 5 గంటలై ఉంటుంది. కానీ కాలిఫోర్నియాలో ఆ క్రితపురోజు ప్రారంభమవుతుంటుంది. ఇలా వివిధ దేశాలు వివిధ కాలాలు జరుపుకొనే నూతన సంవత్సరాదికి శాస్త్రీయతంటూ, వైజ్ఞానికతంటూ ఏమీ లేదు. ఇది కేవలం ఆచారం. మా అబ్బాయి డిసెంబర్ 1న రాత్రి 11 గంటలకు పుట్టాడు. వాడు అమెరికాలో తన పుట్టినరోజును మన 2వ తేదీకి జరుపుకొంటున్నాడు, తేదీ కుదరాలి కాబట్టి. ఇదే క్యాలెండర్ తమాషా!




ప్రొ॥ ఎ. రామచంద్రయ్య
సంపాదకులు,
చెకుముకి, జనవిజ్ఞాన వేదిక.
email: allikayala@gmail.com

ఈ వ్యర్థాలతో అనర్థాలు

ఈ దేశానికేమైంది... ఒకవైపు పర్యావరణ కాలుష్యం, మరోవైపు ఎలక్ట్రానిక్ వ్యర్థాల కాలుష్యం. వెరసి మనిషి జీవన క్రమాన్ని మృత్యువు వైపు నెడుతోంది. అతి ఎప్పుడూ అనర్థదాయకమే అన్నట్లుగా, ఇప్పుడు సాంకేతికోపకరణాల అధిక వినియోగం కూడా అనర్థంగా పరిణమిస్తోంది. సాంకేతిక పరిజ్ఞానం వల్ల ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో అన్ని అనర్థాలు ఉన్నాయనేది విశ్లేషకుల వాదన. ఎప్పటికప్పుడు ఆధునిక ఫీచర్లతో కూడిన సాంకేతిక పరికరాలు అందుబాటులోకి వస్తుండటంతో ఉపయోగిస్తున్న వస్తువులను పక్కన పెట్టేసి కొత్త కొత్త ఫీచర్ల వైపు మొగ్గుచూపుతున్నారు. ఇంట్లో వాడే ప్లాస్టిక్ దగ్గర నుండి వాహనాల విడి భాగాల వరకూ అనేకం ఈ కోవలోకే వస్తాయి. ఇలా వ్యర్థంగా పడవేసేవాటి ముద్దుపేరే ఈ-వేస్ట్ (ఎలక్ట్రానిక్ వ్యర్థాలు). ప్రపంచవ్యాప్తంగా ఈ-వ్యర్థాల పెరుగుదల రేటు ఏడాదికి 4కోట్ల టన్నుల మేర వుందని ఒక అంచనా. ఇన్నాళ్ళూ పాశ్చాత్య దేశాలకే పరిమితమైన ఈ-వ్యర్థాల సమస్య ఇప్పుడు భారత్‌ను కూడా పట్టి పీడిస్తోంది.

తాజా అధ్యయనం ప్రకారం... ఈ-వ్యర్థాలు అతిగా ఉత్పత్తి చేస్తున్న దేశాల్లో భారత్ ఐదో స్థానంలో ఉంది. మొబైళ్ల వాడకం అత్యధికంగా ఉన్న దేశాల్లో ఒకటైన మనకు ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంది. ప్రతి ఇంటిలో కనీసం ఐదారు ఫోన్‌లు వాడకంలో ఉండటంతో పాటు ఉపయోగం లేకుండా మరో నాలుగైదు ఫోన్లు పడి ఉంటున్నాయని సర్వేలు చెబుతున్నాయి. ఇండియాలో ఏటా దాదాపు 18.5 లక్షల టన్నుల ఎలక్ట్రానిక్ వేస్టేజ్ డంప్ యార్డులకు చేరుతోంది. దేశంలో 103 కోట్ల మొబైల్ ఫోన్లు వాడకంలో ఉన్నాయి. ఏటా కోట్లాది కొత్త ఫోన్లు మార్కెట్‌లోకి వస్తున్నాయి. అదేస్థాయిలో పాతఫోన్లు మూలనపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ-వ్యర్థాల వల్ల భవిష్యత్‌లో భారత్ ఇబ్బందుల్లో పడే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. మొబైల్ ఫోన్లు మాత్రమే కాక పర్సనల్ కంప్యూటింగ్ డివైజ్‌లు, టెలివిజన్ల వల్ల కూడా ఈ-వ్యర్థాలు కుప్పలు తెప్పలుగా పెరిగిపోతున్నాయి. 2020 నాటికి భారత్‌లో ఈ-వ్యర్థాల సంఖ్య 5.2 మిలియన్ల మెట్రిక్ టన్నులకు చేరొచ్చని అంచనా. ప్రస్తుతానికి 1.8 మిలియన్ టన్నులుగా ఉన్న ఈ-వ్యర్థాల సంఖ్య ఇటీవల కాలంలో గణనీయంగా పెరిగిందట. వ్యర్థాల పెరుగుదలలో 30 శాతం వృద్ధి ఉందని ఇది భారత్‌కు ఇది మంచిది కాదని నిపుణులు అంటున్నారు. వీటిలో మొబైల్ వ్యర్థాల సంఖ్యే అధికంగా ఉంటోంది. ఎక్కువమంది వాడని ఫోన్లను నిరుపయోగంగా పడేయడం వల్లే ఈ-వ్యర్థాలు పెరిగిపోతున్నాయని ఇది ప్రమాదకర సంకేతమని వారు చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది పోగవుతున్న ఈ-వ్యర్థాలలో దాదాపు 30 లక్షల టన్నులు ఒక్క అమెరికాలోనే ఉత్పత్తి అవుతున్నాయి. ఇందులో 20 శాతం మాత్రమే సరిగా రీసైకిల్ చేయగలుగుతున్నారు. మిగతా మొత్తం వ్యర్థాలను అభివృద్ధి చెందుతున్న, పేద దేశాలకు పంపుతోంది. అమెరికా తర్వాతి స్థానంలో చైనా ఉంది. అక్కడ ఏటా 23 లక్షల టన్నుల ఈ-వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. కంప్యూటర్లతో పాటు సెల్‌ఫోన్లు కూడా ఈ-వ్యర్థాలలో ప్రధాన భాగం ఆక్రమించాయి. ఈ-వ్యర్థాల్లో ఫోన్ల వాటా 25 శాతానికి పైమాటే. స్మార్ట్ గాడ్జెట్ల వినియోగం అంతకంతకూ పెరిగిపోవడం కూడా పర్యావరణానికి శాపంగా పరిణమిస్తోంది. ఏటా 30 శాతం వృద్ధితో ఈ-వ్యర్థాలు పోగవుతున్నాయి. అదే సమయంలో వీటి రీసైక్లింగ్ 20 శాతాన్ని మించడం లేదు. యవత భారతం డిజిటల్ బాట పడుతున్న తరుణంలో.. రీసైక్లింగ్‌పై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు నిపుణులు. లేనిపక్షంలో 2030 నాటికి ఈ-వ్యర్థాల ఉత్పత్తిలో మనమే నంబర్ వన్‌గా నిలిచే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. మొబైల్ ఫోన్ల వాడకం విపరీతంగా పెరగడం వల్లే ఈ సమస్య తలెత్తిందని, వీలైనంత త్వరగా తమ పాత ఫోన్లను రీసైక్లింగ్‌కు ఇవ్వాలని కూడా ప్రభుత్వం చెబుతోంది. ఐతే దీనిపై విస్తృత స్థాయిలో ప్రచారం అవసరమని అప్పుడే దేశ వ్యాప్తంగా దీనిపై అవగాహన వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ-వ్యర్థాలు ఇలా అనవసరంగా పడేయడం వల్ల అవి భూమిలోకి వెళ్లి భూగర్భ జలాలను కలుషితం చేస్తాయని, అంతేకాక సారవంతమైన భూములను కూడా నిస్సారంగా మార్చే ప్రమాదం ఉందని, అంతేకాక మొబైల్ వ్యర్థాలు గాలిలో కలవడం వల్ల కూడా కాలుష్యం విపరీతంగా పెరిగిపోతుందని, ఇది మానవ మనుగడకు అత్యంత ప్రమాదకరమని నిపుణుల అంచనా.



వ్యర్థాలతో అనర్థాలు

మనం నిత్యం వాడుతున్న ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల్లో హానికారక లోహాలు పరిమితికి ఉన్నాయని, అవి మానవాళికి, వాతావరణానికి తీవ్రంగా హాని చేస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వీటిలో కాడ్మియం వల్ల కంటి, కిడ్నీ, అనెక్సెయా వంటి సమస్యలు వస్తాయి. అదేవిధంగా లెడ్‌తో లింబ్ పెరాలసిస్, తలనొప్పి, అనీమియా, మెర్క్యూరీతో కంటి, చర్మ సంబంధ సమస్యలు, ఊపిరితిత్తులు, కాలేయం వంటి వాటికి హాని జరుగుతుంది. క్రోమియంతో లంగ్ క్యాన్సర్, కిడ్నీ ఫెయిల్యూర్‌తో పాటు చర్మ, ఇంకా పలు సమస్యలు వస్తాయని నిపుణులు పేర్కొంటున్నారు.

- ఉదయమిత్ర

త్వరలో ఏడు కెమెరాల స్మార్ట్‌ఫోన్!



నోకియా మరో అద్భుతాన్ని ఆవిష్కరించింది. హెచ్ఎండీ గ్లోబల్ బ్రాండ్ కింద స్మార్ట్‌ఫోన్ ప్రపంచంలోకి రీఎంట్రీ ఇచ్చిన నోకియా తాజాగా మరో ఘనతకు తెరతీసింది. ఏకంగా ఏడు కెమెరాలతో ఒక స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేయనుంది. ఏడు కెమెరాలతో స్మార్ట్‌ఫోన్ రావడమనేది ప్రపంచంలోనే తొలిసారి. తాజా సమాచారం ప్రకారం... వెనుక 5 కెమెరాలు, ముందు రెండు కెమెరాలు- మొత్తం 7 కెమెరాలతో ఈ స్మార్ట్‌ఫోన్‌ను రూపొందించినట్లు తెలుస్తోంది. 'నోకియా 9 ప్యూర్ వ్యూ' పేరుతో, ప్యూర్ డిస్‌ప్లే ప్యానెల్‌తో పాటు వెనుకవైపు పెంటా-కెమెరా సెటప్‌తో రానున్న మొదటి ఫోన్ కావడం విశేషం అయితే, వెనుకవైపు ఐదు కెమెరాలు ఉండటం ఈ ఫోన్‌లోని మరో ప్రధాన విశేషం. రియర్‌లో మొత్తం ఏడు రింగ్స్ కనిపిస్తాయి. అందులో ఐదు కెమెరా లెన్సులు. ఆరో రింగ్‌లో డ్యూయెల్ టోన్ ఎల్ఈడీ ఫ్లాష్ యూనిట్ ఉంటుంది. ఇక ఏడో రింగ్‌లో డ్యూయల్ సెన్సార్ ఉంటుంది. ముందువైపు డ్యూయల్ ఫ్రంట్ ఫేసింగ్ కెమెరాలు ఏర్పాటు చేసారు. ఈ ఫోన్‌లో 4,150 ఎంఏహెచ్ బ్యాటరీ సామర్థ్యం ఉన్నట్లు తెలుస్తోంది. 2019 జనవరి చివరి నాటికి ఈ ఫోన్ లాస్ వెగాస్‌లో విడుదల కానుంది. ఈ డివైస్ స్పెసిఫికేషన్ల విషయానికి వస్తే.. 5.9 అంగుళాల డిస్‌ప్లే, ఆండ్రాయిడ్ 9.0 పై, క్వాల్కం స్నాప్‌డ్రాగన్ 845 సాక్, 6 జీబీ ర్యామ్/ 128 జీబీ స్టోరేజ్, 8 జీబీ ర్యామ్/ 256 జీబీ స్టోరేజ్, ఫింగర్ ప్రింట్ సెన్సార్, ఫేస్ అన్‌లాక్ వంటి ప్రధాన ఫీచర్లు నోకియా అభిమానులలో మరింత ఉత్సుకతను రేపుతున్నాయి.

★



చిన్నారి

పొడుపు కథ

టక్కు టక్కు తళుక్కు
చూచుటకెంత నిక్కు
జారిపడిందంటే పుటుక్కు



జవాబు : కళ్ళజోడు

జోక్:

రాజు: టైం ఎంత?
సోము: పన్నెండు...
రాజు: అంతేనా? ఇంకా ఎక్కువవైందను కున్నా..
సోము: అంతకంటే ఎక్కువయ్యే అవకాశం లేదు. పన్నెండు తర్వాత వచ్చేది ఒకటే!

నీడ కనిపెట్టండి!



పిల్లలూ! ఇక్కడున్న చిత్రంలో.. కొన్ని బొమ్మలు వాటి నీడలు ఉన్నాయి. అందులో ఏ నీడ.. ఏ బొమ్మదో కనిపెట్టండి?!

పౌరులం-వీరులం


భారతదేశపు పౌరులం
పౌరుషమున్న వీరులం
భాధ్యతనెరిగిన సైనికులం
భరతమాత వారసులం
భావి భారత నాయకులం
మంచికి మేము మిత్రులం
అందరు మెచ్చే బాలలం!!





విజయ్
5వ తరగతి,
ప్రాథమిక పాఠశాల మెయిన్.
హెచ్. మురవణి,
కర్నూలు జిల్లా

రంగులు దిద్దండి!



పిల్లలూ! పైన మీకు ఎంతో ఇష్టమైన బొమ్మ ఉంది. దానికి చక్కటి రంగులు దిద్దండి!

నేను గీసిన బొమ్మ



ఆర్. మరియబాబు,
6వ తరగతి,
జెడ్.పి.హెచ్.స్కూలు,
పెనుమాక,
గుంటూరు జిల్లా.



పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపాల్సిన మా చిరునామా :

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ -Chinnaarips@gmail.com





సైనాపై సింధు గెలుపు





ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్

పూణే : ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌లో భాగంగా మంగళవారం జరిగిన పోటీల్లో హైదరాబాద్ హంటర్స్ జట్టు గెలుపొందింది. హంటర్స్ తరపున బరిలోకి దిగిన పివి సింధు 11-15, 15-9, 15-5 పాయింట్ల తేడాతో సైనా నెహ్వాల్‌ను ఓడించింది. మిక్స్‌డ్ డబుల్స్ తొలిమ్యాచ్‌లో ఛన్-నో(నార్త్) జోడీ 15-8, 15-14తో రంగ్-వాన్(హంటర్స్) జోడీపై గెలిచి 1-0 ఆధిక్యత సంపాదించింది. ఆ తర్వాత పురుషుల సింగిల్స్ ట్రంప్ మ్యాచ్‌లో హుయాన్(హంటర్స్) 10-15, 15-13, 15-9 పాయింట్ల తేడాతో సెన్సోబుస్క్(నార్త్)పై గెలిచి 2-1 పాయింట్ల ఆధిక్యతను చేకూర్చాడు. మహిళల సింగిల్స్‌లో సింధు సైనాను ఓడించి 3-1 ఆధిక్యతను హంటర్స్‌కు చేకూర్చింది. నార్త్ జట్టు ట్రంప్ మ్యాచ్‌గా తీసుకున్న మ్యాచ్‌లో హోవాయ్ 11-15, 14-15 పాయింట్ల తేడాతో కల్జోవ్(హంటర్) చేతిలో ఓడిపోవడంతో హంటర్స్ 4-0తో మ్యాచ్‌ను సొంతం చేసుకుంది.



ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు డెల్‌పొట్రో దూరం

సిడ్నీ : అర్జెంటీనాకు చెందిన ఐదోసీడ్ డెల్‌పొట్రో త్వరలో ప్రారంభం కానున్న ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీకి దూరం కానున్నాడు. అక్టోబర్‌లో జరిగిన షాంఘై మాస్టర్స్ టోర్నీలో డెల్‌పొట్రో మోకాలికి గాయమైంది. ఈ గాయం పూర్తిగా మానని కారణంగా వచ్చే నెలలో ప్రారంభం కానున్న తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీనుంచి వైదొలుగుతున్నట్లు నిర్వాహకులకు ట్విట్టర్ వేదికగా తెలియజేశాడు. 2018 ఏడాదిలో యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ రన్నరప్‌తోపాటు ఇండియన్‌వేల్స్ టైటిల్‌ను ముద్దాడాడు.

ఆంధ్ర 293 ఆలౌట్

సౌరాష్ట్రతో కూచ్ బిహారి ట్రోఫీ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

క్రికెట్ ప్రకాశం ఆధ్వర్యంలో ఒంగోలు సిఎస్ఆర్ శర్మ కళాశాల క్రీడామైదానంలో జరుగుతున్న అండర్-19 కూచ్ బిహారి ట్రోఫీలో ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌ను ముగించింది. ఓవర్ నైట్ స్కోరు 187/6తో ఆట ప్రారంభించిన ఆంధ్ర జట్టు 293 పరుగులకు ఆలౌట్ అయింది. ఈ జట్టులో బి.సంతోష్ కుమార్ 45(32 బంతుల్లో) పరుగులు చేశారు. సౌరాష్ట్ర బౌలర్‌లలో యువరాజ్‌సింగ్ షినోల్ 68 పరుగులిచ్చి 5 వికెట్లు, రాహుల్ వాన్‌కని 94 పరుగులిచ్చి 4 వికెట్లు దక్కించుకున్నారు. అనంతరం సౌరాష్ట్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో మంగళవారం ఆట నిలిచే సమయానికి నాలుగు వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది. ఈ జట్టులో భాగ్యరాజ్ సింగ్ చూడాసమ 42 పరుగులు, కరణ్ లగారియా 31 పరుగులు చేశారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి హెచ్ కొటక్ 25 పరుగులలో జే గోహిల్ 6 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. ఆంధ్ర బౌలర్‌లలో దుర్గా కుమార్ 29 పరుగులిచ్చి 2, ఏ.ప్రణయ్ కుమార్, వాసు చెరో వికెట్‌తో రాణించారు.



పెర్త్, మెల్‌బోర్న్‌లకు 'సగటు' రేటింగ్

ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్, పెర్త్ క్రికెట్ పిచ్‌లకు ఐసిసి 'సగటు' రేటింగ్ ఇచ్చింది. గతేడాది యాషెస్‌లో భాగంగా ఎంసీజీలో ఇంగ్లాండ్‌తో మ్యాచ్ జరిగింది. అప్పుడు పిచ్ పేలవంగా ఉండటంతో మూడు డీమెరిట్ పాయింట్లు విధించారు. అప్పటితో పోలిస్తే ప్రస్తుతం కాస్త మెరుగైందని ఐసీసీ తెలిపింది. పిచ్ పేలవంగా ఉంటే ఐసిసి మూడు డీమెరిట్ పాయింట్లు విధిస్తుంది.

ఐపిఎల్‌లో ప్రధాన బౌలర్లకు విశ్రాంతిపై

కోహ్లీ, ధోనీ చెరోవైపు

న్యూఢిల్లీ: మే 30 నుండి ఇంగ్లాండ్‌లో ప్రారంభం ఐసిసి వన్డే ప్రపంచ కప్‌లో పాల్గొనే భారతజట్టు ప్రధాన పేస్ బౌలర్లకు ఐపిఎల్‌లో ఆడకుండా విశ్రాంతి నివ్వాలంటూ కోహ్లీ... ఐపిఎల్ ఆడినా ఫర్వాలేదంటూ ధోనీ భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేశారు. టీమిండియా సారథి విరాట్ కోహ్లీ ఇటీవల క్రికెట్ పరిపాలక కమిటీ (సీఓఏ)కి ఈ విషయాన్ని గురించి వివరిస్తూ ఐపిఎల్‌లో టీమిండియా ప్రధాన బౌలర్లు ఆడడం ద్వారా గాయాలబారినపడితే వన్డే ప్రపంచకప్‌కు దూరం కావాల్సి వస్తుందన్నాడు. అంతేగాక ఐపిఎల్ ముగిసిన రెండు వారాల వ్యవధిలోనే ఐసిసి వన్డే ప్రపంచకప్ ప్రారంభం కానున్న దృష్ట్యా ప్రధాన బౌలర్లు గాయాలబారినపడితే కోలుకొనేంత సమయం కూడా లేని కారణంగా వీరు ప్రధాన టోర్నీకి దూరం కావాల్సి వస్తుందనే అభిప్రాయాన్ని కోహ్లీ సిఓఏ ముందుంచాడు. అయితే భారతజట్టు మాజీ సారథి, చెన్నై సూపర్‌కింగ్స్ సారథి మహేంద్రసింగ్ ధోనీ మాత్రం అందుకు భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాడు. ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ధోనీ ఈ విషయమై స్పందిస్తూ 'నాలుగు ఓవర్లు బౌలింగ్ చేసినంత మాత్రాన బౌలర్లేమీ అలసిపోరని, అంతేగాక వారిలో నైపుణ్యం పెరుగుతుందన్నాడు. ప్రధాన టోర్నీకి ముందు బౌలింగ్‌లో మెళకువలు నేర్చుకునేందుకు, అలాగే ఒత్తిడిలోనూ రాణించే సామర్థ్యం వస్తుందన్నాడు. బౌలర్లు అందరూ ఐపిఎల్ ఆడవచ్చని నేను భావిస్తున్నాను. అయితే వారు తీసుకునే ఆహారం, నిద్ర విషయాల్లో మాత్రం శ్రద్ధ పెట్టాల్సి ఉంటుంది' అని తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. కాగా టీమిండియా ప్రపంచకప్‌కు ముందు ప్రస్తుతం ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో తలపడనుండగా, ఆ తర్వాత న్యూజిలాండ్‌తో వన్డే, టీ20 సిరీస్‌లు మాత్రమే పాల్గొననుంది. అనంతరం ఐపిఎల్‌లో బిజీ కానుంది. ఇప్పటికే ఐసిసి వన్డే ప్రపంచ కప్‌ను దృష్టిలో ఉంచుకొని ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ జట్లు తమ ఆటగాళ్లను ఈ ఏడాది ఐపిఎల్‌లో పాల్గొనకుండా నిషేధం విధించిన సంగతి తెలిసిందే.

ఐపీఎల్‌కు బుమ్రా దూరం?

వచ్చే వరల్డ్‌కప్‌కు సన్నద్ధమయ్యే క్రమంలో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ క్రికెట్ జట్లకు చెందిన పలువురు కీలక ఆటగాళ్లు ఐపిఎల్‌కు దూరం కానున్న సంగతి తెలిసిందే. ఇదే తరహాలో భారత్‌కు చెందిన కీలక బౌలర్లకు విశ్రాంతి కల్పించాలని టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ ఇటీవలే బీసీసీఐ పరిపాలక కమిటి(సీఓఏ)ముందు తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. కోహ్లీ సూచనపై సీరియస్‌గా దృష్టి సారించిన బోర్డు పెద్దలు ఇప్పుడు అదే పనిలో ఉన్నారు. ప్రధానంగా కీలక బౌలర్లకు ఐపీఎల్ నుంచి విశ్రాంతి కల్పించాలనే యోచనలో ఉన్నారు. రాబోయే సీజన్‌లో ముంబయి ఇండియన్స్ జట్టు బుమ్రా సేవలను కోల్పోయే అవకాశం ఉందనే విషయాన్ని బిసిసిఐ ఉన్నతాధికారి ఒకరు సూత్రప్రాయంగా వెల్లడించారు. ఒకవేళ బుమ్రా ఫిట్‌గా ఉంటే కీలక మ్యాచ్ ల్లో ఆడించి మిగతా మ్యాచ్‌ల్లో విశ్రాంతి కల్పించాలని బిసిసిఐ ఆలోచన చేస్తోంది. ముఖ్యంగా ముంబయి ఇండియన్స్ ప్లే ఆఫ్ దశకు చేరిన పక్షంలో బుమ్రాను ఆడించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం.

ఫాలోఆన్‌లో హైదరాబాద్

ఆంధ్రతో రంజీట్రోఫీ

విశాఖపట్నం : రంజీట్రోఫీ ఎలైట్ గ్రూప్-బి ఎనిమిదోరౌండ్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు ఫాలోఆన్ బ్యాటింగ్‌కు దిగింది. అంతకుముందు ఆంధ్రజట్టు తొలి ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్ల నష్టానికి 502 పరుగుల భారీ స్కోర్‌ను చేసిన సంగతి తెలిసిందే. మంగళవారం హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 271 పరుగులకే పరిమితమైంది. ఆకాష్‌రెడ్డి 57, అగర్వాల్ 59 పరుగులు చేయగా శశికాంత్‌కు ఐదు, పృథ్విరాజ్‌కు మూడు వికెట్లు దక్కాయి. అనంతరం హైదరాబాద్ ఫాలో ఆన్ ఆడుతూ రెండో ఇన్నింగ్స్‌లో వికెట్లేమీ నష్టపో కుండా 33 పరుగులు చేసింది. అగర్వాల్ 13, తిలక్‌వర్మ 20 పరుగు లతో క్రీజ్‌లో ఉన్నారు. నేటితో మ్యాచ్ ముగియనుండడంతో ఆంధ్రకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించడం ఖాయం.

టీ20 ప్రపంచకప్‌కు అర్హత సాధించని శ్రీలంక, బంగ్లాదేశ్

దుబాయ్: 2014 టీ20 ప్రపంచకప్ విజేత శ్రీలంక, బంగ్లాదేశ్ జట్లు వచ్చే ఏడాది ఆస్ట్రేలియాలో జరిగే ఐసిసి టీ20 ప్రపంచకప్‌లో నేరుగా పాల్గొనేందుకు అర్హత సాధించలేకపోయాయి. అంతర్జాతీయ క్రికెట్ నియంత్రణ మండలి(ఐసిసి) తాజాగా విడుదల చేసిన జాబితాలో శ్రీలంక 9వ, బంగ్లాదేశ్ 10వ స్థానంలో నిలిచాయి.

తొలి ఎనిమిది స్థానాల్లో నిలిచిన జట్లు నేరుగా అర్హత సాధిస్తున్న విషయం తెలిసిందే. మంగళవారం ఐసిసి విడుదల చేసిన జాబితాలో పాకిస్థాన్, భారత్, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, వెస్టిండీస్, అఫ్గానిస్తాన్ జట్లు తొలి ఎనిమిది స్థానాల్లో నిలిచినట్లు ప్రకటించింది. దీంతో శ్రీలంక, బంగ్లాదేశ్ జట్లు గ్రూప్ దశ పోటీల్లో తలపడాల్సి ఉంటుంది. ఆస్ట్రేలియాలో టీ20 ప్రపంచకప్ వచ్చే ఏడాది అక్టోబర్ 18 నుంచి నవంబర్ 15 వరకు జరగనుంది.

టిమ్‌పైన్ కుటుంబంతో పంత్

సిడ్నీ : భారత్-ఆస్ట్రేలియాల బోర్డర్-గవాస్కర్ సిరీస్ సందర్భంగా టిమ్ పైన్, భారత యువ వికెట్ కీపర్ రిషభ్ పంత్‌ల మధ్య స్లెడ్జింగ్ జరిగిన విషయం తెలిసిందే. ఓవైపు నాల్గో టెస్ట్‌లో ఆటగాళ్లు మరే వివాదానికి దారితీస్తుందో అని క్రికెట్ అభిమానులు కవలవరపడుతుంటే ఇదంతా ఉత్తదే.. ఆటలో భాగమేనని, మైదానం దాటితే తామంతా మంచి స్నేహితులమని పంత్ చాటిచెప్పాడు. మూడోటెస్ట్‌లో టిమ్‌పైన్.. 'పంత్.. నా పిల్లలను ఆడించు.. నేను నా భార్యను సినిమాకు తీసుకెళ్తా!' అని సరదాగా అన్న వ్యాఖ్యలను పంత్ సీరియస్‌గా తీసుకున్నాడో ఏమో కానీ అతను అన్నట్లే పైన్ సతీమణి బొనీపైన్‌ను కలిసి వారి పిల్లలను ఆడించాడు. ఈ విషయాన్ని బొనీయే తన ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొంది. అంతేకాకుండా పంత్ బెస్ట్ బేబీసిట్టర్ అని కొనియాడింది. ప్రస్తుతం ఈ ఫొటో హల్‌చల్ చేస్తోంది.



Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68